



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI






మంగళవారం | 17-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 242 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా. 1.38 తదుపరి సప్తమి; నక్షత్రం: మఖ రా. 1.27 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 2.07-3.38; దుర్ముహూర్తం: ఉ. 8.54-9.38, రా. 9.58-10.48; అమృతఘడియలు: రా. 11.11-12.41 ; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 5.40 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

# మేమంటే మేమే!

## ఎస్సీ, ఎస్టీలకు మేలుపై వాగ్వాదం

### 2 వర్గాలకు వేర్వేరు కమిషన్లు.. బిల్లులకు శాసనసభ ఆమోదం

### బఫూన్లలా వాళ్ల తీరు!

**'ప్రతిపక్ష నేత' అర్హత బాబుకు లేదు**

సస్పెండ్ చేసినా తప్పులేదు

టీడీపీ ఎమ్మెల్యేలపై జగన్ ఆగ్రహం

చంద్రబాబు నోరుతెరిస్తే అబద్ధాలే

సీఎంగా దళితుల్ని చులకన చేశారు

వారిలో పుట్టాలనుకుంటారా అని అన్నారు

2003 దాకా ఎస్సీ, ఎస్టీ కమిషన్ తేలేదు

అసెంబ్లీలో విరుచుకుపడ్డ ముఖ్యమంత్రి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ల బిల్లులకు సభ ఆమోదం



### మేలు జరిగింది మాతోనే

**ఎస్సీ వర్గీకరణ చేపట్టింది మేమే!**

ప్రతిభా భారతిని స్పీకర్‌ను చేశాం

మాధవరావును సీఎస్‌గా వేశాం

గురుకుల పాఠశాలలు పెట్టాం

ఎస్సీలకు 15 వేల కోట్లు కేటాయించి

6011 కోట్లయినా ఖర్చు చేయలేదు

జగన్ కావాలనే రెచ్చగొడుతున్నారు

హక్కుల నోటీసుపై చర్చించకుండా పరార్

టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజం

"దళిత, బీసీ, మైనారిటీలపై చంద్రబాబు దారుణమైన వివక్ష చూపించడం వల్లే రాష్ట్రంలో 36 ఎస్సీ, ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కటి మాత్రమే టీడీపీ గెలుచుకుంది. - జగన్

### 'ఇంగ్లిష్' బిల్లుకు ఓకే

ఇక రైట్ టు ఇంగ్లిష్ ఎడ్యుకేషన్

16 బిల్లులకు శాసనసభ ఆమోదం 11

ఆరున్నర నెలల్లో 67 రైతు ఆత్మహత్యలు

"గురుకుల పాఠశాలలు తెచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమే. ఎస్సీల్లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాం. దాని వల్ల మాదిగలకు న్యాయం జరిగింది. - చంద్రబాబు



పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా వేలాది మంది పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ

# విద్యార్థి పిడికిలి

## యూనివర్సిటీలు, దేశవ్యాప్తంగా నిరసనలు

జామియాలో పోలీసుల ఉక్కుపాదంపై ఆగ్రహం

ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌ల సంఘీభావం

విద్యార్థులకు మద్దతుగా మమత భారీ ర్యాలీ

కేరళలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ ఉమ్మడి ఆందోళన

ఫలక్‌నుమా, కోరమాండల్ సహా

**17 రైళ్లు రద్దు**

జామియా విద్యార్థులపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు కదం తొక్కారు! నిరసనలు, ఆందోళనలతో హోరెత్తించారు! ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు! దీనిపై ప్రధాని మోదీ స్పందించారు! హింసపై కలత చెందానని ఆవేదన వ్యక్తం చేశారు. 9



### హింసపై కలతచెందా!

శాంతిని పాటించే సమయమిది

వదంతులకు దూరంగా ఉండండి

చట్టం ఏ మతానికీ విరుద్ధం కాదు

ఎవరి పౌరసత్వమూ పోదు:మోదీ

ఇండియా గేట్ ఎదుట ప్రియాంక గాంధీ ధర్నా



### బూట్లతో కొట్టుకొంటూ.. 11

వైసీపీ వీరాభిమాని ఆక్రోశం

రేషన్, పింఛను ఇవ్వకుండా మా నేతలే అడ్డుకొంటున్నారు

చిత్తూరు స్పందనలో గోడు



### నమ్మి ఓటేసి మోసపోయారు 10

3వేల వృద్ధాప్య పింఛను ఏదీ?

కొత్త పెన్షన్ ఒక్కటీ ఇవ్వలేదు

మాట తప్పుతోందా.. మోసం చేస్తోందా..?

జగన్ ప్రభుత్వంపై పవన్ ఫైర్






## ఆర్టీసీ కార్మికులంతా



# 1 నుంచి ప్రభుత్వ ఉద్యోగులే

ప్రజా రవాణాలో కొత్త సంవత్సరం నుంచి సరికొత్త అధ్యాయం మొదలవుతోంది. ఆర్టీసీ కార్మికులంతా ఇక ప్రభుత్వ ఉద్యోగులే! దీనికి సంబంధించిన బిల్లును సోమవారం అసెంబ్లీలో ఆమోదించారు. 'ప్రభుత్వంలో విలీనం' సరే... మరి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీత భత్యాలు ఉంటాయా? పాత పెన్షన్లు చెల్లిస్తారా? ప్రభుత్వంలో విలీనమైన తర్వాత కార్మిక సంఘాలు కొనసాగుతాయా? ఔట్ సోర్సింగ్ సిబ్బంది భవిష్యత్తు ఏమిటి? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు!

## చరిత్రాత్మక బిల్లు తీసుకొచ్చాం: సీఎం

విలీనాన్ని చిరునవ్వుతో స్వాగతిస్తున్నాం

ఐదేళ్లలో బాబు వారిని పట్టించుకోలేదు

ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు

సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్వజం

ఉద్యోగుల విలీనం బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

### విలీనం ఆనందమే.. కానీ!

జీతభత్యాల తేడా మాటేంటి?.. బిల్లులో పాత పెన్షన్ ఊసేదీ!

'అవుట్ సోర్సింగ్' భవిష్యత్ ఏంటి?.. సిబ్బందిలో అనుమానాలు

2 వారాలే గడువు.. ఆలోపు నివృత్తిచేయాలి 2

అన్నింటా సమానంగా చూడాలి.. కార్మిక సంఘాల అభ్యర్థన

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులందరూ జనవరి 1 నుంచి ప్రభుత్వ ఉద్యోగులేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లును శాసనసభ సోమవారం ఆమోదించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంస్థలోని 52 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల విలీన కార్యక్రమాన్ని చిరునవ్వుతో స్వాగతిస్తున్నామన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో వారిని పట్టించుకోలేదని.. ఇప్పుడు టీడీపీ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులు.. ప్రభుత్వంలో విలీనం కాకుండా గతంలో చంద్రబాబు చట్టం తెచ్చారని.. ఆర్టీసీ కార్మికుల విలీనానికి ఆ చట్టం అడ్డంకిగా మారిందని.. అందుకే వారికోసం చరిత్రాత్మక బిల్లు తీసుకొచ్చామని తెలిపారు. ప్రధాన బిల్లులపై చర్చ జరుగుతున్నా చంద్రబాబు సభలో కనపడడంలేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే రామానాయుడు కాంట్రాక్టు ఉద్యోగులను



మిగతా 2వ పేజీలో...

# కక్షతోనే శిక్ష!

## జాస్తి కృష్ణ కిశోర్‌పై క్రిమినల్ కేసు

రాత్రి పొద్దుపోయాక సీఐడీ నమోదు

ఆడిటింగ్ నిబంధనలు ఉల్లంఘించారని, ప్రకటనలు నేరుగా ఇచ్చారని ఆరోపణలు

'ప్రొసీజరల్' లోపాలకూ క్రిమినల్ కేసులా?

విచారణ, వివరణ, రికవరీతో సరిపెట్టేచోట ఏకంగా సస్పెన్షన్, కేసు పెట్టడమేమిటి!

జగతి మూలాలు తవ్వినందుకే ఇలాగా!?

అధికార వర్గాల్లోనే విస్మయం

ఈడీబీ ద్వారా 2595 కోట్ల పెట్టుబడులు

పెట్టిన ఖర్చుతో పోల్చితే ఎంతో ఘనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"అకౌంటింగ్, ఆడిటింగ్ నిబంధనలు పాటించకుండా ఖర్చు పెట్టేశారు! ఈడీబీ ప్రకటనలను సమాచార పౌరసంబంధాల శాఖ ద్వారా కాకుండా నేరుగా ఇచ్చేశారు!!"

ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్‌పై కేసు పెట్టడానికి సీఐడీ చూపిన కారణాలివి! ఆదివారం రాత్రి పొద్దుపోయాక సీఐడీ ఈ కేసు నమోదు చేసింది! ఈ కారణాలతో సీనియర్ ఐఆర్ఎస్ అధికారిపై, అందులోనూ కేంద్రం నుంచి డిప్యుటేషన్ వచ్చిన అధికారిపై క్రిమినల్ కేసు పెట్టడంపై అధికారవర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. భారీగా అవినీతికి పాల్పడటం, వ్యక్తిగతంగా ఆస్తులు సంపాదించుకోవడం, క్విడ్‌ప్రోకో

మిగతా 2వ పేజీలో...



రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బోర్డు సీఈవోగా పని చేసిన ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్‌ను ఎందుకు సస్పెండ్ చేశారు? ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయడానికి కారణమేమిటి? ఆయన అంత ఘోరమైన నేరాలు చేశారా? లేక... పదేళ్ల క్రితం జగన్ అక్రమాస్తుల కేసులో ఐటీ అదనపు కమిషనర్‌గా కీలక నివేదికను రూపొందించడమా? కిశోర్‌పై చర్యలు... నిబంధనలు ఉల్లంఘించినందుకా? లేక... పాత కక్షలు తీర్చుకునేందుకా? సీఐడీ నమోదు చేసిన కేసు వివరాలను పరిశీలిస్తే... ఇది అచ్చంగా కక్ష సాధింపేనని అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి.

### 'సస్పెన్షన్' ఆపండి!

క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు

# క్రైస్తవ బిడ్డలకు సంతోష సంవత్సరం!

గుంటూరులోనే 6 వేల మందికి ఉద్యోగాలు

నాకూ కలెక్టర్ ఉద్యోగం వచ్చింది

క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ హర్షం



అమరావతి, డిసెంబరు 16: ఈ సంవత్సరం క్రైస్తవ బిడ్డలకు చాలా సంతోషకరమైనదని గుంటూరు జిల్లా కలెక్టర్ శామ్యూల్ పేర్కొన్నారు. జిల్లాలో, రాష్ట్రంలో ఎంతోమందికి ఉద్యోగాలు

మిగతా 2వ పేజీలో...



9

### అయోధ్యలో 4 నెలల్లోనే రామాలయం

ఆకాశాన్నంటేలా నిర్మిస్తాం: అమిత్ షా

# కీచక టీచర్!

## విద్యార్థినిపై అత్యాచారం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

స్కూల్‌లో అనుకూల, వ్యతిరేక వర్గాల ఘర్షణ

మైనర్ బాలికపై ఆర్నెలలుగా అత్యాచారం

బాలికపై బాలుడి అత్యాచారయత్నం



10

ఆ బాలిక కుటుంబానికి

### 10 లక్షలు!

ధైర్యం చెప్పిన హోం మంత్రి



పరంజ్యోతి

# వ్యసనాలు పోవాలంటే..



హిమాలయాల్లో స్వర్ణగంగాపురం సమీపంలో పద్మగుప్తుడనే సంపన్నుడుండేవాడు. అతనికి లేకలేక కలిగిన పుత్రుడు సుకుమారుడు. అతి గారాబంవల్ల తండ్రి సుకుమారునిపై శ్రద్ధ చూపలేదు. ఫలితంగా సుకుమారుడు దుష్టస్నేహాలతో దురలవాట్లకు లోనయ్యాడు. వ్యసనపరుడైన కుమారుని చూసి పద్మగుప్తుడు క్రుంగిపోయాడు. అయితే ఎక్కువ కలవరం చెందకుండా తమ గ్రామానికి దగ్గరలో ఉన్న సిద్ధపురంలోని తన గురువు మాణిక్య చూడుడి వద్దకు కుమారుని తీసుకువెళ్లాడు. సర్వసిద్ధి సంపన్నుడైన గురువు.. పద్మగుప్తుని ఆగమన కారణాన్ని తెలుసుకుని, సుకుమారుని తన వద్ద విడిచి వెళ్లమన్నాడు. అప్పటికి సాయంకాలం కావస్తున్నది. సుకుమారునికి ఒక పర్ణశాలను చూపి.. ఆ రాత్రికి విశ్రాంతిని తీసుకుని మరునాడు ఉదయం తనను సూర్యోదయ హవనం తరువాత కలుసుకోమన్నాడు. ఆ పర్ణశాలలో ప్రవేశించిన సుకుమారుడు.. మునుపెన్నడూ చూడని మాదకద్రవ్యాలు, మత్తుపానీయాలు చూసి ఆశ్చర్యపోయాడు. అయితే.. 'వీటిని సేవించవద్దు' అని అక్కడ రాసి ఉంది. సుకుమారుడు ఆ హెచ్చరికను పట్టించుకోకుండా, తనకు నచ్చినవన్నీ మూర్ఛ వచ్చేవరకూ సేవించాడు. ఉన్నట్టుండి ఆకాశంలో తేలుతూ గంధర్వపురం చేరుకున్నాడు. గంధర్వ రాజకుమారి అతనికి స్వాగతం పలికింది. అతన్ని వరించింది. ఇదంతా మాణిక్యచూడుని ఆశ్రమంలో సుకుమారుడు త్రాగిన సిద్ధరస ప్రభావమని చెప్పింది. గంధర్వలోకం అతనికి దాసోహమంది. అలా ఎంతకాలం గడిచిందో తెలియలేదు. అక్కడ ఒక గదివెలుపల 'ఈ గదిలోకి వెళ్లవద్దు' అని రాసి ఉంటే.. కుతూహలంగా ఆ గదిలోకి ప్రవేశించాడు సుకుమారుడు. అంతే! ఎవరో విసిరేసినట్టు గురువు ఆశ్రమంలోని పర్ణశాలలో పడ్డాడు. తన ఎదురుగా ఒక నిలువుటద్దం ఉంది. ముఖమంతా వికృతమై, ముడుతలు పడి.. పండు ముదుసలిగా ఉన్నాడు. అది సూర్యోదయ హవన సమయం. నడవలేక నడవలేక గురువు దగ్గరకు వచ్చాడు. గురువు చిరునవ్వు నవ్వుతూ "నీవు గడచిన రాత్రి రెండుసార్లు నియమాతిక్రమణ చేశావు. ఫలితమిది. సరే. ఒక మండలం పాటు నేను చెప్పిన విధంగా ఆదిత్యవ్రతాన్ని ఆచరించు. అంతా మంచి జరుగుతుంది" అని చెప్పాడు. వ్రతనియమాలను ఇలా వివరించాడు. "ఏ వ్రతమైనా ఈ నియమాలు పాటించదగినవి. సూర్యోదయం కన్నా మునుపు నిద్ర లేవాలి. స్నాన, శౌచాలను పాటించాలి. బ్రహ్మచర్య దీక్ష చేపట్టి.. మాంసాదులను విడిచిపెట్టాలి. సత్యవాక్పాలన, భూశయనం, ఇంద్రియాకర్షణకు లోనుకాకపోవడం, ఏకాగ్రచిత్తంతో దైవధ్యానం చేయడం, జపం చెయ్యడం ఇవన్నీ వ్రతాంగములు. ఈ నియమాలను పాటిస్తే నీకు మంచి కలుగుతుంది" అని చెప్పాడు. సుకుమారుడు గురువు చెప్పినట్లు నలభైరోజులు చేసి వ్రతసమయంలో గురువు ఇచ్చిన హవిష్యాన్నం ప్రసాదంగా గ్రహించి నలభయ్యో రోజుకు వజ్రశరీరుడు అయ్యాడు. గురువుకు కృతజ్ఞతాభావంతో నమస్కరించాడు. అప్పుడు గురువు.. "ముట్టుకోకూడదన్న వస్తువులను ముట్టుకుంటే తాత్కాలిక సుఖం వచ్చినా నీవు ఎలా పతనమయ్యావో.. సమాజంలో దుర్వ్యసనాలపాలైనా అంతే. వ్యసనానుభావం సుఖమనిపించినా పర్యవసానం దుఃఖమే. ఏ వ్యసనానికైనా విరుగుడు వ్రతాచరణం" అని వివరించాడు. సుకుమారుడు గురువు దగ్గర సెలవు తీసుకుని.. ఇంటికి చేరి చక్కని జీవితాన్ని గడిపి అందరి మన్ననలను పొందాడు.

- ఆచార్య రాణి సదాశివ మూర్తి

ఆర్టీసీ కార్మికులంతా 1 నుంచి

# ప్రభుత్వ ఉద్యోగులే

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని అన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొనే వారు చేయలేని పనిని జగన్ చేశారని రవాణా, సమాచార పౌరసంబంధాల మంత్రి పేర్ని నాని అన్నారు. పాదయాత్రలో చెప్పిన విధంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి 200 రోజుల్లో చట్టం తెచ్చారని కొనియాడారు. విలీనానికి ఆర్టీసీ బోర్డు కూడా అంగీకారం తెలిపిందని.. ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి కొత్తగా ప్రజా రవాణా విభాగం ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు పెంచిన జీతాలను బకాయిలు పెడితే వాటిని కూడా తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఆర్టీసీ అప్పుల భారం రూ3,600 కోట్ల బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచామన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న పాలన ప్రజలు చూశారని, ఆరు మాసాల పాలన ఎలా ఉందో చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో అనేక సార్లు బస్సు చార్జీలు పెంచిందని.. ఆర్టీసీకి ప్రయాణికుడు దూరమయ్యేలా తమ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోదని చెప్పారు.

## పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

పెన్షన్‌పై ఆర్టీసీ కార్మికులు అయోమయంలో ఉన్నారని, వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీడీఎల్పీ ఉపనేత రామానాయుడు డిమాండ్ చేశారు. యూనియన్లను కొనసాగించాలని.. ఆర్టీసీ కార్మికులకు సీలింగ్ లేని వైద్యసేవలు అందించాలని, పోలీసులకు వర్తించే బీమా సౌకర్యం వీరికి కూడా వర్తింపజేయాలని సూచించారు. ఆర్టీసీలో ఉన్న కాంట్రాక్టు డాక్టర్లను కొనసాగించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మహిళా ఉద్యోగులకూ అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఆర్టీసీ బస్టాండ్లలో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్‌గా అన్‌ఫిట్ అయిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఆర్టీసీ విలీనంపై తెలంగాణ ముఖ్యమంత్రి హేళనగా మాట్లాడారని, ఆయన వ్యాఖ్యానించినట్లు విలీనం ఉండకూడదని సూచించారు.

# విలీనం ఆనందమే.. కానీ!

- జీతభత్యాల తేడా మాటేంటి?
- బిల్లులో పాత పెన్షన్ ఊసేదీ!
- 'అవుట్ సోర్సింగ్' భవిష్యత్ ఏంటి?
- ఆర్టీసీ సిబ్బందిలో అనుమానాలు




అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై సోమవారం కీలకమైన ముందడుగు పడడంతో ఆ సంస్థ అధికారులు, కార్మికులు, సిబ్బందిలో హర్షాతిరేకాలు మొదలయ్యాయి. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచాలంటూ కొట్లాడే కార్మికులు ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ ఉద్యోగులవుతున్నారు. రవాణా మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అసెంబ్లీలో సోమవారం బిల్లు ప్రవేశపెడతారన్న వార్తల నేపథ్యంలో 52 వేల మంది ఉత్కంఠతో ఎదురు చూశారు. ఎట్టకేలకు సభలోకి బిల్లు రావడం.. ఆమోదముద్ర కూడా పడడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. అయితే పాత పెన్షన్ విధానం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీత భత్యాలు, ఇతర సౌకర్యాలపై బిల్లులో స్పష్టత లేకపోవడంతో ప్రశ్నలు సంధిస్తున్నారు.

### 51,700 మంది..

13 జిల్లాల్లో 12 వేల బస్సులతో ప్రతి రోజూ 69 లక్షల మందికి ప్రయాణ సేవలందిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీలో అధికారులు, సిబ్బంది, కార్మికులు అందరూ కలిపి 51,700 మంది ఉన్నారు. వీరితోపాటు మరో 7,500 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది కూడా పని చేస్తున్నారు. లాభ నష్టాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామానికీ సేవలందిస్తున్న ఈ సంస్థ.. డీజిల్ ధరల పెరుగుదల, పన్నుల భారం పెరగడంతో ఎప్పుడూ నష్టాల బాటలోనే నడుస్తుంటుంది. ఇలాంటి సంస్థలో రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసే కార్మికులు ప్రతి నాలుగేళ్లకోసారి జరిగే వేతన సవరణ సందర్భంగా మెరుగైన జీత భత్యాల కోసం ఆందోళన బాట పట్టక తప్పని పరిస్థితి వస్తోంది. అయితే ఈ సమస్యకు శాశ్వతంగా మంగళం పాడాలని జగన్ ప్రభుత్వం సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించింది. అయితే కేంద్రం 31 శాతం వాటా ఇవ్వడంతోనే ఆర్టీసీ ఆవిర్భవించిందని.. ఏకపక్షంగా విలీనం సాధ్యం కాదని నిపుణుల కమిటీ తేల్చింది. దీంతో సిబ్బంది వరకు విలీనం చేద్దామని ప్రభుత్వం నిర్ణయించింది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(పీటీడీ) ఏర్పాటు చేసి 2020 జనవరి 1 నాటికి మొత్తం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ప్రక్రియను పూర్తిచేసిన పీటీడీ ఏర్పాటు కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీంతో మంత్రి పేర్ని అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టారు.

### అనుమానాల నివృత్తి ఎప్పుడు..?

విలీన ప్రక్రియ మొదలైనప్పటి నుంచీ కార్మికులు, సిబ్బంది, అధికారులు పలు అనుమానాలు లేవనెత్తుతున్నారు. అందులో ప్రధానమైన అంశం పెన్షన్ ఉంటుందా.. లేదా అనేది. దీంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికే ఉన్న సౌకర్యాలు తమకూ వర్తింపజేయాలని.. జీత భత్యాల వ్యత్యాసాన్ని కూడా సమానం చేయాలని ఈయూ, ఎన్ఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, కార్మిక పరిషత్, వైఎస్ఆర్ మజ్దూర్ తదితర సంఘాలు కమిటీకి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశాయి. అయితే సోమవారం సభ ఆమోదించిన బిల్లులో ఆ అంశాలేవీ లేవు. వారి డిమాండ్లు అలాగే మిగిలిపోయాయి. విలీన గడువు ఇంకా రెండు వారాలు మాత్రమే ఉండడంతో ఆలోపే స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వానికి కార్మికులు విన్నవిస్తున్నారు.

### మాకూ న్యాయం చేయరూ!

ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్రలో 65 వేల మంది ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని మాటిచ్చారని ఇప్పుడు 52 వేల మందికి మాత్రమే న్యాయం జరుగుతోందని అవుట్ సోర్సింగ్ సిబ్బంది గుర్తు చేస్తున్నారు. జగన్ హామీ ఇచ్చే నాటికి ఆర్టీసీలో పర్మినెంట్ సిబ్బంది 54 వేల మంది, కాంట్రాక్టు కార్మికులు 1500 మంది, అవుట్ సోర్సింగ్ 7,500 మంది ఉన్నారని.. 65వేల మంది అనడంతో అందరినీ దృష్టిలో పెట్టుకుని హామీ ఇచ్చినట్లు తాము భావించి సంతోషించామని.. ఇప్పుడు తమను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పెద్దమనసు చేసుకుని తమకు న్యాయం చేయాలని విన్నవిస్తున్నారు.

### కార్మిక సంఘాల హర్షం..

విలీన బిల్లు ఆమోదం పట్ల కార్మిక సంఘాలన్నీ హర్షం వ్యక్తం చేశాయి. అయితే ఆర్టీసీ ఉద్యోగుల విలీనం ద్వారా అందరూ ఆశించిన పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని గుర్తింపు కార్మిక సంఘం ఈయూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. జనవరి 1 నుంచి ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో చేర్చే బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందడం సంస్థ రాష్ట్ర నేతలు వైవీ రావు, పలిశెట్టి దామోదర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. విలీన కమిటీకి ఈయూ తరపున ఇచ్చిన 26 అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూడాలని కోరారు. అలాగే.. ఆరు దశాబ్దాల చిరకాల కోరిక నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఎన్ఎంయూ పేర్కొంది. అయితే 2004కు ముందు ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేసిన పెన్షన్ విధానాన్ని పీటీడీ సిబ్బందికి అమలు చేయాలని ఆ సంస్థ రాష్ట్ర నాయకులు పీవీ రమణా రెడ్డి, వై. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. కాగా.. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలతోపాటు పాత పింఛను వర్తింప జేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు సుందరయ్య, జిలానీ ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో ఆర్టీసీ విలీన బిల్లు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు కష్టపడుతున్న కార్మికులకు ఉద్యోగ భద్రత తోపాటు జనవరి 1న నిజమైన పండుగను కల్పించిన ముఖ్యమంత్రి జగన్, రవాణా మంత్రి పేర్ని నానిలకు వైఎస్ఆర్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకులు చల్లా చంద్రయ్య, రాజిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 52 వేల ఆర్టీసీ సిబ్బంది కుటుంబాల్లో కొత్త పండుగ తెచ్చిన సీఎం జగన్‌ను గుండెల్లో పెట్టుకుంటామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## లోకం తీరు




ఇక్కడ కూడా పెంచారటరా.. పదా..!

## చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 18.4 | 31.4 |
| హైదరాబాద్ | 19.0 | 29.0 |
| అనంతపురం | 19.0 | 29.4 |
| విశాఖపట్నం | 20.4 | 30.4 |
| చిత్తూరు | 21.9 | 25.3 |
| ఒంగోలు | 22.4 | 30.6 |

## దక్షిణ కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి తమిళనాడు, దానికి ఆనుకుని వున్న దక్షిణ కోస్తా, రాయలసీమ పైకి తూర్పుగాలులు బలంగా వీస్తున్నాయి. దీంతో సోమవారం ఉదయం నుంచి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో అనేక చోట్ల ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఇంకా కోస్తా, రాయలసీమల్లోని మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం వరకు సూళ్లూరుపేటలో ఐదు, ఏకసిరి, పెళ్లకూరు, శ్రీకాళహస్తిల్లో మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి.





## పాక్‌ను ఉగ్రవాదుల అడ్డాగా మారనివ్వం

పాకిస్థాన్‌ను ఉగ్రవాదుల అడ్డాగా మారనివ్వం. దేశాన్ని మూఢవిశ్వాసాలకు నిలయంగా మార్చాలన్న తీవ్రవాదుల కుట్రను సాగనివ్వం. దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలిస్తాం. శాంతి, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పేందుకు దేశ ప్రజలంతా కలిసి కృషి చేయాలి.

- పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ



## పాక్ కంటే బంగ్లాదేశ్ అన్ని రంగాల్లో ముందుంది

*1971లో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు కొత్త దేశం మనుగడపై అందరూ ఆందోళన చెందారు. కానీ ఇప్పుడు సామాజిక, ఆర్థిక రంగాల్లో పాక్ కంటే బంగ్లాదేశ్ ముందుంది. ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలో 8.15 జీడీపీతో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలిచింది.*

- హసన్ మహమూద్, బంగ్లాదేశ్ మంత్రి

## తరగతి గదుల పరిమాణానికి పిల్లల చదువుకు సంబంధం లేదు

వాషింగ్టన్, డిసెంబరు 16: తరగతి గదులు చిన్నగా ఉంటే పిల్లలకు పాఠాలు బాగా వినబడతాయని, చదువు బాగా వస్తుందని తల్లిదండ్రులు భావిస్తారు. పిల్లలను సులభంగా నియంత్రించవచ్చని అనుకుంటారు. అయితే తరగతి గదుల పరిమాణానికి, పిల్లలు నేర్చుకొనే అంశాలకు ఎలాంటి సంబంధం లేదని అమెరికా పరిశోధకులు చెప్పున్నారు. ఒక్కోదేశంలో ఒక్కో సైజులో తరగతి గదులు ఉంటాయి. శాస్త్రవేత్తలు 50 దేశాల్లో 13-14 సంవత్సరాల వయస్సున్న కొంత మంది విద్యార్థులపై కొన్నేళ్ల పాటు పరిశోధనలు జరిపారు.

క్రైస్తవ బిడ్డలకు

## సంతోష సంవత్సరం!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయని... తనకు కూడా ఈ సంవత్సరమే కలెక్టర్ ఉద్యోగం వచ్చిందని చెప్పారు. ఇటీవల ఒక విద్యాసంస్థ ఆవరణలో జరిగిన 'ప్రీ క్రిస్మస్' వేడుకలో శామ్యూల్ ప్రసంగించారు. "చాలా మంది క్రైస్తవ బిడ్డలకు ఈ సంవత్సరం సంతోషకరమైనది. మన జిల్లాలో ఈ ఏడాది నూతనంగా ఉద్యోగాలు వచ్చాయి. 2 వేల మంది క్రైస్తవ బిడ్డలకు గ్రామ సచివాలయాల్లో, 3500 మందికి గ్రామ, వార్డు వాలంటీర్లుగా ఉద్యోగాలు వచ్చాయి. అంటే... దాదాపు 6వేల మంది క్రైస్తవ బిడ్డలకు ఉద్యోగాలు రావడమన్నది మనం సంతోషించాల్సిన విషయం. అంతేకాకుండా, నాకు కూడా ఈ సంవత్సరం కలెక్టర్‌గా ఉద్యోగమొచ్చింది" అని ఆనందంగా చెప్పారు. ఈ నేపథ్యంలో తనతోపాటు జిల్లాలో ఉన్న క్రైస్తవ కుటుంబాలన్నిటికీ ఈ సంవత్సరం క్రిస్మస్ చాలా ఆనందదాయకంగా ఉంటుందని తెలిపారు.

## పాఠశాలకు పార్టీ రంగులా?



కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని 13, 14 వార్డు సచివాలయాలను జిల్లా పరిషత్ పాఠశాలలోని తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. అయితే ఈ విషయం ఎవరికీ తెలియలేదు. ఇటీవల ఈ వార్డు సచివాలయాలకు వైసీపీ రంగులు వేయడంతో విషయం బయటకు వచ్చింది. పాఠశాలకు వెళ్లగానే ఒక పార్టీకి చెందిన రంగులతో ఉన్న భవనం కనిపిస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాన్ని పాఠశాల ఆవరణ నుంచి మార్చాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. - నందిగామ

## క్రాఫ్ట్ బజార్‌లో అత్తాకోడళ్లు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సతీమణి భారతి, తల్లి విజయలక్ష్మి విజయవాడ శేషసాయి కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఆకృతి వస్త్ర ఎగ్జిబిషన్‌ను సోమవారం సందర్శించారు. ప్రదర్శనను తిలకించి, పలు వస్త్రాలను కొనుగోలు చేశారు. సుమారు అరగంటపైగా వారు ప్రదర్శనలో గడిపారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

## అభయాగోల్డ్ బాధితుల ఆందోళన



ఏలూరు కలెక్టరేట్, డిసెంబరు 16: అభయాగోల్డ్ బాధితులు, ఏజెంట్లు సోమవారం పశ్చిమగోదావరి కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. డబ్బు చెల్లించాలని ఏజెంట్లపై ఖాతాదారులు ఒత్తిడి తెస్తున్నారని, శరీర అవయవాలు అమ్మి అయినా ఖాతాదారుల బాకీ తీరుస్తామని ముగ్గురు ఏజెంట్లు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి అనుమతి వేడుకున్నారు. 2009లో విజయవాడ కేంద్రంగా అభయాగోల్డ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా సంస్థ ప్రారంభమైందని వారు తెలిపారు. నిరుద్యోగ, మధ్యతరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని నిర్వాహకులు.. డిపాజిట్లుగా రూ.174కోట్లు సేకరించి బోర్డు తిప్పేశారన్నారు. ఫలితంగా 10వేల మంది ఏజెంట్లు 4 లక్షల మంది ఖాతాదారులు నిలువునా మోసపోయారన్నారు. ఇప్పటికైనా విచారణను వేగవంతం చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

# కక్షతోనే శిక్ష!

(మొదటి పేజీ తరువాయి)

లాంటి చర్యలకు పాల్పడితే... క్రిమినల్ కేసు పెట్టవచ్చు. కానీ... సీఐడీ చూపించింది కేవలం విధానపరమైన లోపాలే! ఇలాంటి 'ప్రొసీజరల్ లోపాలపై సంబంధిత అధికారి వివరణ అడుగుతారు. శాఖాపరమైన విచారణకు ఆదేశించవచ్చు. తప్పు రుజువైతే... నిబంధనలకు మించి పెట్టిన ఖర్చును రికవరీ చేయవచ్చు. ఇప్పటిదాకా అమలులో ఉన్న పద్ధతి ఇదే. కానీ జాస్తి కృష్ణ కిశోర్‌పై స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఫిర్యాదు చేయడం, రాత్రికి రాత్రి సీఐడీ అధికారులు కేసు నమోదు చేయడంపై సరైనదేనా అని అధికారుల్లో చర్చ జరుగుతోంది. ఇలాంటి ఉదంతాలు గతంలో ఎప్పుడూ లేవని చెబుతున్నారు. అకౌంటింగ్-ఆడిటింగ్ నిబంధనలు పాటించలేదనేది కృష్ణ కిశోర్‌పై వచ్చిన తొలి ఆరోపణ. ఖర్చులకు బిల్లులు సమర్పించడం ఈడీబీ సీఈవో స్థాయి అధికారి బాధ్యత కాదు. అది కింది స్థాయి అధికారులు చేస్తారు. బిల్లుల్లో తేడాలు వస్తే రికవరీ పెడతారు. అకౌంటింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుపెట్టారంటూ పలు అంశాలను ఏటా కాగ్ ఎత్తి చూపిస్తుంటుంది. వాటికి ప్రభుత్వాలు సమాధానం ఇస్తూ ఉంటాయి. ఈ ఖర్చులో క్విడ్ ప్రోకో, అవినీతి వంటివి లేకుంటే వాటిని పెద్దగా పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు మాత్రం ఎలాంటి విచారణ జరపకుండానే... జాస్తి కృష్ణ కిశోర్‌పై క్రిమినల్ కేసు పెట్టేశారు. ఈడీబీ ఇచ్చే ప్రకటనలను సమాచార ప్రసార శాఖ ద్వారా కాకుండా నేరుగా ఇవ్వడం ద్వారా జాస్తి కృష్ణ కిశోర్ జీవో నెంబరు 124ను ఉల్లంఘించారన్నది రెండో ఆరోపణ. ఈ జీవో ఎప్పటి నుంచో ఉంది. కొన్ని శాఖలు, విభాగాలు అవసరాన్ని బట్టి నేరుగా ప్రకటనలు ఇస్తున్నాయి. అంతెందుకు... కొత్త ప్రభుత్వం వచ్చాక జీవో 124పై ఒక రిమైండర్ ఇచ్చారు. ఇప్పటికీ కొన్ని శాఖలు సమాచార, ప్రసార శాఖ ద్వారా కాకుండా నేరుగా ప్రకటనలు ఇచ్చేస్తున్నాయి. అయినప్పటికీ... ఈడీబీ విషయంలో మాత్రమే ప్రత్యేకంగా కేసు పెట్టడమేమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

### చేసిన కృషి ముందు...

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించి, పరిశ్రమలను రప్పించడమే ఈడీబీ బాధ్యత. సంస్థ సీఈవోగా కృష్ణ కిశోర్, ఇతర సిబ్బంది దేశ, విదేశాల్లోని పారిశ్రామికవేత్తలతో మాట్లాడడం, ఎక్కడ ఎలాంటి అవకాశాలున్నాయో కనుక్కుని వాటిని రాష్ట్రానికి రప్పించేలా చూడడం వంటివి చేశారు. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే పారిశ్రామికంగా, మౌలిక సదుపాయాలపరంగా వెనుకబడిన ఏపీలాంటి కొత్త రాష్ట్రానికి పెట్టుబడులు తేవడం అంత సులభం కాదు. దీనికోసం దేశ విదేశాల్లో జరిగే వాణిజ్య సదస్సుల్లో రాష్ట్రం తరపున స్టాల్స్, షోలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు... 2016లో విశాఖపట్నంలో పారిశ్రామిక సదస్సు నిర్వహణకు రూ.37.39కోట్లు ఖర్చు చేశారు. 2017 సదస్సుకు రూ.26.64కోట్లు, 2018లో రూ.44.67కోట్లు ఖర్చుచేశారు. మొత్తంగా ఈ మూడు సదస్సులకు పెట్టిన ఖర్చు రూ.108కోట్లు. అయితే, ఈ సదస్సుల్లో 1182 ప్రాజెక్టులపై ఒప్పందాలు కుదిరాయి. వాటి పెట్టుబడుల విలువ రూ.12.32లక్షల కోట్లు. ఆ ప్రాజెక్టులన్నీ నిజంగా వాస్తవరూపం దాలిస్తే వచ్చే ఉద్యోగాలు 22.81లక్షలు. వాటిలో ఇప్పటికే సుమారు 1.39 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేశాయి. వాటికి సంబంధించిన 309 ప్రాజెక్టులు ఉత్పత్తిని కూడా ప్రారంభించాయి. ఫలితంగా 1,54,338 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. మరోవైపు... ఈ మూడు పారిశ్రామిక సదస్సుల్లో కుదిరిన పెట్టుబడి ఒప్పందాల్లో 139 ప్రాజెక్టులు అచ్చంగా జాస్తి కృష్ణ కిశోర్ సీఈవోగా ఉన్న ఈడీబీ ద్వారానే వచ్చాయి. వీటి పెట్టుబడుల విలువ రూ.1.53 లక్షల కోట్లు. ఇవన్నీ పూర్తయితే వచ్చే ఉద్యోగాలు 2.95 లక్షలు. ఇందులో రూ.2,595 కోట్ల పెట్టుబడితో 15 ప్రాజెక్టులు ఇప్పటికే వాస్తవ రూపంలోకి వచ్చేశాయి. 4122 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈడీబీ సాధించిన ఈ విజయంతో పోల్చితే... ఈడీబీ పెట్టిన ఖర్చు లెక్కలోకే రాదని అధికారులే చెబుతున్నారు. గతంలో ఆదాయపు పన్ను అదనపు కమిషనర్ హోదాలో జగతి పబ్లికేషన్స్ షేర్ల లావాదేవీల నిగ్గు తేల్చారనే కక్షతోనే కృష్ణ కిశోర్‌పై ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేస్తున్నారు.

# సారూ.. ఇది రెండోస్సారి

- ఏసీబీకి మళ్లీ దొరికిన కర్నూలు సీఐ



సీఐ రామయ్యనాయుడు

కర్నూలు, డిసెంబరు 16: వైన్‌షాపు యజమాని నుంచి లంచం తీసుకుంటూ 2012లో ఆ పోలీసు అధికారి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఆ కేసు పెండింగ్‌లో ఉండగానే, మరో కేసులో దొరికిపోయారు. కర్నూలు భూపాల్‌కాంప్లెక్స్‌లోని 'నవకాంత్' చిట్ ఫండ్ మోసాలకు పాల్పడింది. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. చిట్‌ఫండ్ సంస్థ నిర్వాహకుల్లో గోపాల్‌రెడ్డిని అరెస్టు చేశారు. మరో నిర్వాహకుడు ఆదినారాయణరెడ్డిని అరెస్టు చేయాల్సి ఉంది. కేసును దర్యాప్తు చేస్తున్న సీఐ రామయ్యనాయుడు.. అడిగినంత ఇస్తే ఆదినారాయణరెడ్డిని అరెస్టు చేయనని, గోపాల్‌రెడ్డిపై రౌడీషీట్ తెరవనని ఒత్తిడి తెచ్చారు. రూ.40 లక్షలు లంచం ఇచ్చేందుకు వారిద్దరూ అంగీకరించారు. సోమవారం కర్నూలులో లాయర్ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి డబ్బు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు లాయర్‌ను అదుపులో తీసుకున్నారు. అనంతరం జరిపిన సోదాల్లో 1.8 కిలోల బంగారు ఆభరణాలు, రామయ్యనాయుడు పేరుతో ఉన్న ఇంటి స్థలం డాక్యుమెంట్లు బినామీ పేర్లతో ఉన్న రెండు ఇంటి స్థలాల డాక్యుమెంట్లు, కీలకపత్రాలు ఇంట్లో లభ్యమయ్యాయి.

'సస్పెన్షన్'

# ఆపండి!

- క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు
- విచారణ ఈనెల 24కు వాయిదా
- జాస్తి కృష్ణ కిశోర్‌కు ఊరట

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థికాభివృద్ధి మండలి (ఈడీబీ) మాజీ సీఈవో, సీనియర్ ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్‌కు ఊరట లభించింది. ఆయనను సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం జారీచేసిన జీవో 2814 అమలును ఈనెల 24 వరకు నిలిపివేస్తూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జీవో అమలునే నిలిపివేసిన నేపథ్యంలో ఆయనపై సీఐడీ/ఏసీబీ దర్యాప్తును కూడా నిలిపి వేయాల్సి ఉంటుంది.. తనను సస్పెండ్ చేస్తూ జారీ చేసిన జీవోను కొట్టివేయాలంటూ కృష్ణ కిశోర్ దాఖలు చేసిన పిటిషన్‌ను లంచ్ మోషన్‌లో అత్యవసరంగా విచారించాలంటూ ఆయన తరపు న్యాయవాది కె.సుధాకర్ రెడ్డి క్యాట్‌ను అభ్యర్థించారు. ఇందుకు క్యాట్ సభ్యుడు (అడ్మినిస్ట్రేషన్) బీవీ సుధాకర్ అంగీకరించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలతో కృష్ణ కిశోర్‌ను సస్పెండ్ చేశారని, కేంద్ర సర్వీసు నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన్న అధికారిని సస్పెండ్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాదులు నీరజ్ మల్హోత్రా, పరమాత్మసింగ్ తెలిపారు. చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు మాత్రమే చేయాలని, నేరుగా క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వ చర్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధన 10(1)కి విరుద్ధమన్నారు. "ఏపీ ప్రభుత్వం ఆహ్వాన మేరకు 2015లో డిప్యుటేషన్‌పై వచ్చిన కృష్ణ కిశోర్ ఈడీబీ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2018లో ఆయన డిప్యుటేషన్ ముగిసినా మరో రెండేళ్ల పాటు పొడిగించాలని ఏపీ ప్రభుత్వం కోరింది. దీంతో 2020 ఆగస్టు వరకు డిప్యుటేషన్‌ను పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వం ఆయన ఈడీబీ బాధ్యతల నుంచి తప్పించి, ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. తనను తిరిగి కేంద్ర సర్వీసులకు పంపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నా స్పందించలేదు. కేంద్ర సర్వీసుల్లోకి వెళ్తే ఆయనకు ప్రిన్సిపల్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్‌గా పదోన్నతి కూడా వస్తుంది. ఈ నేపథ్యంలో వెంటనే తనను ఏపీ నుంచి రిలీవ్ చేయాలని కోరినా పట్టించుకోలేదు. కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఐదారు నెలలుగా జీతం కూడా ఇవ్వడం లేదు" అని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్ షేరు విలువను గతంలో భారీగా చూపించారని, ఇన్‌కంట్యాక్స్ అదనపు కమిషనర్‌గా ఉన్నప్పుడు కృష్ణ కిశోర్ ఈ విలువను నిబంధనల ప్రకారం మదింపు చేశారని తెలిపారు. ఇది ఒక అధికారిగా తన విధులు నిర్వహించడమే అని స్పష్టం చేశారు. జగతి పబ్లికేషన్స్ విలువను తక్కువగా మదింపు చేశారనే ఉద్దేశంతో కక్ష గట్టి కృష్ణ కిశోర్‌ను సస్పెండ్ చేయడంతోపాటు ఏసీబీ/సీఐడీ దర్యాప్తునకు ఆదేశించారని... దర్యాప్తు పూర్తయ్యే వరకూ అమరావతి వదలి వెళ్లరాదని జీవోలో పేర్కొన్నారని న్యాయవాదులు వివరించారు. ఇది పూర్తిగా కేంద్ర సర్వీసు నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు రెండు రోజులు సమయం కావాలని, అప్పటి వరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదంటూ ఏపీ ప్రభుత్వం చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. జీవో 2814 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేశారు.

# హౌరా-ఖరగ్‌పూర్ సెక్షన్‌లో పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హౌరా-ఖరగ్‌పూర్ రైల్వే సెక్షన్‌లో కొన్నిచోట్ల నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్లను పూర్తిగా, మరి కొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. 16వ తేదీన బయలుదేరాల్సిన 22201 నంబరు సీల్దా-పూరీ ఎక్స్‌ప్రెస్, 12841 హౌరా-చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్, 12863 హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, 12839 హౌరా-చెన్నై మెయిల్, 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రద్దు అయ్యాయి. 16వ తేదీన బయలుదేరాల్సిన 12246 నంబరు యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్, 22860 చెన్నై-పూరీ ఎక్స్‌ప్రెస్, 02860 చెన్నై-పూరీ ప్రత్యేక రైలు, 22818 మైసూర్-హౌరా ఎక్స్‌ప్రెస్, 12246 యశ్వంతపూర్-హౌరా ఎక్స్‌ప్రెస్, 12510 గౌహతి-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు.. 17వ తేదీన బయలుదేరాల్సిన 12510 నంబరు గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్, 12514 గౌహతి-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, 22878 ఎర్నాకులం-హౌరా ఎక్స్‌ప్రెస్‌లను రద్దుచేశారు. 18వ తేదీన 12254 నంబరు భగల్‌పూర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేశారు.

### సికింద్రాబాద్-హౌరా ప్రత్యేక రైలు

పలు రైళ్లు రద్దు కావడంతో ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో సికింద్రాబాద్ నుంచి హౌరాకు ప్రత్యేక రైలు 08646 (వన్ వే) వేశారు. ఇది సోమవారం రాత్రి 11.09 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి, మంగళవారం ఉదయం 10.38 గంటలకు దువ్వాడ, 11.20కు విశాఖపట్నం, మధ్యాహ్నం 12.35కు విజయనగరం, 1.32కు శ్రీకాకుళం, 2గంటలకు నౌపడకు చేరుతుంది. మంగళవారం అర్ధరాత్రి 1.40 గంటలకు హౌరా చేరుతుంది.

### నేటి నుంచి సాధారణం

చేతన్‌కుమార్ శ్రీవత్సవ్, డీఆర్ఎం, విశాఖ హౌరా-ఖరగ్‌పూర్‌ల మధ్య కొన్ని స్టేషన్ల వద్ద ప్రజలు ఆందోళనలు చేయడంతో గత మూడు రోజులుగా పలు రైళ్లు రద్దు అయ్యాయి. హౌరాలో సోమవారం పరిస్థితి సాధారణంగా ఉంది. మంగళవారం మరింత మెరుగుపడే అవకాశం ఉంది. 17వ తేదీ నుంచి అన్ని రైళ్లు యథాప్రకారం నడిచే అవకాశం ఉంది.



## తిరుమలలో ఎడతెరిపి లేని వర్షం

తిరుమల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో పాటు పొగమంచు, చలిగాలులు వీయడంతో యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు.

## సిద్ధార్థ వైద్య కళాశాలకు రామ్మోహనరావు భౌతికకాయం

▸ నివాళులర్పించిన రచయితలు



రామ్మోహనరావు భౌతికకాయం వద్ద సహచరి ఝాన్సీ, బంధువులు

విజయవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంతో బాధపడుతూ మృతి చెందిన నవోదయ పబ్లిషర్స్ అధినేత రామ్మోహనరావు భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించారు. సోమవారం కృష్ణా జిల్లా రచయితలు, రాజకీయ ప్రముఖులు విజయవాడ మొగల్రాజపురంలోని ఆయన నివాసం వద్ద నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, సాహితీ విమర్శకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, గ్రంథాలయాల సమాఖ్య కార్యదర్శి రావి శారద, మానవ హక్కుల వేదిక ప్రతినిధి సుధ, ఆకాశవాణి మాజీ సంచాలకురాలు ఎం.కృష్ణమూర్తి, భట్టు, నవత ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధి కోటేశ్వరరావు రామ్మోహనరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.



పూర్ణచంద్రరావు, ఆదిలక్ష్మి(ఫైల్)

## ఇసుక కొరతకు మరో ఇద్దరు బలి!

▸ తాపీమేస్త్రీ దంపతుల ఆత్మహత్య

మంగళగిరి క్రైమ్, డిసెంబరు 16: ఇసుక కొరత మరో ఇద్దరిని బలితీసుకుంది. ఆరు నెలలుగా భవన నిర్మాణ పనులు లేక అప్పులపాలైన ఓ తాపీమేస్త్రీ.. తన భార్యతో కలిసి బలవన్మరణానికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామ పంచాయతీ.. పుల్లయ్యనగర్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం యార్లగడ్డకు చెందిన పోలిశెట్టి పూర్ణచంద్రరావు(55), ఆదిలక్ష్మి (50) దంపతులు అయిదేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం పుల్లయ్యనగర్ వచ్చి అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. అయితే, ఆరు నెలలుగా ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో కుటుంబం గడవక అప్పుల పాలయ్యారు. అప్పులవాళ్ల ఒత్తిడి తీవ్రమవ్వడంతో కొద్దిరోజులుగా ఆందోళనతో ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తాము నివసించే అద్దె ఇంట్లో దంపతులిద్దరూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మంగళగిరి రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి సంఘటన స్థలిని పరిశీలించి ఆధారాలను సేకరించారు. మృతుడు పూర్ణచంద్రరావు రాసిన మూడు పేజీల సూసైడ్ లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వివరాలను చెప్పేందుకు నిరాకరించారు.

### 26న తిరుమల, శ్రీశైలం ఆలయాల మూసివేత

తిరుమల/శ్రీశైలం, డిసెంబరు 16: సూర్యగ్రహణం కారణంగా ఈ నెల 25 రాత్రి నుంచి 26వ తేదీ మధ్యాహ్నం వరకు రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలను మూసివేయనున్నారు. 26వ తేదీ ఉదయం 8.08 నుంచి 11.16 గంటల వరకు సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో 25వ తేదీ రాత్రి 11 గంటలకు శ్రీవారి ఆలయం మహాద్వారం తలుపులు మూసివేసి, 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు తెరుస్తారు. ఆలయశుద్ధి అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. 25వతేదీ రాత్రి 10 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 11.30గంటల వరకు శ్రీశైలంలోని ఉభయ దేవాలయాల ద్వారాలు మూసివేస్తామని ఈవో కేఎస్ రామరావు తెలిపారు. 26వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు.

# తిట్ల దండకాలతోనే సరి!

▸ చేతగాక దూషణల పర్వం
▸ ప్రశ్నించే గొంతు నొక్కడమే లక్ష్యం
▸ ప్రతిపక్షం, మీడియాపై దాడి
▸ రైతు భరోసాపై పలాయనం
▸ జవాబివ్వలేక వాయిదాలు
▸ మన ప్రభుత్వ పనితీరును ఒప్పుకోక తప్పలేదు
▸ అసెంబ్లీ సమావేశాలపై టీడీఎల్పీ విశ్లేషణ
▸ ప్రజాప్రతినిధులకు చంద్రబాబు విందు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాము లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పలేక వైసీపీ ప్రభుత్వం తిట్ల దండకాలతో అసెంబ్లీ సమావేశాలను నడిపించిందని తెలుగుదేశం పార్టీ వ్యాఖ్యానించింది. సభ సజావుగా నడపడం చేతగాక.. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సామర్థ్యం లేక దూషణల పర్వానికి తెర లేపారని విమర్శించింది. మంగళవారంతో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం సాయంత్రం ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. రైతు భరోసాపై టీడీపీ అడిగిన ప్రశ్నను చర్చకు రాకుండా చేశారు. రైతులకు చేసిన ద్రోహం చర్చకు వస్తుందన్న భయంతో దానిని దాటవేశారు. ఒక్కో రైతుకు రూ.5 వేలు ఎగ్గొట్టడం, రైతు రుణమాఫీ నాలుగైదు కిస్తీల సొమ్ము రూ.8 వేలు ఇవ్వకపోవడంపై నిలదీస్తామనే భయంతోనే చర్చకు రానివ్వలేదు. అసెంబ్లీలో పదేపదే వీడియోలు ప్రదర్శించారు. అందులో వారి డొల్లతనమే బయటపడింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు 45ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీ స్క్రోలింగులు కనిపించడంతో మంత్రులకు దిమ్మ తిరిగింది' అని సమావేశం పేర్కొంది.

### ఆదరణలో అవినీతి లేదని..

టీడీపీకి ఆధిక్యం ఉన్న శాసనమండలిలో జరిగిన చర్చలో గత టీడీపీ ప్రభుత్వం పనితీరును మంత్రులు అంగీకరించక తప్పలేదని టీడీఎల్పీ వ్యాఖ్యానించింది. 'ఆదరణ పథకంలో అవినీతి జరగలేదని ప్రభుత్వమే అంగీకరించింది. టీడీపీ హయాంలో జరిగిన పారిశ్రామిక పెట్టుబడుల సదస్సులతో రూ.1.40 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షన్నర ఉద్యోగాలు వచ్చాయని తెలిపింది. తద్వారా ఈ సదస్సులు విజయవంతమయ్యాయని అంగీకరించింది' అని ఎమ్మెల్సీలు తెలిపారు. ఉపాధి హామీ పథకం బాగా అమలుచేసినందుకు ఢిల్లీ వెళ్లి ప్రభుత్వ పెద్దలు అవార్డులు అందుకుంటున్నారని, కానీ ఆ పనులు చేసిన వారికి ఇక్కడ బిల్లులు ఇవ్వడంలేదని సర్కారును నిలదీశామని చెప్పారు. దిశ చట్టం అసెంబ్లీలో ఆమోదించిన రోజే గుంటూరులో నాలుగేళ్ల బాలికపై అత్యాచారం జరిగితే ఆ జిల్లాకు చెందిన హోంమంత్రి కనీసం పరామర్శించలేదని.. గుంటూరులో ఎస్సీ బాలిక... త్రిపురాంతకంలో బీసీ బాలికపై అత్యాచార ఘటనల్లో తమ వారు ఉండడంతో విచారణలో చిత్తశుద్ధి కనిపించలేదని విమర్శించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో బెల్టుషాపులపై 18 వేల కేసులు నమోదు చేసి 18 వేల మందిని అరెస్టు చేశామని.. నవోదయం పథకం కింద తొమ్మిది జిల్లాలను సారారహితంగా చేస్తే.. ఇప్పుడు జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ సారా ప్రవాహం మొదలైందని సమావేశం విమర్శించింది. షాపుల సంఖ్యపై ప్రశ్నించినందుకు టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడిపై సభా హక్కుల నోటీసిస్తామని ముఖ్యమంత్రి నిరంకుశ వైఖరి ప్రదర్శించారని.. విపక్షం, మీడియాల గొంతు నొక్కడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తింది.

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు విందు

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సోమవారం రాత్రి పార్టీ కార్యాలయంలో చంద్రబాబు విందు ఇచ్చారు. కొందరు పార్టీ ముఖ్య నేతలు కూడా హాజరయ్యారు.

## బాబు 'ఆదరణ' బాగుంది!

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనా కాలంలో అమలు చేసిన ఆదరణ పథకంలో ఎలాంటి అక్రమాలూ జరగలేదని మంత్రి శంకర్ నారాయణ శాసనమండలిలో వెల్లడించారు. సోమవారం మండలి ప్రారంభమైన వెంటనే రివర్స్ టెండర్లపై చర్చకు టీడీపీ వాయిదా తీర్మానం ఇవ్వగా ఛైర్మన్ తిరస్కరించారు. అనంతరం, ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆదరణ పథకంలో అక్రమాలు జరిగాయా? అని వైసీపీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి ప్రశ్నించారు. దీనికి మంత్రి సమాధానమిస్తూ శాఖాపరంగా అక్రమాలు గుర్తించలేదని, లిఖిత పూర్వక ఫిర్యాదు కూడా అందలేదని చెప్పారు.

### 28 వేల కోట్లకు 100 కోట్లే కేటాయింపా?

అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు అంచనా రూ.28,000 కోట్లయితే, ప్రభుత్వం ఈ ఏడాది కేవలం రూ.100 కోట్లు మాత్రమే కేటాయించిందని టీడీపీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి ధర్మాన కృష్ణదాస్ స్పందిస్తూ నిధుల కొరత, ఇప్పుడున్న ట్రాఫిక్‌కు ఎనిమిది లైన్ల రహదారి అవసరం లేనందున దీనిని 4 లైన్లకు కుదించామని చెప్పారు.

### సంస్కృతి కోసం ఆమాత్రం ఖర్చు పెట్టరా?

ఏపీ వారసత్వ సంపదను కాపాడుకోడానికి ప్రభుత్వం రూ.40 లక్షలు కూడా ఖర్చు పెట్టలేదా? అని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే తెలుగు గ్రంథాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. తాళపత్ర గ్రంథాలను స్కాన్ చేసి భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఆదిమూలపు సురేశ్ చెప్పారు.

### త్వరలో 1100 పోస్టులకు నోటిఫికేషన్

గురుకులాల్లో 1100 ఉపాధ్యాయ పోస్టుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి చెప్పారు. ప్రస్తుతం గిరిజన గురుకులాల్లో 1,689 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులున్నారని, వారందరినీ కాంట్రాక్టు విధానంలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు కోరారు. దీనిపై మంత్రి పైవిధంగా స్పందించారు.

### ఆరు బిల్లులకు ఆమోదం

మండలిలో సోమవారం ఏపీ ఎక్సైజ్ చట్టం సవరణ బిల్లు, ఏపీ సాంస్కృతిక, వారసత్వ బోర్డు చట్టం సవరణ బిల్లు, ఏపీ దిశ చట్టం-2019 బిల్లు, ఏపీ దిశ చట్టం-(ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు)2019 బిల్లు, ఏపీ ధార్మిక, హిందూమత సంస్థల, ఎండోమెంట్ చట్ట సవరణ బిల్లు, పాఠశాల విద్యా క్రమబద్ధీకరణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లులు ఆమోదం పొందాయి.


## రైల్వేల మంత్రిత్వ శాఖ
(రైల్వే బోర్డ్)

ప్రకటన

**రైల్వే నియామకం కొరకు దరఖాస్తు చేసుకున్నట్టి మల్టీపుల్ డిజబులిటీ(MD) కలిగిన అభ్యర్థులకు (లెవల్-1) సమాచారం కొరకు**

RPWD యాక్ట్, 2016 క్రింద అసలు మల్టీపుల్ డిజబులిటీ కలిగిన PwBD అభ్యరులై ఉండి, లెవల్ -1 రైల్వే నియామకం నోటిఫికేషన్ CEN 02/2018లోని LD లేదా VI లేదా HI సింగిల్ డిజబులిటీ కేటగిరీపై దరఖాస్తు చేసుకున్నట్టివారు మరియు నిర్వహించబడిన వ్రాతపూర్వక కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో కనీస సడలింపు అర్హమైన మార్కులు కలిగిన వారు, వారు దాఖలు చేసుకున్నదాని కొరకు రైల్వే RRC/RRB వెబ్‌సైట్ చూడవచ్చును.

సంబంధిత సదరు అభ్యర్థులకు షెడ్యూల్ చేయబడిన నోటిఫికేషన్ 23 డిసెంబర్, 2019న అప్‌లోడ్ చేయబడుతుంది.

మమ్మల్ని దర్శించగలరు /RailMinIndia


## ధనికొండ రచనలు నిత్యనూతనాలు

▸ వ్యక్తిగానూ ఆయన ఆదర్శప్రాయుడే
▸ ధనికొండ శత జయంతి ఉత్సవాల్లో ప్రముఖ రచయిత శ్రీ విరించి నివాళి
▸ తెలుగు సాహిత్యంలో సుస్థిరమయ్యేలా ధనికొండపై విస్తృతంగా పరిశోధనలు
▸ భాషకు చెన్నైలో ఇస్తున్న ప్రాధాన్యం తెలుగు రాష్ట్రాల్లో లేకపోవడం విచారకరం
▸ ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆవేదన
▸ ధనికొండ ఏడు సంపుటుల ఆవిష్కరణ



ధనికొండ రచనల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ తదితరులు

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): "ధనికొండ హనుమంతరావు రచనలు నిత్యనూతనాలు. ఆ రచనలను చదివితే వర్తమాన పరిస్థితులు కళ్లకు కడతాయి. ఆయన ఆదర్శప్రాయుడైన కథకుడిగానే కాకుండా, ఆదర్శమంత వ్యక్తిగానూ జీవించారు. నమ్మిన సత్యాన్నే చివరిదాకా నొక్కి వక్కాణించారు" అని ప్రముఖ రచయిత శ్రీవిరించి అన్నారు. ఆయన రచనల్లో ప్రధానంగా కనిపించేది అమలిన శృంగారమే అయినా, శృంగారాన్ని ధనికొండ విచ్చలవిడిగా రాశారని అందరూ అపోహపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, ధనికొండ కుటుంబసభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో చెన్నై మెరీనా తీరంలోని ఆ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శత జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హావలాక్ ఎల్లీస్, అభిసారిక సంపాదకీయాలు, పదిమంది అమెరికన్ ఆధునికులు, అమెరికన్ జీవితం, చరితార్థుడు, రైట్ సోదరులు, ధనికొండ ఆణిముత్యాలు అనే ఏడు పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ ఈ సంపుటులను ఆవిష్కరించి..ప్రసంగించారు. తెలుగు సాహితీరంగంలో శ్రీశ్రీ, చలం వంటి ప్రథమ శ్రేణి రచయితలనే కాకుండా, ద్వితీయ శ్రేణి రచయితలను కూడా స్మరించుకోవడం అవసరమని, ఆ కోవలో ధనికొండ హనుమంతరావు పేరు తెలుగు సాహిత్యంలో సుస్థిరం కావాలని, ఈ సత్సంకల్పాన్ని నెరవేర్చడం ఆయన కుటుంబీకులది మాత్రమే కాకుండా మొత్తం సమాజం బాధ్యతని శ్రీనివాస్ అన్నారు. ధనికొండ రచనలు సాహితీవేత్తలకు తెలిసినా, అవి విశ్వవ్యాప్తం కాలేదని, ప్రస్తుతం ఆ రచనలను పునఃసమీక్షించుకొని, సమగ్ర పరిశోధన చేపట్టాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. "ధనికొండ, రెంటాల గోపాలకృష్ణ వంటి రచయితలు ఒక వర్గానికే చెందినవారు కారు. సమాజం మొత్తానికి చెందినవారు. ధనికొండ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి, ఆయన రచనలపై ఎంఫిల్, పీహెచ్‌డీ చేసే విద్యార్థులకు 'ఫెలోషిప్' అందించాలని శ్రీనివాస్ సూచించారు. చెన్నైలో తెలుగుభాషకి ఉన్న ప్రాధాన్యం, తెలుగు రాష్ట్రాలలో ఉండడం లేదని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. కాగా, ఒక పాఠకురాలిగానే తాను ధనికొండ రచనలను పరిశీలిస్తుంటానని, 1960 ల్లోనే కృత్రిమ గర్భధారణ గురించి ఆయన ప్రస్తావించడం విశేషమని ధనికొండ మేనకోడలు, ప్రముఖ రచయిత్రి జి.సుధ అన్నారు. రచయితల రచనలను, వారి జీవిత సంబంధాలను విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ప్రముఖ రచయిత వివినమూర్తి అన్నారు. కాగా, ధనికొండ పెద్ద కుమార్తె కమల, వేదవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి కందనూరు మధు, ద్రవిడదేశం వ్యవస్థాపకులు వీ కృష్ణారావు, సీనియర్ పాత్రికేయుడు ఎస్వీ సూర్యప్రకాశరావు, 'జనని' ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, కన్యకాపరమేశ్వరి కళాశాల ప్రిన్సిపాల్ మోహనశ్రీ, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు, ప్రముఖ సినీ గేయ రచయిత వెన్నెలకంటి.. ధనికొండ పుస్తకాల తొలి ప్రతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు మాడభూషి సంపత్‌కుమార్, ఎల్‌బీ శంకరరావు, ఇంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## పరుల కోసం బతకడంలోనే ఆనందం

▸ ఎందరో అనాథలకు అమ్మనయ్యా
▸ సింధూ తాయ్ సప్‌కాల్ వెల్లడి
▸ పిన్నమనేని-సీతాదేవి అవార్డు బహూకరణ
▸ సంస్కృత పండితుడు డి.రామకృష్ణకు కూడా..



పురస్కారాలు అందుకుంటున్న సింధూ తాయ్, డా.రామకృష్ణ

విజయవాడ (మొగల్రాజపురం), డిసెంబరు 16: మన కోసం మనం బతకడం కంటే.. పరుల కోసం బతకడంలో ఉండే ఆనందం ఎంతో విలువైనదని ప్రముఖ సంఘ సేవకురాలు, అనాథల తల్లిగా పేరొందిన సింధూ తాయ్ సప్‌కాల్ (తాయి) అన్నారు. డాక్టర్ పిన్నమనేని-సీతాదేవి ఫౌండేషన్ 29వ వార్షిక జాతీయ అవార్డుల వేడుక సోమవారమిక్కడ పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. జీవితంలో సర్వం కోల్పోయిన వేలాది మంది అనాథలను చేరదీసి, వారికి అమ్మగా సేవలందిస్తున్న తాయికి.. చిన్నతనం నుంచే సంస్కృత పండితుడిగా, అనేక గ్రంథాలను తర్జుమా చేసిన కవి, సాహితీవేత్త, ఉపాధ్యాయుడిగా 32 ఏళ్లుగా సేవలు అందిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద భారతీయ సంస్కృతిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ డి.రామకృష్ణకు ఈ ఏడాది ఫౌండేషన్ అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా తాయి మాట్లాడారు. బాల్యంలోనే వివాహం, రోజుల పసిపిల్లతో ఉన్న తనను భర్త ఇంటి నుంచి గెంటేశారని.. తల్లి నిరాదరణతో చనిపోవాలని సిద్ధపడినా.. ధైర్యంచేసి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నానన్నారు. రైల్వేస్టేషన్‌లో భిక్షాటనతో వచ్చిన చిల్లరతో కొందరు అనాథల ఆకలి తీర్చడం వల్ల కలిగిన సంతృప్తి ముందు.. కష్టాలు కనిపించలేదన్నారు. తనలాంటి ఎందరో అనాథలకు తాను అమ్మనవడం భగవంతుడి వరమని చెప్పారు. 29 ఏళ్లుగా ఎంతో మంది మేధావులకు, సైంటిస్టులకు, కవులకు, కళాకారులకు, దేశాధినేతలకు బహూకరించిన ఇలాంటి అవార్డును తనకివ్వడం గర్వంగా ఉందన్నారు. డి.రామకృష్ణ మాట్లాడుతూ.. 'ప్రపంచం మొత్తం అంగీకరించిన ఆదికావ్యం రామాయణాన్ని వాల్మీకి మహర్షి సంస్కృతంలోనే రచించారు. అప్పటికి దేశ ప్రజలందరూ సంస్కృతమే మాట్లాడేవారనడానికి అందులో కొన్ని నిదర్శనాలు ఉన్నాయి. బ్రిటిష్‌వారు దేశానికి రాకముందు వరకు ఎంతో సౌభాగ్యం, కళలతో వర్ధిల్లిన మనదేశం రాను రాను తీరు మార్చుకుంది. పిన్నమనేని సీతాదేవి పేరుతో ఉన్న అవార్డును నాకు అందించి సత్కరించడం గొప్ప మధురానుభూతి' అని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, సభ్యుడు, పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు పాల్గొన్నారు.




# నిరాశపరచిన 'కాప్'

ఉప్పెనలు, ఉత్పాతాలు ముంచేస్తున్నా, ప్రజల ప్రాణాలు పోతున్నా, వాతావరణ పరిరక్షణ ఓ కీలకాంశంగా పాలకులకు ఇప్పటికీ పట్టలేదని మాడ్రిడ్ సదస్సు తేల్చిచెబుతున్నది. దాదాపు రెండువందల దేశాల ప్రతినిధులతో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వారం పాటు జరిగిన ఈ సదస్సు కార్యాచరణకు సంబంధించి ఏ అవగాహనకూ రాకపోవడంతో, ఏదో ఫలితాన్నిస్తుందన్న ఆశతో దానిని పొడిగించి మరీ ఎదురుచూశారు. చర్చోపచర్చలు, మేధోమథనాలు సాగినా, కొన్ని అంశాలపై సానుకూలత కనిపించినా, పారిస్ ఒప్పందం సూచనలు అమలుచేసే దిశగా బలమైన అడుగు మాత్రం పడలేదు. వచ్చే ఏడాది స్కాట్‌ల్యాండ్‌లో కచ్చితంగా తేల్చేద్దామన్న సంకల్పం మాత్రం చెప్పుకొని ఈ కాప్–25 సదస్సు ముగిసిపోయింది.

ఆడుకోవాల్సిన వయసులో ఇలా వచ్చి భవిష్యత్తు కోసం పోరాడాల్సి వస్తున్నందంటూ ఈ సదస్సులో ప్రసంగించిన మణిపూర్ బాలిక లిసిప్రియా కంగుజమ్, 'హౌ డేర్ యూ?' అంటూ ప్రపంచదేశాధినేతలను గతంలోనే ప్రశ్నించిన స్వీడన్ బాలిక గ్రెటా థన్‌బర్గ్ పోరాటాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయే కానీ, పాలకుల మనసు కరిగించలేక పోతున్నాయి. మానవాళికి ఉన్న ఒకేఒక్క ఆవాసాన్ని ధ్వంసం చేయకండి అంటూ గ్రెటా చేస్తున్న పోరాటాన్ని అద్భుతమైనదిగా అభివర్ణిస్తూ నిలువెత్తు చిత్రంతో టైమ్ మాగజైన్ ఆమెను పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటించింది. ఈ యువతరం పోరాటాలు చిన్నవేమీ కావు కానీ, పర్యావరణ వినాశన సిద్ధాంతాన్ని దురుద్దేశపూర్వకంగా కొట్టిపారేస్తూ, పారిస్ ఒప్పందాన్ని అమెరికా ఆర్థికప్రగతిని దెబ్బతీసే కుట్రలుగా అభివర్ణించే డొనాల్డ్ ట్రంప్ వంటివారు వీటిని తక్కువచేసే చూపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒబామా కృషిని వమ్ముచేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ పారిస్ ఒప్పందంనుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందాన్ని అమలుచేస్తే వచ్చే ఐదేళ్ళలో పాతికలక్షల ఉద్యోగాలు పోతాయన్న అసత్యవాదన చేస్తున్నారు ట్రంప్. మొత్తం కర్బన ఉద్గారాల్లో పదిహేనుశాతం వాటా ఉన్న అమెరికా అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని కూడా ఒప్పదం నుంచి వైదొలగడం ద్వారా ఎగ్గొడుతున్నది. వాతావరణం విషయంలో అమెరికా ఇంత బేఖాతరుగా ఉంటే, యూరోపియన్ యూనియన్ కాస్తంత పట్టుదల ప్రదర్శిస్తున్నది. వివిధ దేశాలతో కుదర్చుకొనే ఒప్పందాల్లో సైతం అది పర్యావరణాన్ని కీలకాంశంగా చేస్తూవస్తున్నది. అధిక లక్ష్యాలు నిర్దేశించు కుందామన్న దాని ప్రతిపాదనను సైతం చాలా దేశాలు ఈ సదస్సులో పడనీయలేదు. భూతాపంతో నానాటికీ అడుగంటి పోతున్న చిన్నచిన్న దీవిదేశాల వాదనలు, బాధలు అగ్రరాజ్యాలకు పట్టలేదు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య ఉద్గారాల లెక్కలకు సంబంధించి మళ్ళీ అవే గొడవలు, వాదనలు. వచ్చే ఏడాది గ్లాస్గో సదస్సు నాటికి కర్బన ఉద్గారాలు తగ్గించడానికి సంబంధించిన మెరుగైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నది ఈ సదస్సు సాధించిన అవగాహన.

పర్యావరణ విపత్తుకు సంబంధించి సైన్స్ చూపుతున్న లెక్కలు, చేస్తున్న హెచ్చరికలకు తగిన వేగంతో ప్రపంచదేశాలు స్పందించడం లేదు. వరల్డ్ మెటియరలాజికల్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎంవో) పక్షం రోజుల క్రితమే వాతావరణ మార్పులకు సంబంధించి పలు హెచ్చరికలు చేసింది. గత పదేళ్ళు అత్యధిక వేడిమిని నమోదుచేస్తే, ఇందులో గత నాలుగేళ్ళు అగ్రభాగాన ఉన్నాయి. పారిశ్రామికీకరణ ముందుకన్నా ఇప్పుడు ఒక డిగ్రీ సెల్సియస్ వేడి పెరిగింది. ఇదే ధోరణి సాగితే, ఈ శతాబ్దం ముగిసేనాటికి వేడి మూడునుంచి ఐదుడిగ్రీలు పెరగవచ్చు. ఉష్ణోగ్రత పెరుగుదల రెండు డిగ్రీలు దాటిన పక్షంలో భూతాపం ప్రమాదకర రీతిలో చికిత్సకు వీల్లేని దశకు చేరుకుంటుంది కనుక, దానిని 1.5 డిగ్రీలలోపు ఉంచగలిగితే మనకు క్షేమకరమని శాస్త్రవేత్తలు అంటున్నారు. గ్రీన్‌హౌస్ వాయువుల దుష్ప్రభావం ఏ స్థాయికి చేరిందంటే, తక్షణం దిద్దుబాటు ఆరంభించినా, విషం విరుగుడుకు కొన్ని దశాబ్దాలు పడుతుంది. కానీ, మనలను తినేస్తున్న అభివృద్ధి తాపం కఠిన నిర్ణయాలు తీసుకోనివ్వకుండా అడ్డతగులుతున్నది. సత్వరమే అన్ని రంగాల్లోనూ సమూలమైన, అసాధారణ నిర్ణయాలు చేయవలసింది పోయి, కనీసం అనుకున్న లక్ష్యాల దిశగా అడుగులు వేయడానికి కూడా మనకు మన సొప్పడం లేదు. వరదలు, తుఫాన్లు, అకాల వర్షాలు, కుంభవృష్టి, కరువు కాటకాలు, పంటనష్టాలు, నీటికొరత, పడిపోతున్న ఆహారోత్పత్తి ఇత్యాదివన్నీ ఒకపక్క చవిచూస్తూనే, ముంచు కొస్తున్న విపత్తు విషయంలో మరొకపక్క అవగాహన ఉండి కూడా అర్థంలేని అభివృద్ధియావలో కొట్టుకుపోతున్న మనిషిని ప్రకృతి మాత్రం ఎంతకాలం కాపాడుకొస్తుంది?

## కాబ్, ఎన్నార్సీ వ్యతిరేక పోరాటానికి 100 మంది తెలుగు కవులు, రచయితల మద్దతు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు(కాబ్), జాతీయ పౌర జాబితా(ఎన్ఆర్సీ) భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమైనది. ఆధునిక సమాజ నియమాలకు, సహజ న్యాయ సూత్రాలకు విఘాతమైన ఈ చట్టాలను నిరసిస్తూ ఈశాన్య రాష్ట్రాలు, మైనారిటీ ప్రజలు వినిపిస్తున్న నిరసన స్వరాన్ని తెలుగు రచయితలుగా, కవులుగా, ఆలోచనాపరులుగా బలపరుస్తున్నాం. భారత రాజ్యాంగ పరిరక్షణకై, శాంతియుత సామరస్యానికి పాటుపడుతున్న ఉద్యమాలకు పూర్తి మద్దతు పలుకుతున్నాం. మతాలకతీతంగా జీవనవిధానాన్ని సాగిస్తున్న దేశంలో మతాలుగా పౌరసత్వ నిర్ధారణ చేసుకునే విషాద స్థితి కల్పించాలనుకోవడం అప్రజాస్వామికమైనది. శరణార్థులై, పీడనకు గురై నిలువనీడ కోసం వస్తున్న ప్రజలను మతాలవారీగా కొందరిని ఆహ్వానించడం, మరికొందరిని అడ్డుకోవడం హేయమైంది. కాబ్, ఎన్ఆర్సీలతో ప్రపంచం ముందు భారత సమాజం తలవంచుకునేలా కేంద్ర ప్రభుత్వం చేస్తుండటాన్ని క్షమించలేని చర్యగా అభిప్రాయపడుతున్నాం. వీటిని వ్యతిరేకిస్తున్న ఈశాన్య ప్రజలపై, జామియా మిలియా యూనివర్సిటీ విద్యార్థులపై జరిపిన హింసాత్మక చర్యలను నిరసిస్తున్నాం. భారత శాంతియుత సామాజిక వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసే ఈ చట్టాలను రద్దుచేయాలని కోరుతున్నాం.

**కె.శ్రీనివాస్, ఎస్.వీరయ్య, కట్టా శేఖర్ రెడ్డి, అల్లం నారాయణ, కె.శివారెడ్డి, దేవి ప్రియ, నిఖిలేశ్వర్, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, భూపతి వెంకటేశ్వర్లు, ప్రొ. జి హరగోపాల్, ప్రొ. జయధీర్ తిరుమలరావు, ప్రొ.సి కాశీం,ప్రొ.పద్మజ షా, ప్రొ.కాత్యాయని విద్మహే,,ప్రొ.సూరెపల్లి సుజాత, ప్రొ. ఎమ్. వినోదిని. అల్లం రాజయ్య, వై.కరుణాకర్, అఫ్సర్, యాకూబ్, షాజహన, స్కైబాబ, వెంపల్లె షరీఫ్, కవి జయరాజ్, విమల, జూపాక సుభద్ర, మెర్సీ మార్గరెట్, డా.పసునూరి రవీందర్, డా.సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, పి.విజయ్ కుమార్, డా. జిలుకర శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, శిలాలోలిత, కుప్పిలి పద్మ, కె.ఎన్.మల్లీశ్వరి, దాసోజు లలిత, కాత్యాయని, ఎస్.జె.కళ్యాణి, అరణ్య కృష్ణ, వెంకట క్రిష్ణ, శోభ భట్, డా.గుర్రం సీతారాములు, డా. గాదె వెంకటేష్, విజయ్ సాధు, డా.కాసుల లింగారెడ్డి, పి.వరలక్ష్మి, పాణి, అనిల్ డాని, నరేష్ సూఫీ, దేశరాజు, ఛాయ మోహన్ బాబు, సజయ కాకరాల, సత్యవతి కొండవీటి, శివరాత్రి సుధాకర్, వనపట్ల సుబ్బయ్య, బాల సుధాకర్ మౌళి, రాఘవ రామిరెడ్డి, గురిజాల రవిందర్, అరసవెల్లి కృష్ణ, కోర జాన్, ఇంద్రవెల్లి రమేష్, ఎమ్.ఎ.బాసిత్, సాబీర్ హుస్సేన్, విప్లవ్ కమార్, బమ్మిడి జగదీశ్వర రావు, దాసోజు కృష్ణమాచారి, బర్ల మహేందర్, వెంకటాద్రి శిలపాక, షేక్ పీర్ల మహ్మద్, పి.మోహన్, శోభరాజు, అన్వర్ వరంగల్, కొడం కుమారస్వామి, నల్లెల రాజయ్య, కూర్మనాథ్, విజయ్ చంద్ర, రాంకి, నల్లూరి రుక్మిణి, జుగాష్ విలి, వేల్పుల నారాయణ, తదితరులు.**

**కొన్ని మతాలవారికి పౌరసత్వం కల్పించడం కొత్త విషయం కాదు. అంబేడ్కర్ న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడే 1950లో వలసదారుల చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం అసోంలో దురుద్దేశ పూరితంగా ప్రవేశించిన వారిని బహిష్కరించాలని, అదే సమయంలో అల్లర్లకు గురై భారతదేశానికి వచ్చిన వారిని, ముఖ్యంగా హిందువులు, సిక్కులను అనుమతించాలని నిర్ణయించారు.**

సత్యకాలమ్

# వివేక భ్రష్ట విపక్షాలు


■ వై. సత్యకుమార్

దేశంలో పౌరసత్వ చట్టాన్ని ప్రవేశపెట్టడం వెనుక భారతీయ జనతా పార్టీకి ఏవో రాజకీయ దురుద్దేశాలున్నాయని, ముస్లింలందర్నీ వెళ్లగొట్టి భారత్‌ను హిందూరాజ్యంగా మార్చదలుచుకున్నారని ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొట్టేందుకు పూనుకున్నాయి. దేశం నలుమూలలా అగ్ని రాజేసేందుకు ప్రయత్నించడం చూస్తుంటే వారికి దేశ ప్రయోజనాల కన్నా తమ రాజకీయ ప్రయోజనాలే విపక్షాలకు ముఖ్యమన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. రెండో సారి భారీ మెజారిటీతో నరేంద్రమోదీ అధికారంలోకి రావడం ఓర్వలేని ఈ శక్తులు ఆరునెలలు కూడా ఓపిక పట్టకుండా దేశాన్ని రావణ కాష్టం చేసేందుకు యత్నిస్తున్నాయి.

ఈ బిల్లు రాజకీయ ప్రయోజనాలకోసమే ఉద్దేశించారనడం పూర్తిగా తప్పు. ఎందుకంటే మరో నాలుగున్నర సంవత్సరాల వరకు ఎన్నికలు లేవు. తన ఎన్నికల ప్రణాళికలో చెప్పిన విధంగా ప్రజలందరికీ సమాన న్యాయం చేసేందుకే బిజెపి ఈ బిల్లును ప్రవేశపెట్టింది కాని ఇది ఏ వర్గానికి వ్యతిరేకం కాదు. దేశాన్ని మత ప్రాతిపదికన కాంగ్రెస్ పార్టీ విభజించకపోయి ఉంటే ఈ బిల్లు ప్రవేశపెట్టే అవసరమే ఉండేది కాదని హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో చెప్పారు.

రాజ్యాంగ అసెంబ్లీలో ఈ విషయంపై చర్చ జరిగినప్పుడు తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ నుంచి వలస వచ్చిన హిందూ, సిక్కు శరణార్థులకు పౌరసత్వం కల్పించాలన్న డిమాండ్ ను నెహ్రూ లౌకి కవాదం పేరుతో తోసిపుచ్చారు. నెహ్రూ, లియాఖత్ ఒప్పందం కింద ఆయా దేశాల్లో భద్రత కల్పించకపోతే భారత దేశం కల్పిస్తుందన్న హామీని మనం ఆనాడు వారికి స్పష్టంగా ఇచ్చాం. నాడు భారత న్యాయశాఖ మంత్రిగా అంబేడ్కర్ ఉంటే, పాకిస్థాన్‌లో మరో దళిత నేత జోగేంద్ర నాథ్ మండల్ న్యాయమంత్రిగా ఉన్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్‌లో ముస్లిమేతరులపై దారుణ హింసాకాండ జరిగినందుకు ఆక్రోశంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. నెహ్రూ, లియాఖత్ ఒప్పందాన్ని అనుసరించి వారికి పాకిస్థాన్ న్యాయం చేయలేదని జోగేంద్రనాథ్ ఆవేదన చెంది భారత దేశానికి శరణార్థిగా వచ్చారు. కనుక విభజన బాధితులకు పౌరసత్వం కల్పించడం రాజ్యాంగపరంగా మన బాధ్యత కాదా?

పౌరసత్వ సవరణ బిల్లులో కేవలం హిందువుల గురించి మాత్రమే కాదు, హిందువులతో పాటు ఆరు మతాల వారి గురించి కూడా ప్రస్తావించారు. కాని ఈ మతాలవారెవ్వరినీ పట్టించుకోకుండా ముస్లింలను మాత్రమే ఎందుకు చేర్చలేదని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇస్లామిక్ దేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్‌లతో అణిచివేతకు గురైన ఆరు మతాలకు చెందిన శరణార్థులకు పౌరసత్వం కల్పించాలని ప్రతిపాదిస్తే ముస్లింల మాటేమిటి? అని వారడగడం విడ్డూరంగా ఉన్నది. ఇస్లామిక్ దేశాల్లో ఎక్కడైనా ముస్లింలు అణిచివేతకు గురవుతారా? అన్న ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు. ఒకప్పటి భారత భూభాగంలో మూడోవంతు భూమి ఇప్పటికే పాకిస్థాన్, బంగ్లాదేశ్ రూపంలో మనం ధారాదత్తం చేశాం. పాకిస్థాన్, బంగ్లాదేశ్ ను తమ మాతృభూమిగా స్వీకరించిన వారికి ఇంకా భారత దేశంలో చోటు కల్పిస్తామనడంలో అర్థం ఏమైనా ఉన్నదా?




పౌరసత్వ చట్టం ద్వారా దేశంలో అక్రమంగా చొరబడిన వారికి పౌరసత్వం కల్పిస్తున్నామని తప్పుడు ప్రచారం జరుగుతోంది. అయితే, గత ఏడు దశాబ్దాలుగా నిజమైన హక్కులు కోల్పోయి జీవిస్తున్న శరణార్థులకే హక్కులు కల్పిస్తున్నారు. కానీఈ, చొరబాటుదారులకు కానే కాదు. బంగ్లాదేశ్ నుంచి వచ్చే తాజా హిందూ వలసదారులకు పౌరసత్వం కల్పిస్తామన్న అభిప్రాయం కూడా సరైనది కాదు. 2014 డిసెంబర్ 31 తర్వాత వచ్చిన వారు ఎవరైనా వారికి పౌరసత్వం కల్పించే ప్రసక్తే లేదని చట్టం స్పష్టంగా చెప్పింది. కాబ్ (పౌరసత్వ సవరణ బిల్లు) ద్వారా 371 అధికరణను ఉల్లంఘిస్తామన్న వాదనలో కూడా పస లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజల భాష, సాంస్కృతిక, సామాజిక పరమైన అస్తిత్వానికి ఈ చట్టం వల్ల ఎలాంటి ఢోకా ఉండదు. అసోంలో మైనారిటీలకు దీని వల్ల ఏదో నష్టం జరుగుతుందని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇతర దేశాలనుంచి వచ్చే మైనారిటీలకే ఇది వర్తిస్తుంది కాని అసోంలోని మైనారిటీలకు ఎంత మాత్రం వర్తించదు. పైగా అసోంలో జీవిస్తున్న ఆదివాసులను అక్రమ వలసదారులనుంచి పరిరక్షించేందుకే ఎన్నార్సీని అమలు చేశామన్న విషయాన్ని మరిచిపోతున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోని ఇన్నర్ లైన్ పర్మిట్ ను ఉల్లంఘిస్తామని కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలా జరిగే అవకాశాలు లేవు సరికదా ఈ పర్మిట్ ను ఇప్పుడు మణిపూర్ లో కూడా అమలు చేస్తున్నారు. 6వ షెడ్యూలులో పేర్కొన్న అసోం, మేఘాలయ, మిజోరం, త్రిపురలోని గిరిజనులకు ఈ చట్టం వర్తించబోదని బిల్లులోనే స్పష్టం చేశారు.

అసోం ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తర్వాత వచ్చిన విదేశీ వలసదారులను వెనక్కి పంపాలని నిర్ణయించారు. పౌరసత్వ చట్టం ఈ ఒప్పందాన్ని పూర్తిగా గౌరవిస్తోంది. ఈ చట్టం ద్వారా బెంగాలీ హిందువులకు గుర్తింపు వచ్చి అసోం ప్రయోజనాలు దెబ్బతింటాయన్న వాదన నిజం కాదు. ఇది దేశ వ్యాప్తంగా ఉన్న శరణార్థులకే వర్తిస్తుంది కాని అసోంకు మాత్రమే వర్తించదు. ఇస్లామిక్ దేశాల్లో పీడనకు గురయిన వారు అన్ని రాష్ట్రాల్లో ఉన్నారు. దాదాపు లక్షన్నరమంది బెంగాలీ హిందువులు అసోంలో ఉన్నారని, వారికందరికీ గుర్తింపు లభిస్తుందని చేస్తున్న వాదన ఏ మాత్రం సరైంది కాదు. అసోం ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా, ఎటువంటి తనిఖీ లేకుండా విదేశీయులందరికీ గుర్తింపు ఇస్తారనుకోవడం భ్రమ మాత్రమే. అందులో వాస్తవం లేదు.

పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుత సవరణ వల్ల ఈ సెక్షన్ 5లో ఎలాంటి మార్పు లేదు. ముస్లింలతో సహా ఏ మతస్థుడైనా సరే, సెక్షన్ 6 ప్రకారం దేశంలో అయిదేళ్లు నివసించిన ఏ విదేశీయుడైనా పౌరసత్వం పొందవచ్చు. అలాంటప్పుడు ఏ మతస్థుడికైనా ఎలా అన్యాయం జరుగుతుంది?

నిజానికి కొన్ని మతాలవారికే పౌరసత్వం కల్పించడం కొత్త విషయం కాదు. అంబేడ్కర్ న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడే 1950లో వలసదారుల చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం అసోంలో దురుద్దేశ పూరితంగా ప్రవేశించిన వారిని బహిష్కరించాలని, అదే సమయంలో అల్లర్లకు గురై భారతదేశానికి వచ్చిన వారిని, ముఖ్యంగా హిందువులు, సిక్కులను అనుమతించాలని నిర్ణయించారు. మరి ఇప్పుడు చేస్తున్నదేమిటి? 2003లో అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కూడా పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే హిందూ, సిక్కు శరణార్థులకు పౌరసత్వం కల్పించే ప్రత్యేక అధికారాన్ని రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాలకు కల్పించారు. కాంగ్రెస్ హయాంలో కూడా 13వేలమంది హిందూ, సిక్కు వలసదారులకు పౌరసత్వం కల్పించారు. కనుక మోదీ ప్రభుత్వమే ఇలాంటి నిర్ణయాన్ని మొదటిసారిగా తీసుకోలేదన్నది స్పష్టం. 1978లో పాక్ అధ్యక్షుడైన సైనిక నియంత జియా ఉల్ హఖ్ హయాంలో పాకిస్థాన్‌లో ముస్లిమేతరులపై దారుణ దమనకాండ జరిగినప్పుడు కూడా అనేకమంది భారత దేశంలో ప్రవేశించారు. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడం కోసమే బిజెపి ప్రభుత్వం ఇన్నాళ్లకు ఒక నిర్ణయం తీసుకున్నది.

ఇంత హేతుబద్ధంగా వ్యవహరించినప్పటికీ విద్యార్థులను, నిర్దిష్ట మతాల వారిని ఎగదోస్తున్నాయి. ఈ చట్టం వల్ల ముస్లిం మైనారిటీలకు ఎలాంటి నష్టం లేదని హోంమంత్రి పార్లమెంట్‌లో పదే పదే చెప్పారు. 'బయట దేశాల్లో దారుణాలకు గురై ఎక్కడా తలదాచుకోలేని దీన స్థితిలో ఉన్న వారికి న్యాయం చేసేందుకే ఈ చట్టాన్ని చేశాము కాని భారత దేశంలో ఉన్న వారికి ఎలాంటి నష్టం జరగద'ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా చెప్పారు. దుష్ప్రచారాలకు, పుకార్లకు ప్రభావితమై కొందరు హింసాకాండ, ప్రజా ఆస్తుల ధ్వంసానికి పూనుకోవడం పట్ల ఆయన ఆవేదన ప్రకటించారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు ఇప్పటికైనా వివేకంగా వ్యవహరించకపోతే ప్రజలు వారికి బుద్ధి చెప్పక తప్పదు.

(బిజెపి జాతీయ కార్యదర్శి)

# సత్వర న్యాయంతోనే ఆర్థికాభివృద్ధి

భరతవాక్యం


■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

ఒక ఫ్యాక్టరీకి సంబంధించిన భూమి వివాదంలో ఉన్నది. ఉన్నత న్యాయస్థానం పాతికేళ్ళ అనంతరం ఆ వివాదాన్ని పరిష్కరించింది. మరి అన్ని సంవత్సరాలూ ఆ భూమి అనుత్పాదకంగా వున్నది. ఉత్పాదక సామర్థ్యం గల భూమి వ్యర్థంగా పడివుంటే సంపద సృష్టి ఎలా జరుగుతుంది? కనుక ఇటువంటి వివాదాలను శీఘ్రగతిన పరిష్కరించడం చాలా ముఖ్యం. ఉత్పాదక సామర్థ్యం గల వనరులు వృథాగా వుండకూడదు గదా. సత్వర న్యాయం చట్ట బద్ధ పాలనకు అత్యంత ఆవశ్యక అంశం. సత్వర న్యాయాన్ని సమకూర్చడంలో బ్రిటన్ 12 వ స్థానంలోను, సింగపూర్ 13 వ స్థానంలోను, అమెరికా 20 వ స్థానంలోను వుండగా భారత్ 68 వ స్థానంలో వుందని 'వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్' 2019 నివేదిక వెల్లడించింది. అభివృద్ధి చెందిన దేశాలు చట్టబద్ధ పాలనలో కూడా అగ్రగాములుగా వున్నాయని మరి చెప్పనవసరం లేదు.

న్యాయపాలనకు సంబంధించిన వ్యయాలు ఆర్థికాభివృద్ధిపై రెండు పరస్పర వ్యతిరేక ప్రభావాలను నెరపుతున్నాయి. ఈ వ్యయాల పెంపుదల, కేసుల సత్వర పరిష్కారానికి దోహదం చేసి, ఆర్థికాభివృద్ధికి పరోక్షంగా తోడ్పడుతుంది. అయితే ఈ వ్యయాలలో, కొన్ని ప్రభుత్వ బడ్జెట్ పై పెద్ద భారాన్ని మోపుతాయి. అవి, హై వేల నిర్మాణం మొదలైన అభివృద్ధి ప్రాజెక్టులపై చేసే వ్యయాలను అనివార్యంగా తగ్గిస్తాయి. తద్వారా వృద్ధిరేటు తిరోగతికి కారణమవుతాయి. న్యాయ పాలన సంబంధమైన జాప్యాలు భారత్ వృద్ధిరేటును 0.5 శాతం మేరకు తగ్గిస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు అధ్యయనం ఒకటి అంచనా వేసింది. నేర విచారణ వ్యవస్థలో జాప్యాలు హింసాకాండ పెరుగుదలకు దారితీసి, భారత్ జీడీపీలో 9 శాతం నష్టానికి కారణమవుతున్నాయని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పీస్' అధ్యయనం ఒకటి అంచనా వేసింది. న్యాయవ్యవస్థపై బడ్జెట్ వ్యయాలు 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.4386 కోట్లు కాగా 2019–20 ఆర్థిక సంవత్సరంలో అది రూ. 3055 కోట్లకు తగ్గిపోయాయి! మరి 'వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్' నివేదికలో భారత్ ర్యాంకు 2018లో 65 నుంచి 2019లో 68కి తగ్గిపోవడంలో ఆశ్చర్యమేముంది? ఇదే సమయంలో మన ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు సైతం తగ్గిపోవడం యాదృచ్ఛికమేమీ కాదు.

న్యాయ విచారణలో జాప్యాల వల్ల దోషులకే మేలు జరుగుతోంది. ఈ జాప్యాలకు దారితీస్తున్న కారణాలను చూద్దాం. న్యాయమూర్తుల పదవులు ఖాళీగా వుండడమే ఈ జాప్యాలకు ఒక ప్రధాన కారణం. 2006లో ఈ ఖాళీలు 15 శాతం కాగా 2015లో 37 శాతానికి పెరిగాయి. 2019లో అవి 37 శాతానికి పెరిగాయి. ఒక అధ్యయనం ప్రకారం దేశ సర్వోన్నత న్యాయస్థానం ఒక సంవత్సరంలో 190 రోజులపాటు పని చేస్తోంది. రాష్ట్ర హై కోర్టులు 232 రోజులు పని చేస్తుండగా కింది స్థాయి కోర్టులు 244 రోజులు పని చేస్తున్నాయి. సుప్రీం కోర్టు, హైకోర్టులకు వేసవిలో రెండునెలలపాటు సెలవులు వుంటాయి. ఈ ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులు దసరా, క్రిస్మస్ పర్వ దినాలలో వారం లేదాపక్షం రోజుల పాటు సెలవు తీసుకునే వెసులుబాటు వున్నది. న్యాయమూర్తులకు ఇన్ని సెలవులు అవసరమా? దేశ ప్రజలలో అత్యధికులకు కనీస తీరుబాటే కనాకష్టంగా వున్నది కదా. పైగా న్యాయస్థానాలలో కోట్లాది కేసులు పెండింగ్ లో వున్నప్పుడు న్యాయమూర్తులకు ఇన్ని సెలవులు వుండడం సమంజసమేనా? అలహాబాద్ హైకోర్టులో నేను ఒక కేసులో స్వయంగా వాదించాను. నేను దాఖలు చేసిన కేసుపై తక్షణమే విచారణ ప్రారంభించాలని అభ్యర్థిస్తూ నాలుగు దరఖాస్తులు సమర్పించాను. ఇందుకు నేను ఇరవై సార్లు ప్రయాగరాజ్ (అలహాబాద్ ప్రస్తుత పేరు)కు వెళ్ళవలసివచ్చింది! ఈ సందర్భంగా అమెరికాలో నేను విద్యార్థిగా వున్నప్పుడు అక్కడి న్యాయస్థానంలో నా అనుభవమేమిటో చెప్పితీరాలి. నేను, మరో ఇద్దరు భారతీయ విద్యార్థులు ఒక ఇంటిలో అద్దెకు వుండేవాళ్ళం. గృహ యజమాని ఒకసారి మాతో వివాద పడ్డారు. మాపై కోర్టులో కేసు కూడా దాఖలు చేశాడు. కేవలం ఇరవై రోజుల్లో కోర్టు తీర్పు వెలువడింది మాకు అనుకూలంగా. కేసుల పరిష్కారాన్ని జాప్యం చేయడంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య బాహాటంగా చెప్పని అవగాహన వుండడం న్యాయవాద వృత్తిలో ఒక ఆనవాయితీ. కేసు వాదనకై కోర్టుకు ఎన్ని సార్లు హాజరయ్యామన్న ప్రాతిపదికన న్యాయవాదులు తమ క్లయింట్స్ నుంచి ఫీజు తీసుకోవడం పరిపాటి. ఒక కేసు విచారణ ఎన్ని సార్లు జరిగితే న్యాయవాదులకు అంత లాభదాయకం మరి. విచారణ జరపాల్సిన న్యాయమూర్తి రాకపోయినా, ప్రతికక్షి న్యాయవాది వాయిదా కోరినా న్యాయవాదులు తమ ఫీజు విధిగా వసూలు చేసుకోవడం కద్దు. న్యాయమూర్తులు తప్పని సరిగా న్యాయవాదులతో కలిసి పని చేయాలి. కనుక న్యాయవాదుల ఆదాయ మూలాలు దెబ్బ తినే విధంగా న్యాయమూర్తులు వ్యవహరించరు. ఇది కేసు విచారణను వాయిదాల మీద వాయిదాలు వేసే సంస్కృతికి కారణమవుతోంది. జాతీయ హైవే నెంబర్ 1 కి వ్యతిరేకంగా నేను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో ఒక కేసు దాఖలు చేశాను. ఎన్‌జిటి చట్టం ప్రకారం కేసులను ఆరు నెలలలోగా పరిష్కరించాలి. అయితే, నేను దాఖలుచేసిన కేసు విషయంలో తుది తీర్పు వెలువరించడానికి ఎన్‌జిటి నాలుగేళ్ల కాలాన్ని తీసుకున్నది. ట్రిబ్యునల్, తన ఉనికికి కారణమైన చట్టాన్ని కచ్చితంగా అనుసరించనందుకు దానికి వ్యతిరేకంగా అప్పీల్ చేసేందుకు మరో న్యాయవేదిక ఏదీ లేదు. సుప్రీం కోర్టులో అప్పీల్ చేద్దామని ఆలోచించాను. అయితే అక్కడ కూడా తీర్పు సత్వరమే వచ్చే అవకాశం లేదు గనుక ఆ ఆలోచనను విరమించాను.



**సింగపూర్‌లో 1990 వ దశకంలో న్యాయ సంస్కరణలను అమలుపరచడానికి ముందు ఒక కేసును పరిష్కరించేందుకు సగటున ఆరు సంవత్సరాల వ్యవధి పట్టేది. న్యాయ సంస్కరణల అనంతరం ఈ వ్యవధి 1.25 సంవత్సరాలకు తగ్గిపోయింది. సింగపూర్ అనుభవాన్ని మన సర్వోన్నత న్యాయస్థానం అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా వున్నది.**

సుప్రీం కోర్టు, హై కోర్టుల కాజ్ లిస్ట్ (విచారణ జరగవలసివున్న కేసుల జాబితా), తీర్పుల పూర్తి పాఠాలు ఆన్ లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. అయితే తీర్పులకు ఆధారమైన కేసుల లిఖిత కథనాలు (అఫిడవిట్‌లు మొదలైనవి) లభ్యం కావడం లేదు. ఈ పరిస్థితి మారవలసిన అవసరమున్నది. దానివల్ల కేసుల విచారణను శీఘ్రగతిన ముగించి, తీర్పులను సత్వరమే వెలువరించడం సాధ్యమవుతుంది. 1990 వ దశకంలో సింగపూర్‌లో న్యాయ సంస్కరణలను అమలుపరచడానికి ముందు ఒక కేసును పరిష్కరించేందుకు సగటున ఆరు సంవత్సరాల వ్యవధి పట్టేది. న్యాయ సంస్కరణల అనంతరం ఈ వ్యవధి 1.25 సంవత్సరాలకు తగ్గిపోయింది. సింగపూర్‌లో ప్రతి లక్ష మంది జనాభాకు కేవలం 0.6 శాతం న్యాయమూర్తులే ఉన్నప్పటికీ ఈ సత్వర న్యాయం సాధ్యమయింది (మన దేశంలో ప్రతి లక్ష మంది జనాభాకు 2.0 శాతం మంది న్యాయమూర్తులు ఉన్నప్పటికీ కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది) సింగపూర్ అనుభవాన్ని మన సర్వోన్నత న్యాయస్థానం అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా వున్నది. చెప్పవచ్చినదేమిటంటే న్యాయాన్ని సత్వరంగా అందించాలి. దీనివల్ల ప్రజల మనస్సుల్లో చట్టం అంటే భయం నెలకొంటుంది. చట్టాన్ని ఉల్లంఘించడానికి ఎవరూ సాహసించరు. సత్వర న్యాయం కొరవడడం వల్ల మరింత మంది చట్టోల్లంఘనకు పాల్పడే అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ఖాళీగా వున్న న్యాయమూర్తుల పదవులను వెన్వెంటనే భర్తీచేయాలి.

**(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)**

# యాన్ అన్ సంగ్ మాస్టర్

కొందరు అంతే! వాళ్ళు రాసిందల్లా బంగారం... పలికిందల్లా పసిడి. కాలుపెట్టిన ప్రతి రంగంలో రాజయోగం. బహుశా, సమకాలీన తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగంలో అంతటి ప్రతిభ, ఆ అదృష్టం దక్కిన ఒకరు... ఇంకా చెప్పాలంటే ఒకే ఒక్కరు గొల్లపూడి మారుతిరావు. ఆయనను ఏమనాలి... ఎన్ననాలి... జర్నలిస్టు. రేడియో ప్రయోక్త. నవలా రచయిత. నాటకకర్త. సినిమా రైటర్. పాపులర్ యాక్టర్. టీవీ ప్రయోక్త! ఇన్నీ ఒక్కడే అయితే... దటీజ్ మారుతిరావ్!!

గొల్లపూడికి దక్కిన అదృష్టం ఏమిటంటే... పత్రికలు, రంగస్థలం, రేడియో, సినిమా ఇలా ఏ రంగంలోకి వెళ్ళినా, ఆనాటి దిగ్గజాలతో సాహచర్యం, సాన్నిహిత్యం. చిత్తూరు 'ఆంధ్రప్రభ'లో పనిచేస్తూ, ప్రముఖ జర్నలిస్టు జి. కృష్ణ లాంటివాళ్ళతో సాన్నిహిత్యం, 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ...' గీత రచయిత శంకరంబాడి సుందరాచారితో స్నేహం.. ఇలా ఎన్నో.. తొలిదశలో గొల్లపూడిని తీర్చిదిద్దాయి. కృష్ణశాస్త్రి, ఆచంట జానకీరామ్, శ్రీశ్రీ, ఆత్రేయ, అనిసెట్టి, సోమసుందర్, పి.వి. రాజమన్నార్, కె. వెంకటేశ్వరరావు, చాట్ల శ్రీరాములు లాంటి ప్రముఖులందరితో ఆయన అనుబంధం అపురూపం. సినిమాలకే వస్తే... అప్పటి ఏయన్నార్, ఎన్టీయార్, ఎస్వీయార్, సావిత్రి నుంచి ఇప్పటి వరుణ్ తేజ్, నిఖిల్ దాకా అందరితోనూ పనిచేశారు. దుక్కిపాటి నుంచి ఆదుర్తి, విశ్వనాథ్, బాపు రమణ, బాలచందర్, కమలహాసన్ దాకా అందరితో రచయితగా, నటుడిగా సెహభాష్ అనిపించుకున్నారు. ఆ అనుభవాలు, జ్ఞాపకాలు, ముందు తరం వారి నుంచి నేర్చుకున్న జ్ఞానం ఆయనకు ప్రతి ప్రక్రియలో ఆజన్మాంతం పెట్టుబడి అయ్యాయి.

నివాళి


గొల్లపూడి మారుతిరావు
(1939–2019)

పద్నాలుగో ఏట మొదలుపెట్టి, ఎనభై ఏళ్ళ వయసులో కన్నుమూసే దాకా అరవై ఆరేళ్ళకు పైగా సాగిన గొల్లపూడి రచనా వ్యాసంగం విస్తారమైనది. 'రోమన్ హాలీడే' కథలు, 'రాగరాగిణి' లాంటి నాటకాలు, అవార్డులెన్నో తెచ్చిన 'అనంతం', 'కళ్ళు' లాంటి నాటికలు, 'చీకటిలో చీలికలు', 'ఋణం', 'సాయంకాలమైంది' లాంటి నవలలు, 'డాక్టర్ చక్రవర్తి' మొదలు 'మామా కోడళ్ళ సవాల్' దాకా చేసిన అనేకానేక సినీ రచనలు గొల్లపూడి విస్తృత రచనా పరిధిలో మచ్చుకు కొన్ని. పురాణం సుబ్రహ్మణ్య శర్మ, కొమ్మూరి వేణుగోపాలరావు, గొల్లపూడి ముగ్గురూ కలసి 'ఆంధ్రజ్యోతి'లో రాసిన గొలుసుకట్టు నవల 'ఇడియట్' ఒక అపూర్వ ప్రయోగం. తరువాతి కాలంలో మారుతున్న తరాల, అంతరాల అన్వేషణలో ఆయన రాసిన 'సాయంకాలమైంది' నవల ఒక క్లాసిక్. శ్రీవైష్ణవ సంప్రదాయ కుటుంబ నేపథ్యంలో సాగే ఆ నవల 1990ల చివరలో 'ఆంధ్రప్రభ' వీక్లీలో సీరియల్‌గా వస్తున్నప్పుడే పెను సంచలనం. ఇక, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మాల నేపథ్యంలో ఒక బ్రాహ్మణుడి జీవితం చుట్టూ తిరిగే నవల 'ఋణం'. భారతీయతకు ప్రతీకగా నిలిచే విశ్వనాథ వారి 'వేయిపడగలు' లాగా, నవీన సహస్రాబ్దిలోని ఆధునిక సాంఘిక నవలల్లో గొల్లపూడి రాసిన ఈ నవలది ఓ ప్రత్యేక స్థానం అని విమర్శకుల మాట. బ్రాడ్వే లాంటి ప్రపంచ ప్రసిద్ధ రంగస్థల వేదికల వద్ద గడుపుతూ, ఆయన రాసిన అనుభవాలు, అక్కడి నాటకాల వివరణలు మోడరన్ థియేటర్ లవర్స్‌కు అనఫీషియల్ టెక్స్ట్‌బుక్స్. అంతెందుకు... ఆ మధ్య ఆరేడేళ్ళ క్రితం కూడా ఆధునిక రంగస్థలంపై బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో గొల్లపూడి ఇంగ్లీషులో అనర్గళంగా ప్రసంగిస్తే, అక్కడి వారంతా ఆశ్చర్యానందాలతో ముక్కున వేలేసుకున్నారు.

ఎక్కడో పేపర్‌లో ఓ మూల ఇరుక్కుపోయిన ఏ మామూలు వార్తనో తన కాలమ్‌లో మనసు కదిలించే కథనంగా మలచడమూ ఆయనకే పట్టుబడిన విద్య. రచనలో అటు తెలుగు, ఇటు ఇంగ్లీషు వాక్యాలు మేళవిస్తారు. ప్రముఖుల మాటలు ప్రస్తావిస్తారు. జ్ఞాపకాల జాడీలో నుంచి అల్లం మురబ్బాలు అందిస్తారు. వెరసి, ఆయనది ఆగకుండా సాగే, ఆపకుండా చదివించే ఒక గమ్మత్తైన శైలి. ఆయన మాటా అంతే! మాట్లాడమే తప్ప రాయలేనివాళ్ళు, రాయడం వచ్చినా నోరు విప్పి నాలుగు ముక్కలు మాట్లాడలేనివాళ్ళు ఎక్కువైన చోట గొల్లపూడి సవ్యసాచి. ఆయన ఉపన్యాస ధోరణి, వినాలనిపించే మాడ్యులేషన్‌లో, విలక్షణమైన ఆ మాట విరుపు మరొకరిలో చూడం! అదొక వాక్ప్రవాహ ఝరి. అనేకానేక క్లాజులు, సబ్ క్లాజులతో కూడిన సుదీర్ఘ వాక్యనిర్మాణంతో కూడా శ్రోతలను కట్టిపడేయడం, ఒక కాన్సెప్టును సులభంగా, స్పష్టంగా అర్థమయ్యేలా వినేవారి చెవులకు ఎక్కించడం ఆధునిక తెలుగు సాహితీ, వక్తృత్వ వేదికపై గొల్లపూడికే చెల్లిన ఘనత. వెరసి, అక్షరం మీద అదుపు, ప్రేమ తగ్గిపోతున్న కొత్త తరానికి కాలాతీతమైన కాలమ్‌లు రాయడమెలాగో, శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేస్తూ మాట్లాడడం ఎలాగో చెప్పకనే చెప్పాయి గొల్లపూడి రాత, మాట! అందుకే, కమ్యూనికేషన్ రంగంలో నిస్సందేహంగా హి ఈజ్ ఎ గ్రేట్ అన్ సంగ్ మాస్టర్.

ఒకచోట ఆగిపోతే ఏరైనా, ఎవరైనా పాచిపట్టేస్తారని గొల్లపూడికి బాగా తెలుసు. అందుకే, వ్యక్తిగా జీవితంలోనూ, రచయితగా వివిధ ప్రక్రియల విన్యాసంలోనూ ఆయన ఎక్కడో ఒక చోట ఆగిపోలేదు. మారుతున్న కాలంతో పాటు మారడానికి క్షణమైనా ఆలసించలేదు. అలసత్వం చూపనూ లేదు. అందుకే లెటర్ ప్రెస్సుల నాటి ఈ మనిషి తన షష్టిపూర్తి వయసులో కొత్త సహస్రాబ్దికీ, కొత్త సాంకేతిక పరిజ్ఞానానికీ తగ్గట్టు కంప్యూటర్ ముందు కూర్చొని, తెలుగు కంపోజింగ్ నేర్చుకొని మరీ ఇంటర్నెట్‌కు రాశారు. సొంత గళంలో తన అభిప్రాయాల ఆడియో పాడ్ కాస్ట్‌లు రెగ్యులర్‌గా తానే రికార్డు చేసి, అంతర్జాలంలో అప్ లోడ్ చేశారు. వీడియో ఇంటర్వ్యూలు చేశారు. ఉపగ్రహ తెలుగు టీవీ ఛానళ్ళ తొలి దశలో, 1990లలోనే ఆయన మద్రాసు నుంచి సింగపూర్‌కో, శ్రీలంకకో వెళ్ళి మరీ ఒక ఉపగ్రహ తెలుగు టీవీ ఛానల్‌లో ప్రత్యేక యాంకర్‌గా తెలుగునాట ఎన్నికల ఫలితాల విశ్లేషణను విలంబిత ప్రత్యక్ష ప్రసారంలో అందించడం అప్పట్లో ఒక అబ్బురం. బుల్లితెరపై వ్యాఖ్యాతగా ఆయన చేసిన 'ప్రతిధ్వని', భార్యాభర్తల అన్యోన్య దాంపత్య జీవన సూత్రాల 'మనసున మనసై...' లాంటి ప్రోగ్రామ్‌లు ఇంటింటా సూపర్ హిట్. అలాగే, గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని టీవీ సీరియల్‌గా తీస్తే, అందులో గిరీశమూ గొల్లపూడే. బహుశా తెలుగు సమాజంలో పత్రికలు, రంగస్థలం, రేడియో, సినిమా, టీవీ, ఇంటర్నెట్... ఇలా అన్ని మాధ్యమాలలోనూ ఇంతటి అభినివేశం ఉన్న ఏకైక వ్యక్తి గొల్లపూడి. మీడియమ్ ఏదైనా... దానికి కళ్ళెం వేసి, ఒడుపుగా పరుగులు తీయించగల అశ్వహృదయమేదో ఆయనకు తెలుసు. అదే ఈ సమగ్ర విద్యాధికుడు, సహజ నటుడు, సరస సంభాషణా చతురుణ్ణి చాలామంది కన్నా భిన్నంగా నిలిపింది. ఎంతోమందితో ఆత్మీయంగా కలిపింది.

**బహుశా తెలుగు సమాజంలో పత్రికలు, రంగస్థలం, రేడియో, సినిమా, టీవీ, ఇంటర్నెట్... ఇలా అన్ని మాధ్యమాలలోనూ ఇంతటి అభినివేశం ఉన్న ఏకైక వ్యక్తి గొల్లపూడి. మీడియమ్ ఏదైనా... దానికి కళ్ళెం వేసి, ఒడుపుగా పరుగులు తీయించగల అశ్వహృదయమేదో ఆయనకు తెలుసు. అదే ఈ సమగ్ర విద్యాధికుడు, సహజ నటుడు, సరస సంభాషణా చతురుణ్ణి చాలామంది కన్నా భిన్నంగా నిలిపింది. జీవితాన్ని అన్నిరకాలుగా అనుభవించి, సంగీతాన్నీ సాహిత్యాన్నీ శ్వాసించి, ఎక్కిన ప్రతి వేదికనూ శాసించి గొల్లపూడి వెళ్ళిపోయారు. చెన్నపట్నంలో మరో తెలుగు చిరునామా చెరిగిపోయింది.**

మద్రాసు, విశాఖ... ఇలా ఎక్కడున్నా ప్రతి సాయంత్రం గొల్లపూడి దంపతులదో నిత్య కృత్యం. సాయంత్రం అయిదు దాటుతూనే ఆది దంపతుల లాంటి ఆ ఇద్దరూ చక్కగా తయారై, ఏ బీచ్ రోడ్డులోనో కాసేపు కారులోనే కులాసాగా తిరిగేవారు. చీకటి పడుతుండగానే ఏ మ్యూజిక్ అకాడెమీలోనో, నారద గానసభలోనో, కళాభారతి ఆడిటోరియమ్‌లోనో ఎక్కడ మంచి సంగీత కచ్చేరీ, నృత్య ప్రదర్శనలు జరుగుతున్నా ఠంచనుగా వెళ్ళి, ముందు వరుస ప్రేక్షకులలో కూర్చోవాల్సిందే. ఆస్వాదించాల్సిందే. 'పద్మభూషణ్' శ్రీపాద పినాకపాణి అన్న కూతురైన శివకామసుందరి (శరత్ సాహిత్య ప్రేరణతో ఆయన ఆమెను పిలిచే పేరు శివాని)కీ, ఆమెను యాభై ఎనిమిది ఏళ్ళ క్రితం కట్టుకున్న గొల్లపూడికీ శాస్త్రీయ సంగీతం అంటే అంత పిచ్చి. అలా... రాగాలు, వాటి లక్షణాలు, సుప్రసిద్ధ కీర్తనలు సహా ఎన్నో సంగీత మర్మాలు గొల్లపూడికి మనోపాఠం. శ్రీపాద పినాకపాణి, బాలమురళీకృష్ణ, బాలాంత్రపు రజనీకాంతరావు, నేదునూరి, నూకల లాంటి సంగీత దిగ్గంతులతో కూర్చొని, సంగతులు ముచ్చటించగల పాండిత్యం ఆయనది.

చేతికందిన చెట్టంత కొడుకు దర్శకుడిగా తొలి యత్నంలోనే సాగరగర్భంలో మునిగిపోతే, ఆ గర్భశోకాన్ని సైతం ప్రతిభావంతులైన కొత్త దర్శకులకు జోతలతో పండుగగా మార్చిన సకృత్తయిన కన్నతండ్రి గొల్లపూడి. చిన్నతనంలోనే భర్త పోయిన ఆ కోడలికి మారు మనువు చేసిన సంస్కరణవాదమూ ఆయనదే! ఆయన ఆత్మకథ 'అమ్మ కడుపు చల్లగా', దానికి కొనసాగింపుగా ఆయన రాసిన మరి కొన్ని జ్ఞాపకాలు 'నా డైరీలో కొన్ని పేజీలు' ఒక రకంగా గత శతాబ్ది ద్వితీయార్థపు తెలుగుదేశపు సోషియో, కల్చరల్ డాక్యుమెంట్. ఏమైనా, జీవితాన్ని అన్నిరకాలుగా అనుభవించి, సంగీతాన్నీ సాహిత్యాన్నీ శ్వాసించి, ఎక్కిన ప్రతి వేదికనూ శాసించి గొల్లపూడి వెళ్ళిపోయారు. చెన్నపట్నంలో మరో తెలుగు చిరునామా చెరిగిపోయింది. గుడ్ బై... గొల్లపూడి గారూ!!

■ డాక్టర్ రెంటాల జయదేవ

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
5
మంగళవారం ● 17 డిసెంబర్ 2019



# నో ప్లాస్టిక్.. ఈ సిస్టర్స్ నినాదం!

**అందరం మార్పు కోరుకుంటాం... కానీ అందుకోసం కృషి చేసేవాళ్లు మాత్రం అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో చెప్పుకోదగ్గ అక్కాచెల్లెళ్లు ప్రజ్ఞా నాగోరి, మృదు నాగోరి! వీరిద్దరూ ప్లాస్టిక్ వ్యతిరేక పోరాటంలో ఒక్కటయ్యారు. పర్యావరణహితంలో భాగంగా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను సమాజానికి అలవాటు చేస్తున్నారు. రోడ్ స్కూలింగ్‌లో భాగంగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ, పర్యావరణహిత ఉత్పత్తులకు ప్రచారం కల్పిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఈ ఇంటర్ విద్యార్థినులు 'నవ్య'తో పంచుకున్న అనుభవాలు వారి మాటల్లోనే...**

"వివిధ రూపాల్లో ఇప్పటికే ప్లాస్టిక్ మన జీవితంలోకి చొచ్చుకువచ్చింది. అయితే ఒక్కొక్కటిగా ప్లాస్టిక్ వస్తువుల స్థానాన్ని ప్రత్యామ్నాయాలతో భర్తీ చేయగలిగితే ప్లాస్టిక్ రహిత జీవితాన్ని గడిపే దశకు చేరుకోవడం అసాధ్యమేమీ కాదు. ఈ ఆలోచనతోనే 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'కు వ్యతిరేకంగా పోరాటం చేపట్టాం. మా పోరాటానికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఇదంతా మాకున్న అభిరుచి నుంచే మొదలైంది. మా అమ్మ అభిలాష నాగోరి క్రియేటివ్ డిజైనింగ్ రంగంలో ఉంది కాబట్టి ఇంట్లో మమ్మల్ని కూడా 'పనికిరాని వస్తువులతో ఉపయోగపడే వస్తువులు తయారుచేయమ'ంటూ ప్రోత్సహించేది. అలా ఆర్ట్ వర్క్, కార్డ్ మేకింగ్ లాంటివి చేయడం మొదలుపెట్టాం. తర్వాత పెన్సిల్ షార్ప్‌నర్లు, పేపర్‌తో పెన్సిల్ తయారీ, ఎకో బ్రిక్స్ (ప్లాస్టిక్ చెత్త నింపిన ప్లాస్టిక్ సీసాలు) లాంటివి తయారుచేశాం. అలా పరిమితంగా ఉన్న మా ఆసక్తి ఒక అంతర్జాతీయ సంస్థ శిక్షణ కార్యక్రమంలో చేరడంతో మరింత విస్తృతమైంది. ఆ అంతర్జాతీయ సంస్థ - జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ! దానికి 'బంజారా హైదరాబాద్' అనే పేరుతో హైదరాబాద్‌లో ఒక శాఖ ఉంది. దీన్లో 'సుస్థిర జీవన విధానం' అనే విభాగంలో మేం శిక్షణ పొందాం. పర్యావరణానికి నష్టం కలిగించే ఉత్పత్తులకు బదులుగా కార్డ్‌బోర్డ్, పేపర్, వెదురుతో వస్తువులను తయారుచేయడం, అలా తయారుచేసే చేతివృత్తుల పనివారిని ప్రోత్సహించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం. మాకు అప్పటికే ఉన్న అభిరుచికి ఈ శిక్షణ ఎంతో తోడ్పడింది. ఈ ఉత్పత్తులనే పెద్ద మొత్తంలో తయారుచేసి విక్రయించాలనే ఆలోచనతో 'ఊర్జా' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాం. మా సంస్థ కార్యక్రమాలు ఎంతోమందికి ఉపాధిని కల్పించాయి.

**'ఊర్జా'తో స్వయంఉపాధి...**

'ఊర్జా' అనే హిందీ పదానికి 'శక్తి' అని అర్థం. పర్యావరణహిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడం, అందుకోసం కష్టపడే చేతివృత్తులవారికి స్వయం ఉపాధి కల్పించడం, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని సృష్టించడం కోసం ఈ స్వచ్ఛంద సంస్థను స్థాపించాం. దీన్లో మాతో పాటు ఇంకొంతమంది వాలంటీర్లు కూడా పని చేస్తున్నారు. వారితో కలిసి పలు అవగాహనా కార్యక్రమాలు చేస్తున్నాం. వేర్వేరు రాష్ట్రాల్లో రోడ్ స్కూలింగ్ చేపట్టాం. విభిన్న చేతివృత్తులవారిని కలిశాం. వారికి పర్యావరణహితమైన వస్తువులను ఎలా తయారుచేయాలో తెలుసు. కానీ వాటిని విక్రయించడం తెలియదు. వారిలో ఎక్కువ శాతం చదువు రానివారే. దాంతో బయట ప్రపంచానికి తెలియకుండానే ఆ ఉత్పత్తులు ఒక్క ప్రాంతానికే పరిమితమైపోతున్నాయి. ఇలాంటి వారిని కలవడం కోసం వేర్వేరు రాష్ట్రాల్లో రోడ్ స్కూలింగ్ చేపట్టాం. వారి నుంచి ఆ ఉత్పత్తులను సేకరించి, ప్రచారం కల్పించి, విక్రయించి వారి కష్టానికి తగిన ఫలం దక్కేలా సహాయపడ్డాం. ఇలా ఇప్పటివరకూ కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో తిరిగాం. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల్లో కూడా పర్యావరణహితమైన ఉత్పత్తులను ప్రోత్సహించాలనేది మా ఆలోచన.

**నాటకాలు, డాన్సులతో కూడా...**

తరచుగా రోడ్డు నాటకాలు (నుక్కడ్ నాటక్), బ్యాండ్ పర్‌ఫార్మెన్స్‌ల ద్వారా హైదరాబాద్‌లో ప్లాస్టిక్‌రహిత ఉత్పత్తుల వాడకంతో ఉన్న ఉపయోగాలను ప్రచారం చేస్తున్నాం. దీన్లో భాగంగా అపార్ట్‌మెంట్లు, స్కూళ్లు, సైబర్ సెక్యూరిటీలలో ప్రదర్శనలు ఇచ్చాం. ఆ సమయంలోనే మా ఉత్పత్తుల స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తూ, ఉత్పత్తులకు ప్రచారం కల్పించాం. ఇప్పటివరకూ మా ప్రదర్శనలకు మంచి స్పందన వచ్చింది. ప్రజలు ప్లాస్టిక్ వినియోగం నుంచి ప్రత్యామ్నాయ వనరుల వైపు మొగ్గు చూపడం మొదలుపెట్టారు. అలాంటి ఉత్పత్తులు విస్తృతంగా మార్కెట్లో అందుబాటులో ఉంటే, ప్లాస్టిక్ వస్తువుల వాడకం కచ్చితంగా తగ్గుతుందనే నమ్మకం మాకు ఉంది.

> "మా పూర్వీకులు రాజస్థాన్ నుంచి కోల్‌కతాలో స్థిరపడ్డారు. అక్కడి నుంచి నాన్న కృష్ణ నాగోరి వ్యాపారరీత్యా హైదరాబాద్ రావడంతో మేం ఇక్కడ స్థిరపడ్డాం. పుట్టిపెరిగింది హైదరాబాద్‌లోనే కాబట్టి ఒకవిధంగా ఇదే మా సొంతూరుగా భావిస్తాం!"









**పుస్తకాలు, పెన్సిళ్లలో విత్తనాలు!**

ప్లాస్టిక్ బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులు వాడడం పర్యావరణహితమే! అయితే పర్యావరణానికి అంతకు మించిన మేలు ఏం చేయగలమా? అనే ఆలోచనతో ఆ వస్తువులకు విత్తనాలు జోడించడం మొదలుపెట్టాం. పుస్తకాల అట్టల తయారీ సమయంలో కాగితపు గుజ్జుకు తులసి, బంతి విత్తనాలు జోడించాం. రీసైకిల్ పేపర్‌తో తయారయ్యే పెన్సిళ్లు, షార్ప్‌నర్లలోనూ విత్తనాలు ఉంచాం. వీటిని వాడేసి పారేసిన తర్వాత, అవి మొక్కలుగా మొలకెత్తుతాయి.

**ఇది అందరి బాధ్యత!**

పర్యావరణహితం కోసం చేస్తున్న మా కృషికి గుర్తింపుగా గత అక్టోబరులో ఐఐటి ఢిల్లీ నుంచి పురస్కారం అందుకున్నాం. అదొక అద్భుతమైన అనుభవం. సమాజానికి మేలు చేసే పనుల్లో ఆనందం ఉంటుంది. 'సమాజంలో భాగస్థులుగా సమాజానికి తిరిగి ఏం అందించాం?' అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. మనం చేసే పనుల మీదే మన ముందు తరాల మనుగడ ఆధారపడి ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలనేది మా కోరిక!"

● **గోగుమళ్ల కవిత**
ఫొటోలు: **రాజేష్ జంపాల**

## వాళ్లూ... వాటా ఇవ్వాల్సిందే!



"ఒక పక్క చదువు, మరోపక్క అభిరుచి.. రెండింటినీ బ్యాలెన్స్ చేయడం కొంత కష్టమే! అయినా మా అమ్మాయిలు రెండు పనులకూ సమ న్యాయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. వీళ్లకు ఇతరత్రా అభిరుచులూ ఉన్నాయి. ప్రజ్ఞ వయొలిన్ నేర్చుకుంటోంది. డ్రమ్స్ కూడా బాగా వాయిస్తుంది. స్క్వాష్ ఆడుతుంది. మృదు మురళీగానం చేస్తుంది. స్కూల్లో బాస్కెట్‌బాల్ ప్లేయర్ కూడా! ఇన్ని పనులతో వేర్వేరు రాష్ట్రాల్లో ప్లాస్టిక్ రహిత పర్యావరణ ప్రచారం అంటే వీలుపడదు. అందుకోసం సెలవురోజులను ఎంచుకుంటూ ఉంటారు. ఉత్పత్తులు అమ్మడంలో వచ్చిన సంపాదన అనవసరపు ఖర్చులకు వృథా చేయరు. ఇల్లు సొంతదే అయినా, ఇంట్లో వాళ్లు వాడుకుంటున్న గదికి అద్దె తీసుకుంటాను. డ్రైవర్‌కూ, ఇంటిపనివారికీ జీతాల్లో ఇచ్చే మా పిల్లల వాటా కింద కొంత తీసుకుంటాను. ఇదంతా వారికి డబ్బు విలువ తెలియచేయడం కోసమే! సాధారణ వృత్తుల్లో స్థిరపడితే నలుగురికీ ఉపాధి కల్పించే వీలు ఉండకపోవచ్చు. అందుకే నా కూతుళ్లను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనుకుంటున్నా. వ్యాపారవేత్తలుగా స్థిరపడితే ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చు."

**- అభిలాష నాగోరి**

---

తిరుప్పావై

# నియమాలు పాటిద్దాం!



**రెండో పాశురం**

**వైయత్తు వాళ్ వీర్గాళ్! నాముమ్ నమ్ పావైక్కు**
**శెయ్యుమ్ కిరిశైగళ్ కేళీరో పాఱ్కడలుళ్**
**పైయత్తుయిన్ర పరమనడిపాడి**
**నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్ నాట్కాలే నీరాడి**
**మైయిట్టెళుదోం మలరిట్టు నామ్ ముడియోమ్**
**శెయ్యాదన శెయ్యోమ్ తీక్కుఱళై శెన్ను ఓదోమ్**
**ఐయముమ్ పిచ్చైయుమ్ ఆందనైయుమ్ కైకాట్టి**
**ఉయ్యుమాఱెణ్ణి ఉగందేలోర్ ఎమ్బావాయ్**

మార్గళి మాస కాత్యాయనీ వ్రతంలో ఆచరించాల్సిన నియమాలను తన నెచ్చెలులకు గోదాదేవి తెలియజేస్తోంది. "వ్రేపల్లెలో నివసిస్తూ, ఆనందంగా ఉండే నెచ్చెలులారా! మనం ఆచరించాల్సిన వ్రతంలో పాటించాల్సిన విధులేమిటో వినండి. మనం పాలకడలిలో శయనించిన పరమ పురుషుడి పాదాలను కీర్తిస్తూ గానం చేద్దాం. వ్రత సమయంలో నెయ్యిని కానీ, పాలను కానీ ఆహారంలో తీసుకోవద్దు. ఉదయాన్నే స్నానం చేద్దాం. ఈ వ్రత కాలంలో మనం కంటికి కాటుక ధరించవద్దు. తలలో పూలు ముడువవద్దు. పరుల గురించి పరుషమైన మాటలు మాట్లాడవద్దు. అతిథులకూ, అభాగతులకూ శక్తి కొద్దీ దానం చేద్దాం. స్వార్థాన్ని వదిలేద్దాం. మనం తరించే మార్గాన్ని భావిస్తూ జీవిద్దాం. ఆనందంగా జీవిద్దాం" అంటూ చెలులందరినీ గోదాదేవి పిలిచింది.

● **ఎ. సీతారామారావు**

---

ట్రెండ్

# మోడర్న్ 'ఇయర్ రింగ్స్'!

హ్యాంగింగ్స్ లేదంటే స్టడ్స్... 'ఇంతకంటే ఇయర్ జ్యువెలరీలో వెరైటీలేముంటాయి?' అని అమ్మాయిలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఊహకందని మోడర్న్ ఇయర్ రింగ్స్ మార్కెట్లోకొచ్చేశాయి. డ్రస్సింగ్ స్టయిల్, డిజైన్‌కి తగ్గ ఈ మోడర్న్ ఇయర్ రింగ్స్ పెట్టుకుంటే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ కచ్చితంగా మీరే!



**ఇయర్ జాకెట్స్:** చెవి తమ్మె ముందూ వెనకా రెండు వైపులా ఫిక్స్ అయిపోయే ఈ రకం కమ్మలు ఇప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్. ముందు వైపు చిన్న స్టడ్ ఉంటే దానికి అటాచ్‌మెంట్‌గా వెనకవైపు కొంచెం పెద్ద సైజు స్టడ్ ఉండే వెరైటీ ఇయర్ రింగ్స్ ఇవి. చెవికి తొడిగినట్టుగా రెండు వైపులా కనిపిస్తాయి కాబట్టే ఈ చెవి పోగులకు ఇయర్ జాకెట్స్ అని పేరు.

**డబుల్ సైడెడ్ ఇయర్ రింగ్స్:** వెనకది ముందుకు, ముందుది వెనక్కి మార్చి మార్చి పెట్టుకునే వీలుండేలా తయారైన ఇయర్ రింగ్స్ ఇవి. డ్రస్‌కి నప్పేట్టుగా, స్టయిల్‌కి తగ్గట్టుగా ఒకే ఇయర్ రింగ్‌ని మార్చుకునే వీలుంది కాబట్టే వీటికి డబుల్ సైడెడ్ ఇయర్ రింగ్స్ అని పేరు.

**ఫ్రంట్ బ్యాక్ ఇయర్ రింగ్స్:** చెవి పోగు వెనకుండే హుక్‌కు ఆకర్షణ తెచ్చిపెట్టే ఈ రకం ఇయర్ రింగ్స్ చూడముచ్చటగా ఉంటాయి. కమ్మతోపాటు వెనకవైపుంటే హుక్ పెట్టుకున్నప్పుడు ఓ బొమ్మ లేదా ఓ ఆకారం కనిపించటం ఫ్రంట్ బ్యాక్ ఇయర్ రింగ్స్ ప్రత్యేకత.

**ఇయర్ కఫ్స్:** చెవులు మరింత ఆకర్షణీయంగా కనిపించాలంటే చెవి మొత్తాన్ని కవర్ చేసే ఆభరణం పెట్టుకోవాలి. ఈ ఐడియాతో తయారైనవే ఇయర్ కఫ్స్. చూడటానికి కాస్త పెద్దవిగా చెవి మొత్తాన్ని కవర్ చేసే ఇయర్ కఫ్స్ ఎన్నో వెరైటీ మెటీరియల్స్, డిజైన్స్‌తో తయారవుతాయి.

---

లీగల్ కౌన్సెలింగ్



## ప్రేమ వివాహం నేరం కాదు కదా!

నేనొక అబ్బాయిని ప్రేమించాను. ఈ విషయం నాన్నకు చెప్పి ఒప్పించాలనుకున్నా. కానీ ఈలోపే ఆయన మరణించారు. నేను ప్రేమించిన వ్యక్తిని మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నా. నిజానికి నా ప్రేమ విషయం మా అన్నయ్యకు తెలుసు. కాకపోతే నేనుగా అతనికి చెప్పలేదు. అతని స్నేహితులతో మా ప్రేమ గురించి చాలాసార్లు ప్రస్తావించాడు కాబట్టి అతనికి తెలుసనేది వాస్తవం. విషయం తెలిసినా ఏనాడూ తన అభ్యంతరాన్ని వ్యక్తం చేయలేదు. తీరా నేను పెళ్లి చేసుకున్నాక 'కుంటుంబ గౌరవాన్ని గంగలో కలిపావు' అంటున్నాడు. నా ప్రేమ వివాహం వల్ల తలెత్తిన కొత్త సమస్య ఏమిటంటే.. మా నాన్నకు స్వార్జితం, పిత్రార్జిత ఆస్తులు ఉన్నాయి. 'వాటిల్లో నీకు ఏ హక్కూ లేదని, వాటిని నీకు ఇచ్చే ప్రసక్తే లేద'ని అంటున్నాడు. నా వివాహానికి, ఆస్తిలో వాటాలకు సంబంధమేమిటో అర్థం కావడం లేదు. నేను నా ఆస్తిని రాబట్టుకోవడానికి ఏం చేయాలి?

**- వి. హరిత,** ఖమ్మం

సంప్రదాయ వివాహం చేసుకుంటారా? ప్రేమ వివాహం చేసుకుంటారా? అనేది వారి వ్యక్తిగతం. ఆ మిషతో రావాల్సిన ఆస్తి వాటాను రాకుండా చేయలేరు. మీ ప్రేమ వివాహం విషయంలో మీ అన్నయ్య తన అభిప్రాయం చెప్పొచ్చు. అంతవరకే గానీ, అభ్యంతరం చెప్పే అధికారం లేదు. ఒకవేళ మైనర్లు అయితే చట్టపరమైన సమస్యలు ఉంటాయి కాబట్టి, ఎవరైనా పెద్దవాళ్ల అభిప్రాయాన్ని గౌరవించాల్సి ఉంటుంది. పెళ్లి చేసుకునే నాటికి మీరు మైనర్‌గా ఉన్నారా లేదా అనే విషయం రాయలేదు. మేజర్ అయ్యుంటే మీ వివాహాన్ని అడ్డుకునే హక్కు ఎవరికీ ఉండదు. మీ అన్నయ్య, ప్రేమ వివాహానికీ, ఆస్తులకు ముడిపెట్టి మాట్లాడటంలో అర్థం లేదు. ప్రేమ వివాహం చేసుకున్నంత మాత్రాన సక్సెషన్ యాక్ట్ ప్రకారం మీకు పుట్టుకతోనే సంక్రమించిన హక్కులు ఏమీ హరింపబడవు. మీ ఆస్తుల వివరాలు తెలియజేస్తూ న్యాయవాదిని సంప్రదించి మీకు రావాల్సిన వాటాని పార్టీషన్ చేసి ఇవ్వమని నోటీసు పంపించండి. స్పందించకపోతే మీరు పార్టీషన్ సూట్ వేసుకోవచ్చు. మీ తల్లిగారు జీవించి ఉంటే ఆ ఆస్తి మూడు భాగాలు అవుతుంది. లేకపోతే ఉన్న ఆస్తిలో సగ భాగం మీకు వచ్చే అవకాశం పూర్తిగా ఉంది.



● **ఒడ్నాల శ్రీహరి,** న్యాయవాది, హైదరాబాద్

---

## ముత్యాల ముగ్గు



21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకు
సరిచుక్క



**అర్చన**
ఏలేశ్వరం,
తూర్పుగోదావరి జిల్లా

30 చుక్కలు
4 వరుసలు
4 వచ్చే వరకు



**ఎన్.రోజా**
గాజువాక, విశాఖపట్నం



15 చుక్కలు
మధ్య చుక్క
8 వచ్చే వరకు



**సి.సౌమ్య**
ఆర్మూర్, నిజామాబాద్



15 చుక్కలు
1 వచ్చే వరకు
సరి



**జి. కళ్యాణి**
హన్మకొండ

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

**మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com**

నవ్య ఆంధ్రజ్యోతి డాక్టర్



వింటర్ కేర్

# చల్లగాలుల్లో... మరింత అప్రమత్తంగా..!

**చల్లగాలుల నుంచి స్వెటర్లు కాపాడతాయి!**
**మరి అదే గాలిలో సంచరించే సూక్ష్మక్రిముల మాట ఏంటి?**
**వీటి నుంచి మనల్ని మనం కాపాడుకునే మార్గమే లేదా?**
**నిజానికి కొంత అప్రమత్తత,**
**మరికొంత ముందు జాగ్రత్త పాటిస్తే....**
**చలికాలం సమస్యల నుంచి ఒడుపుగా తప్పించుకోవచ్చు!**

అనువైన చల్లని వాతావరణంలో రైనోవైరస్, రెస్పిరేటరీ వైరస్, సిన్సీషియల్ వైరస్, అడినోవైరస్, ఇన్‌ఫ్లూయెంజా వైరస్... ఇలా పలు రకాల వైరస్‌లు విచ్చలవిడిగా సంచరిస్తూ ఉంటాయి. శ్వాసతో పాటు శరీరంలోకి ప్రవేశించే ఈ సూక్ష్మక్రిములు తుమ్ములు, దగ్గుల ద్వారా ఇవి అంటుకుని ఉండే వస్తువులను తాకి, అదే చేతితో ముక్కును తాకినా సోకుతాయి. అయితే రోగనిరోధకశక్తి మెరగ్గా ఉన్నవాళ్లకు ఈ సమస్యలు చాలా అరుదుగానే వస్తాయి. ఒకవేళ వచ్చినా, మూడు నాలుగు రోజుల్లో లేదా ఓ వారం రోజుల్లో తగ్గిపోతాయి. అయితే, పసిపిల్లలు, వృద్ధులు, లేదా గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, శ్వాసకోశ సంబంధ వ్యాధులు, ఆస్తమా, సీఓపీడి వంటి సమస్యలు ఉన్నవారిలో వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లడం వల్ల వారి శరీరం చాలా త్వరగా రోగగ్రస్థమవుతూ ఉంటుంది.

## వైరస్‌తో జతకలిసి....

శరీరంలోకి ప్రవేశించిన వైరస్ బ్యాక్టీరియాకు అవసరమైన అనుకూల పరిస్థితిని సిద్ధం చేస్తుంది. మిగతా వైరస్‌లతో పోలిస్తే, ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు కలిగించే జబ్బులు తీవ్రంగా ఉంటాయి. ఈ వైరస్‌లు శరీరంలోని వ్యాధి నిరోధక శక్తిని తగ్గించడం వల్ల పలురకాల బ్యాక్టీరియాలు శరీరంలో చేరి సైనసైటిస్, బ్రాంకైటిస్, ఫారింజైటిస్, టాన్సిలైటిస్, న్యూమోనియా వంటి వ్యాధులకు కారణమవుతాయి. ఈ రుతువులో అలర్జీ, ఆస్తమా వ్యాధులు కూడా ఎక్కువే. వైరస్ తాకిడితో అప్పటికే ఉన్న ఆస్తమా మరింత పెరుగవచ్చు.

## ఒళ్లంతా నొప్పులే!

చలికి శరీరంలోని కండరాలు బిగుసుకుపోతాయి. ఫలితంగా కీళ్ల మధ్యన ఉండే ఖాళీ తగ్గిపోతుంది. దాంతో కీళ్ల రాపిడికి గురై నొప్పులు మొదలవుతాయి. ఫలితంగా ఈ కాలంలో ఒంటి నొప్పులు వేధిస్తాయి.

## సీఓపీడి (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్)!

ఈ వాతావరణంలో సీఓపీడి తీవ్రమయ్యే అవకాశాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఈ సమస్య పొగతాగే వారిలోనే ఎక్కువ. లక్షణాలపరంగా చూస్తే ఇది కూడా ఆస్తమా లాగే ఉంటుంది. ఏమైనా ఇది కూడా ఈ రుతువులోనే ఎక్కువయ్యే అవకాశం ఉంది. మౌలికంగా ఇవన్నీ, శ్వాసకోశ వ్యవస్థ ప్రభావితం కావడం వల్ల తలెత్తే సమస్యలు.

## గుండె భద్రం!

చర్మంలో ఉండే సూక్ష్మరక్తనాళాలు మూసుకుపోయి, రక్తప్రసరణలో అంతరాయం ఏర్పడితే, గుండెకు కొంత ఇబ్బంది ఏర్పడవచ్చు. అలాగని చలికాలం గుండెకు సమస్య అని కచ్చితంగా చెప్పలేం! అంతకు ముందే ఏదైనా గుండె జబ్బు ఉండి, దానితో పాటే వారికి సి.పి.ఒ.డి, ఉబ్బసం కూడా ఉంటే, శ్వాసకోశ సంబంధమైన ఇన్‌ఫెక్షన్లకు కూడా గురైతే, సమస్య మొదలవుతుంది. గుండెకూ, శ్వాసకోశ వ్యవస్థకు సన్నిహిత సంబంధం ఉంటుంది కాబట్టి, శ్వాసకోశ సంబంధ సమస్యలు ఉన్న వారిలో గుండె పైన కూడా దుష్ప్రభావం పడి, గుండె జబ్బులు అధికమయ్యే అవకాశం ఉంది. కీళ్ల వాతం(రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్) సమస్య ఉంటే అది ఎక్కువయ్యే అవకాశం ఉంది. చలి కారణంగా కొందరు శ్రమకు దూరంగా, కదలకుండా కూర్చుని ఉండిపోవచ్చు. ఇలాంటి కొందరిలో రక్తం గడ్డలు కట్టే అవకాశం ఉంది.

## చర్మం చిరచిర!

చలికాలంలో చర్మం పొడిబారిపోయే అవకాశం ఉంది. ఫలితంగా చర్మం చిట్లి, దురద రావచ్చు. అంతకు ముందే చర్మ సంబంధమైన అలర్జీలు ఉన్నవారిలో చర్మ సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల మాయిశ్చరైజర్లు వాడటం ద్వారా ఈ సమస్యలు రాకుండా చూసుకోవచ్చు

## పిల్లలు, వృద్ధుల్లో...

వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉండే పిల్లలు వైరల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడే అవకాశాలు ఎక్కువ. అదే సమయంలో అలర్జీలు పెరిగే అవకాశాలు కూడా ఉంటాయి. అలాగే సైనసైటిస్, వీజర్స్, ఆస్తమా పెరిగే అవకాశాలు కూడా ఎక్కువే! వృద్ధులు ఈ కాలంలో వైరల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇతర సమస్యలు ఏవీ లేకపోయినా, ఇన్‌ఫెక్షన్ల బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. ఆస్తమా గానీ, సీఓపీడి సమస్యలు గానీ ఉంటే అవి తీవ్రమయ్యే అవకాశాలు వృద్ధుల్లో ఎక్కువగా ఉంటాయి.

## వ్యాధి నిరోధకశక్తి పెంచుకుంటే...

వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లడానికి కారణాలు వెతికి, వాటిని సరిదిద్దడం, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అలవరుచుకోవడం ద్వారా వ్యాధినిరోధకశక్తిని మెరుగ్గా ఉంచుకోవచ్చు. ఉదాహరణకు మధుమేహం, పోషకాహారలోపం కారణంగా వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లవచ్చు. దాంతో బ్యాక్టీరియా, వైరస్‌లు తేలికగా వ్యాధులను కలుగజేస్తాయి.

అలాగే దీర్ఘకాలం పాటు తీవ్రమైన వ్యాధులతో బాధపడేవారిలో కూడా ఇమ్యూనిటీ క్రమేపీ తగ్గుతుంది. కాబట్టి కారణం గ్రహించి, సరిచేసుకోవాలి.



**- డాక్టర్ టి.ఎల్.ఎన్ స్వామి**
కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్,
కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

## న్యుమోనియా!

శ్వాసకోశాల్లో వచ్చే ఇన్‌ఫెక్షనే న్యుమోనియా! ముక్కునుంచి సైనస్‌లు, గొంతు, శ్వాసకోశాల దాకా ఒక వ్యవస్థ! గాలి ద్వారా మనలోకి ప్రవేశించే వైరస్ ఆయా భాగాల్లో ఎక్కడో నిలిచిపోవచ్చు. ముక్కులో వైరస్ ఇన్‌ఫెక్షన్‌తో రైనైటిస్(ముక్కు నుంచి నీరు కారడం) తలెత్తుతుంది. శ్వాసనాళాల్లో నివాసం ఏర్పరుచుకుంటే, బ్రాంకైటిస్ (దగ్గు) తలెత్తుతుంది. ఇంకా దిగువకు శ్వాసకోశ కణజాలంలోకి వెళితే, న్యుమోనియా వస్తుంది. ఎక్కువగా ముక్కు నుంచి, ఒక్కో భాగాన్నే చేరుతూ, చివరకు శ్వాసకోశాలకు చేరవచ్చు. ఒక్కోసారి నేరుగా శ్వాసకోశాల్లోకే ప్రవేశించి, తిష్ట వేయవచ్చు.

## సొంత వైద్యం కొంత మానుకుని....

చలికాలం సమస్యలు వేర్వేరు రుగ్మతలను మరిపిస్తాయి. ఛాతీ పట్టేస్తే అసిడిటీ లేదా చలి వల్లే అనుకుని సర్దుకోకూడదు. ఆ లక్షణం గుండె సమస్యకు సూచన కావచ్చు. ఛాతీలో మంటను యాంటాసిడ్ మాత్రలతో తగ్గించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఒకవేళ అది గుండె సమస్య అయిన పక్షంలో, ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసిన వాళ్లం అవుతాం. అలాగే సాధారణ జలుబు న్యుమోనియా అయి ఉండవచ్చు. స్వైన్ ఫ్లూ లక్షణాలు కూడా సాధారణ జలుబు లక్షణాల మాదిరిగానే కనిపిస్తాయి. అందువల్ల ఏదైనా ఒక సమస్య మొదలై, అది రెండు మూడు రోజుల్లో లేదా వారం రోజుల్లో తగ్గకపోతే వైద్యులను తప్పక సంప్రతించాలి.



## ప్రకృతి వైద్యంగా...



**ఉబ్బసం:** ఉబ్బసానికి మూలం శరీరంలో వ్యాధినిరోధకశక్తి తగ్గడమే! ఆ శక్తి పెరగనంతవరకూ ఏ మందులూ, టీకాలూ వ్యాధిని తగ్గించలేవు. అయితే వెంటనే ఉపశమనం కలిగించే విధానాలు కొన్ని ప్రకృతి వైద్యచికిత్సలో ఉన్నాయి. అవేంటంటే...

- గోరువెచ్చని పాలలో, లేదా నీళ్లలో ఒక టేబుల్ స్పూన్ తేనె కలిపి, రోజుకు మూడు సార్లు తీసుకుంటే ఆస్తమానుంచి ఉపశమనం లభిస్తుంది.
- మూడు వెల్లుల్లి పాయలను, 30 మి.లీ పాలలో వేసి మరిగించి తాగినా ఉపశమనం లభిస్తుంది.
- గ్లాసు పాలల్లో ఒక టేబుల్ స్పూను పసుపు వేసి, మరిగించి తాగితే మంచి ఫలితం ఉంటుంది.

**న్యుమోనియా:** న్యుమోనియా అన్ని వయసుల వారికీ రావచ్చు.

- వెల్లుల్లి రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. ఛాతీపైన వెల్లుల్లి రసంతో మర్దన చేసినా ఉపయోగమే!
- సమస్య తొలిదశలో ఉన్నప్పుడు హెర్బల్ టీ వీరికి బాగా ఉపయోగపడుతుంది.

**మీజిల్స్:** జ్వరం, జలుబు, కళ్లల్లోంచి నీళ్లు కారడం వంటి లక్షణాలతో కూడిన ఈ వ్యాధికి....

- కమలాపండు రసం వీరికి మంచి ఔషధం! రోజూ మూడు సార్లు ఈ రసం ఇవ్వవచ్చు!
- నిమ్మరసం కలిపిన నీరు కూడా వీరికి ఉపశమనం ఇస్తుంది.
- పసుపు చెట్టు వేర్లను ఎండబెట్టి, పొడి చేసి, తేనెతో కలిపి తీసుకుంటే ఎంతో మేలు.

**దగ్గు:**

- నల్లద్రాక్ష రసం వీరికి మంచి ఔషధం! శ్వాసకోశాల్లో పేరుకుపోయిన కఫాన్ని ఇది తొలగిస్తుంది.
- పొడిదగ్గు ఉంటే, బాదం గింజల్ని రెండు గంటల పాటు నీళ్లల్లో నానపెట్టి తినేయవచ్చు.
- ఉల్లిగడ్డను దంచి, దాంట్లో నిమ్మరసం కలిపి, నీళ్లల్లో మరిగించి తీసుకుంటే త్వరితంగా ఉపశమనం లభిస్తుంది.
- పచ్చి ఉల్లిపాయలను నమిలి తినేసినా ప్రయోజనమే!

**ఇన్‌ఫ్లూయెంజా:**

- ఒక గ్రాము తులసి ఆకులను, సగం చెంచా అల్లం పేస్ట్ వేసి, డికాక్షన్ చేసుకుని తాగితే మంచి ఫలితం ఉంటుంది.
- వెల్లుల్లి, పసుపు మిశ్రమం చేసి రోజుకు మూడుసార్లు తేనెతో తీసుకుంటే ఎంతో మేలు.

**బ్రాంకైటిస్:**

- టీ స్పూను పసుపు పొడిని, గ్లాసు పాలలో వేసి మరిగించి తీసుకుంటే ఔషధంలా పనిచేస్తుంది.
- అల్లం, వెల్లుల్లి, మిరియాల పొడిని తేనెతో కలిపి తీసుకుంటే వెంటనే ఉపశమనం లభిస్తుంది.



**- డాక్టర్ టి. కృష్ణమూర్తి,** సూపరింటెండెంట్,
రెడ్‌క్రాస్ సొసైటీ,
యోగా అండ్ నేచర్ క్యూర్ సెంటర్, హైదరాబాద్

హార్మోనల్ హెల్త్



# సహజసిద్ధంగా పిల్లల్ని కనలేనా?

**డాక్టర్! మాకు పెళ్లై ఇప్పటికి ఐదేళ్లు. నా వయసు 27 సంవత్సరాలు. మూడు సార్లు గర్భం దాల్చినా, మూడో నెలలోనే అబార్షన్ అయిపోతోంది. మా వారి స్పెర్మ్ కౌంట్ బాగానే ఉన్నా, మార్ఫాలజీ తక్కువగా ఉందనీ, అందుకే గర్భస్రావాలు జరుగుతున్నాయనీ డాక్టర్లు అంటున్నారు. మార్ఫాలజీ సరిచేయడానికి చికిత్స లేదనీ, పిల్లల కోసం ఐ.వి.ఎఫ్‌ను ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదని అంటున్నారు. మా వారి సమస్యకు పరిష్కారం లేదా? - ఓ సోదరి,** నర్సీపట్నం.

వీర్యకణాల ఆకారం, నిర్మాణంలో తేడాలను మార్ఫాలజీ అంటారు. మార్ఫాలజీ తక్కువగా ఉంటే, గర్భం దాల్చినా మూడవ నెలలో గర్భస్రావం జరిగే అవకాశాలు ఎక్కువ. మూడో నెలలో కాకుండా మూడు నెలలు దాటిన తర్వాత నాల్గవ నెల నుంచి గర్భస్రావాలు జరుగుతూ ఉంటే, సమస్యకు మీ వారి వీర్యంతో సంబంధం ఉండదు. అయితే మీ వారి విషయంలో వీర్యకణాల సంఖ్య మెరుగ్గానే ఉంది కాబట్టి గర్భధారణకు ఎటువంటి ఆటంకం ఉండదు. మార్ఫాలజీ మెరుగుకు మందులు ఉన్నాయి. వరుస గర్భస్రావాలు జరుగుతున్నంత మాత్రాన ఐ.వి.ఎఫ్‌ను ఆశ్రయించవలసిన అవసరం లేదు. మార్ఫాలజీ తక్కువ ఉండడానికి మూల కారణాలను తెలుసుకుని, మందులతో మెరుగుపరుచుకుంటే, సహజసిద్ధంగా గర్భం దాల్చి, పిల్లలను కనవచ్చు. స్పెర్మ్ కౌంట్ మెరుగ్గా ఉండి, మార్ఫాలజీ తక్కువగా ఉన్న వారిలో 80% మందికి ఐ.వి.ఎఫ్ అవసరం పడదు. మార్ఫాలజీ మెరుగవడానికి కనీసం 3 నుంచి 4 నెలల సమయం పడుతుంది. కాబట్టి వైద్యులను కలిసి మీ వారికి చికిత్స ఇప్పించండి!



**- డాక్టర్ రాహుల్ రెడ్డి**
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్
8332850090 (కన్సల్టేషన్ కోసం)

హెల్తీ లైఫ్‌స్టైల్

# ఉపవాసంలో ఆరోగ్యం!



ఉపవాసం ఆరోగ్యకరం. అయితే ఆ సమయంలో ఛాతీలో మంట, మలబద్ధకం, తలనొప్పి లాంటి సమస్యలు తలెత్తవచ్చు. ఈ లక్షణాలు సహజం. వీటిని నివారించాలంటే...

- రోజు మొత్తంలో కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలి.
- పెప్టిక్ అల్సర్లు, డయాబెటిస్ ఉన్నవాళ్లు పళ్లు, కూరగాయ ముక్కలు తినాలి.
- గర్భవతులు, పాలిస్తున్న తల్లులు, గుండె జబ్బులున్నవాళ్లు ఉపవాసం చేయకపోవటమే మంచిది.
- శారీరక బలహీనత కలిగినవారు, మందుల మీద ఆధారపడిన మధుమేహులు, ఆహారానికి సంబంధించిన సమస్యలున్నవారు (ఈటింగ్ డిజార్డర్) ఉపవాసానికి ముందు వైద్యుల సలహా తీసుకోవాలి.

రెమెడీ



# పగుళ్లు మాయం!

చలికాలం మొదలైతే పాదాల పగుళ్లు మొదలవుతాయి. దాంతో పాదాలు అందవిహీనంగా కనిపించడంతో పాటు, చర్మానికి గీసుకుపోతూ చికాకు పెడతాయి. ఈ సమస్యలు తొలగాలంటే....

- బక్కెట్‌లో సగానికి గోరువెచ్చని నీళ్లు నింపి, రాతి ఉప్పు, నిమ్మరసం, గ్లిజరిన్, రోజ్‌వాటర్ కలపాలి.
- ఈ నీటిలో పాదాలు 15 నిమిషాల పాటు ముంచి ఉంచాలి.
- తర్వాత ప్యూమిస్ స్టోన్‌తో రుద్ది పాదాలు శుభ్రం చేసుకోవాలి.
- నిమ్మరసం, గ్లిజరిన్, రోజ్‌వాటర్ సమపాళ్లలో కలిపి, ఈ మిశ్రమాన్ని పాదాలకు పూసుకుని రాత్రంతా వదిలేయాలి.
- ఇలా కనీసం వారం రోజుల పాటు చేస్తే పాదాల పగుళ్లు పోయి, కోమలంగా మారతాయి.

లిటిల్స్

కిడ్‌సైంటిస్ట్



# నీళ్లు-పాలు

**కావలసినవి**

- రెండు గ్లాసులు (ఒక దానికంటే మరొకటి పెద్దదిగా ఉండాలి)
- సన్నటి వైరు
- కొన్ని నీళ్లు
- కొన్ని పాలు

గ్లాసులో ఉన్న పాలు నెమ్మదిగా అదృశ్యమవుతాయి. మీరు చెబితే మళ్లీ వస్తాయి. అదెలా సాధ్యమంటే...

ముందుగా చిన్న గ్లాసు అంచు చుట్టూ వైరు కట్టి రెండు కొసలను మెలిపెట్టి గ్లాసు కదలకుండా చేయండి. తరువాత పెద్ద గ్లాసులో నీళ్లు పోసి అందులో చిన్న గ్లాసు పెట్టండి. ఆ బరువుకి పెద్దగ్లాసులో ఉన్న పాలు రెండు గ్లాసుల గోడల మధ్యకు వస్తాయి. చిన్నగ్లాసుకున్న వైరుని పెద్దగ్లాసు పై నుంచి తీసి బొటనవేలికి తగిలించుకోవాలి. ఇప్పుడు చిన్న గ్లాసులో నీళ్లు పోస్తే ఆ బరువుకి చిన్న గ్లాసు లేవకుండా ఉంటుంది. రెండు గ్లాసులను ప్రేక్షకులకు చూపించండి. దూరం నుంచి చూసే ప్రేక్షకులకు గ్లాసులో పాలు కనిపిస్తాయి. ఇందాక బొటనవేలుకు తగిలించుకున్న వైరును నెమ్మదిగా లాగండి. అప్పుడు చిన్న గ్లాసు పైకి లేస్తుంది. దాంతో పాలు కింద, నీళ్లు పైన(పై గ్లాసులో) కనిపిస్తాయి. మీరు మళ్లీ వైరు వదిలితే మళ్లీ పాలే కనిపిస్తాయి. ఈ తమాషా ప్రేక్షకుల్లో కుతూహలం నింపుతుంది.

## దారి కనుక్కోండి?





## చుక్కలు కలిపి రంగులు వేయండి




## పదాలు సరిచేయండి



gbudyla ____________



diersp ____________

## డైలీ సుడోకు -226

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | | 4 | | 3 | 6 | 5 | 7 | |
| | | 5 | 2 | | | | | |
| 9 | 7 | | | 5 | | 6 | | 3 |
| 3 | | 7 | 6 | | 9 | | 8 | 4 |
| | | | | | | | | |
| 1 | 8 | | 3 | | 4 | 7 | | 9 |
| 5 | | 1 | | 8 | | | 2 | 6 |
| | | | | | 2 | 8 | | |
| | 2 | 8 | 1 | 6 | | 9 | | 7 |

**సుడోకు - 225 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 5 | 3 | 9 | 4 | 8 | 6 | 2 | 1 |
| 4 | 6 | 1 | 7 | 2 | 5 | 8 | 3 | 9 |
| 2 | 8 | 9 | 6 | 3 | 1 | 4 | 5 | 7 |
| 3 | 9 | 5 | 2 | 1 | 6 | 7 | 4 | 8 |
| 1 | 2 | 6 | 8 | 7 | 4 | 3 | 9 | 5 |
| 8 | 4 | 7 | 5 | 9 | 3 | 2 | 1 | 6 |
| 9 | 7 | 8 | 4 | 5 | 2 | 1 | 6 | 3 |
| 5 | 1 | 2 | 3 | 6 | 7 | 9 | 8 | 4 |
| 6 | 3 | 4 | 1 | 8 | 9 | 5 | 7 | 2 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.



మహేశ్‌బాబు, రష్మిక

# క్యూట్... స్వీట్!

"హీ ఈజ్ సో స్వీట్... హీ ఈజ్ సో క్యూట్... హ్యాండ్సమ్" అంటూ మహేశ్‌బాబు అందాన్ని వర్ణిస్తున్నారు రష్మిక. వీళ్లిద్దరూ జంటగా నటిస్తున్న 'సరిలేరు నీకెవ్వరు'. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు. ఈ చిత్రంలో శ్రీమణి సాహిత్యం అందించిన "హీ ఈజ్ సో క్యూట్" పాటను సోమవారం విడుదల చేశారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 11న విడుదల కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ జనవరి 5న హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో నిర్వహించనున్నారు.

# ఒరిజినల్‌గానే విలన్ అమ్మా!


నయనతార, రజనీకాంత్

"ఆ చూపేంటి? ఒరిజినల్‌గానే నేను విలన్ అమ్మా! అయామ్ ఎ బ్యాడ్ కాప్" అంటున్నారు రజనీకాంత్. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న 'దర్బార్'లో ఓ డైలాగ్ ఇది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముంబైలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు, తమిళ, హిందీ భాషల ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమాలో ముంబై పోలీస్ కమిషనర్ ఆదిత్యా అరుణాచలం పాత్రలో రజనీకాంత్ కనిపించనున్నారు. ట్రైలర్‌లో హీరోను స్టైలిష్ ఫైట్‌తో పరిచయం చేశారు దర్శకుడు. తర్వాత "వాడు పోలీస్ ఆఫీసరా సార్? హంతకుడు!" అనే డైలాగ్ వస్తుంది. ముంబైలో మాఫియా ఆట కట్టించే పోలీస్‌గా యాక్షన్ సన్నివేశాల్లో రజనీ అదరగొట్టారని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. హీరోయిన్‌గా నయనతార, విలన్‌గా సునీల్ శెట్టి నటించిన ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీత దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 9న సినిమా ప్రేక్షకుల ముందుకొస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో నిర్మాత ఎన్వీ ప్రసాద్ విడుదల చేస్తున్నారు.

# ఫస్ట్ టైమ్ సిక్స్‌ప్యాక్ చేశా

**- సాయితేజ్**

సాయితేజ్, రాశీ ఖన్నా జంటగా నటించిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. మారుతి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది, సత్యరాజ్, రావు రమేశ్, మురళీ శర్మ కీలక పాత్రధారులు. తమన్ స్వరకర్త. ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "మారుతికి ఆడియన్స్ పల్స్ బాగా తెలుసు. సందేశాన్ని ఆహ్లాదకరంగా చెప్పగలిగే ప్రతిభ గల దర్శకుడు. మంచి సినిమా తీశాడు. సత్యరాజ్, నరేశ్, రావు రమేష్ పాత్రలు అలరిస్తాయి" అని తెలిపారు. సాయితేజ్ మాట్లాడుతూ "ఫ్యాన్స్ అభిమానం ఉంటే మాకు ప్రతిరోజూ పండగే. మారుతి అదిరిపోయే స్క్రిప్ట్ రాశారు. సినిమా చూశాక అది మీకే అర్థమవుతుంది. ఫస్ట్ టైమ్ ఈ సినిమాలో సిక్స్ ప్యాక్ బాడీతో కనిపిస్తా. ఐదేళ్ల క్రితం అరవింద్‌గారి అసోసియేషన్‌తో 'పిల్లా నువ్వులేని జీవితం' వచ్చింది. మళ్ళీ ఇప్పుడు గీతా ఆర్ట్స్‌లో హీరోగా చేయడం ఆనందంగా ఉంది. అన్నివర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది." అని అన్నారు. "ఓ గుళ్లో వచ్చిన ఐడియాను దిల్ రాజుకి చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. ఇదే కథను యు.వి క్రియేషన్స్ వంశీకి, తేజ్‌కి చెప్పాను. వాళ్లు ఓకే అనడంతో సినిమా మొదలుపెట్టాం. తమన్ అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చారు. ఈ కథ కోసం, నాకోసం తేజ్ సిక్స్‌ప్యాక్ చేశాడు. చిరంజీవిగారికీ కథ బాగా నచ్చింది. ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు" అని మారుతి అన్నారు.


సత్యరాజ్, సాయి తేజ్, రాశీ ఖన్నా, అల్లు అరవింద్, మారుతి

# బాలకృష్ణది పెద్ద మనసు

**- వేదిక**

**"సినిమాలో బాలకృష్ణగారు రెండు పాత్రల్లో కనిపిస్తారా? మూడు పాత్రల్లోనా? లేదా ఆయన పాత్రలో రెండుమూడు కోణాలు ఉంటాయా? అనేది నేను చెప్పలేను. కానీ, బాలకృష్ణగారు ఎన్ని లుక్కుల్లో కనిపిస్తారో... అన్ని లుక్స్‌తో నాకు సన్నివేశాలు ఉన్నాయి" అని వేదిక అన్నారు. నందమూరి బాలకృష్ణ సరసన ఆమె ఓ కథానాయికగా నటించిన చిత్రం 'రూలర్'. సోనాల్ చౌహాన్ మరో నాయిక. కెఎస్ రవికుమార్ దర్శకుడు. సి. కల్యాణ్ నిర్మాత. ఈ శుక్రవారం సినిమా విడుదల కానుంది. వేదిక చెప్పిన సంగతులు...**



- తెలుగులో 'కాంచన 3' అనువాదమై, స్ట్రయిట్ చిత్రంలా మంచి విజయం సాధించింది. అందులో నా నటన 'రూలర్' దర్శక-నిర్మాతల్ని ఆకట్టుకుంది. దాంతో ఈ చిత్రంలో నాకు అవకాశం ఇచ్చారు. బాలకృష్ణ సూపర్‌స్టార్. రూలర్ ఆఫ్ ది ఇండస్ట్రీ. తెలుగు చిత్రసీమకు ఫేస్ అని చెప్పవచ్చు. ఎంతో అనుభవజ్ఞులు. ఆయన ఓ నటనా విశ్వవిద్యాలయం! అందువల్ల, బాలకృష్ణతో చిత్రమనగానే సంతోషంగా అంగీకరించా.
- నా పాత్రలో మూడు కోణాలు ఉంటాయి. సంప్రదాయబద్ధంగానూ, గ్లామరస్‌గానూ, మాసీగానూ ఉంటుంది. డామినేటింగ్ క్యారెక్టర్. నటనకు ఆస్కారమున్న పాత్ర. సప్తగిరితో కొన్ని వినోదాత్మక సన్నివేశాల్లో నవ్విస్తా. బాలకృష్ణగారు సూపర్ డ్యాన్సర్. ఆయనకంటూ ఓ స్టైల్ ఉంటుంది. రెండు పాటలు 'సంక్రాంతి', 'యాల యాల'లో ఆయనతో స్టెప్పులు వేశా.
- ప్రకాశ్‌రాజ్, జయసుధ, భూమిక, నాగినీడు, ఝాన్సీ... భారీ తారాగణంతో ఇటువంటి పెద్ద సినిమా చేయాలంటే మినిమమ్ ఏడాది పడుతుంది. మా నిర్మాత సి. కల్యాణ్, దర్శకుడు రవికుమార్ ప్లానింగ్ వల్ల మూడున్నర నెలల్లో చిత్రీకరణ పూర్తయింది. నటీనటులను సి. కల్యాణ్ తమ కుటుంబంలా చూసుకున్నారు.
- తమిళ, మలయాళ, కన్నడ చిత్రాలతో బిజీగా ఉండడంతో తెలుగులో విరామం వచ్చింది. మధ్యలో కొన్ని ఛాన్సులు వచ్చినా... చేయలేకపోయా. నాకు తెలుగు అర్థమవుతుంది. మాట్లాడతాను కూడా! అయితే... ప్రాక్టీస్ లేకపోవడంతో కొంచెం నెమ్మదిగా మాట్లాడతా. పది నిమిషాల ముందు నా డైలాగులు ఇస్తే ఈజీగా చెప్పేస్తా. తెలుగులో మాస్ మసాలా కమర్షియల్ చిత్రాలు చేయడం నాకిష్టమే.


బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి రూ.50 లక్షలు విరాళం ప్రకటించి ఆ చెక్కును బాలకృష్ణకు అందజేసిన నిర్మాత ప్రసాద్ దేవినేని.

# ఆ రెండూ కలిపితే వచ్చిన డిఫరెంట్ సినిమా

**- కార్తీ**

కార్తీ, నిఖిలా విమల్ జంటగా జీతు జోసెఫ్ దర్శకత్వం వహించిన 'దొంగ' సినిమా ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. రావూరి వి. శ్రీనివాస్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. కార్తీ మాట్లాడుతూ ""ఖైదీ తర్వాత 'దొంగ' ఏంటి? అని అందరూ అడుగుతున్నారు. రెండు టైటిళ్లు చిరంజీవిగారికి సూపర్‌హిట్స్ ఇచ్చినవే! కథ డిమాండ్ మేరకు ఈ కథకు 'దొంగ' టైటిల్ పెట్టాం. కథ విన్నప్పుడు చాలా థ్రిల్ ఫీలయ్యా. అక్కా, తమ్ముడు రిలేషన్‌షిప్ ఇంట్రెస్టింగ్‌గా, ఎమోషనల్‌గా ఉంటుంది. షావుకారు జానకి, సీత, సత్యరాజ్ పాత్రలు సినిమాకు కీలకం. సత్యరాజ్ గారు డబ్బింగ్ చెప్పేటపుడు ఇది 'దృశ్యం2'లా అనిపిస్తుంది అన్నారు. 'నా పేరు శివ', 'ఊపిరి' కలిపితే వచ్చిన డిఫరెంట్ సినిమాలాగా ఉంటుంది. నాకొక ఎమోషనల్ జర్నీ లాంటిది ఈ సినిమా" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "2014లో 'దృశ్యం' హిట్ అయినప్పుడే తెలుగులో సినిమా చేయాలనుకున్నా. ఇప్పుడు 'దొంగ' సినిమాతో మంచి అవకాశం వచ్చింది. నా హృదయానికి బాగా దగ్గరైన సినిమా ఇది. నా స్నేహితుడు కార్తీ సహకారం మరువలేనిది. యాక్షన్, ఎమోషన్స్‌తో కూడిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది" అని అన్నారు. "రెండు భాషల ప్రేక్షకుల్ని మెప్పించడం చాలా కష్టం. అది కొందరికే సాధ్యం అవుతుంది.. అందులో కార్తీ, సూర్య ఉండడం ఆనందంగా ఉంది. చిరంజీవిగారి 'దొంగ' ఎంత పెద్దహిట్ అయిందో అలా మా సినిమా కూడా హిట్ కావాలని ఆశిస్తున్నా" అని నిర్మాత చెప్పారు.


నిఖిలా విమల్, కార్తీ

# నా పెళ్లి 2022లో!

**- రాజ్ తరుణ్**

**"నేను చాలా రోజులుగా ప్రేమలో ఉన్నాను. నా పెళ్లి 2022లో ఉంటుంది" అని రాజ్ తరుణ్ అన్నారు. అతడు హీరోగా 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. జీఆర్ కృష్ణ దర్శకుడు. ఈ నెల 25న సినిమా విడుదల కానున్న సందర్భంగా రాజ్‌తరుణ్ చెప్పిన సంగతులు...**



- స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రమిది. టర్కీ చిత్రం 'లవ్ లైక్స్ కోఇన్సిడెన్సెస్' స్ఫూర్తితో మన నేటివిటీకి తగ్గట్టు మార్చి తీశాం. చివరి 30 నిమిషాలు అద్భుతంగా ఉంటుంది. నా పాత్ర సెటిల్డ్‌గా ఉంటుంది. ఫొటోగ్రాఫర్‌గా కనిపిస్తా.
- రెండు పాటలు మినహా 'ఒరేయ్ బుజ్జిగా' చిత్రీకరణ పూర్తయింది. ఇంకా 'డ్రీమ్ గాళ్' రీమేక్, అన్నపూర్ణ స్టూడియోస్‌లో శ్రీనివాస గవిరెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా అంగీకరించా. గీతా ఆర్ట్స్-2లో ఓ చిత్రానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయి.

# పేలనున్న 'తూటా'

ధనుష్, దర్శకుడు గౌతమ్ వాసుదేవ మీనన్ దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న 'ఎనై నోకి పాయుమ్ తోట' చిత్రాన్ని తెలుగులో 'తూటా' పేరుతో విడుదల చేస్తున్నారు. గొలుగూరి రామకృష్ణారెడ్డి సమర్పణలో జి.తాతారెడ్డి, జి.సత్యనారాయణరెడ్డి ఈ రొమాంటిక్ థ్రిల్లర్‌ను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, సాంగ్స్, ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. దీని వల్ల సినిమా మీద అంచనాలు పెరిగాయి. ధనుష్ సరసన మేఘా ఆకాశ్ నటించింది. ఈ నెల 27న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. అని తెలిపారు.


మేఘా ఆకాశ్, ధనుష్













| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,938.72 | 12,053.95 | 38,034 | 44,165 | 71.00 | 65.42 |
| ↓ 70.99 | ↓ 32.75 | ↑ 207 | ↑ 285 | ↓ 17 పైసలు | ↑ |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | | | |

# అతిపెద్ద కంపెనీ ఆర్‌ఐఎల్




## ఫార్చ్యూన్ ఇండియా 500 జాబితాలో అగ్రస్థానం

## 2018-19లో రాబడి రూ.5.81 లక్షల కోట్లు

## రెండో స్థానానికి చేరిన ఐఓసీ

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) దేశంలో అతిపెద్ద కంపెనీగా అవతరించింది. గత పదేళ్లుగా ఈ స్థానంలో ఉంటున్న ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రెండో స్థానానికి జారి పోయింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.5.81 లక్షల కోట్ల రాబడిని సాధించి ఫార్చ్యూన్ ఇండియా 500 కంపెనీల్లో ఆర్‌ఐఎల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ స్థానాన్ని సొంతం చేసుకున్న తొలి ప్రైవేటు కంపెనీగా కూడా ఆర్‌ఐఎల్ రికార్డుకెక్కింది. 2018-19లో ఆర్‌ఐఎల్ రాబడి 41.5 శాతం పెరిగింది. ఇది ఐఓసీ రాబడికన్నా 8.4 శాతం ఎక్కువ. ఇదే కాలంలో ఆర్‌ఐఎల్ లాభం ఐఓసీ లాభంకన్నా రెండింతలు పెరిగి రూ.39,588 కోట్లకు చేరుకుంది. ఆర్‌ఐఎల్ రాబడి వృద్ధిలో రిటైల్, టెలికాం కంపెనీలు బాగా దోహదపడినాయి. గత పదేళ్ల కాలంలో ఆర్‌ఐఎల్ లాభం సగటు ఐఓసీ లాభంకన్నా మూడు రెట్లు అధికంగా ఉంది. 2014-15 సంవత్సరంలో ఆర్‌ఐఎల్ లాభం రూ.23,566 కోట్లు ఉండగా.. ఐఓసీ లాభం రూ.4,912 కోట్లు ఉంది.

- ఈ ఏడాదికి ప్రకటించిన జాబితాలో ప్రభుత్వ రంగంలోని చమురు సహజ వాయువు సంస్థ (ఓఎన్‌జీసీ) 3వ స్థానంలో నిలిచింది. 2018లోనూ ఈ కంపెనీ ఇదే స్థానంలో ఉంది.
- ఈ జాబితా రూపకల్పనలో అనుబంధ కంపెనీలను లెక్కలోకి తీసుకోలేదు. కాబట్టి ఓఎన్‌జీసీ స్థానంలో మార్పు లేదు. ఈ కంపెనీ ఇటీవలే హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్), ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్‌లను కొనుగోలు చేసింది.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (4), టాటా మోటార్స్ (5), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (6)ల 2018, 2019 సంవత్సరాల స్థానాల్లో ఎలాంటి మార్పులు లేవు.
- రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ ఒక స్థానం ఎగబాకి ఏడో స్థానానికి చేరుకుంది.
- టాటా స్టీల్, కోల్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) కంపెనీలు వరుసగా 8వ, 9వ, 10వ, 11వ స్థానాల్లో నిలిచాయి.
- ఐసీఐసీఐ బ్యాంకు 12వ స్థానంలో నిలిచింది. హిందాల్కో ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు వరుసగా 13, 14వ స్థానాల్లో ఉన్నాయి.
- 2019 సంవత్సరానికి ఫార్చ్యూన్ ఇండియా 500 కంపెనీల మొత్తం రాబడి 9.53 శాతం, లాభం 11.8 శాతం పెరిగింది.

*ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఆయిల్ అండ్ గ్యాస్ రంగ (8 కంపెనీలు) కంపెనీ రాబడి వాటా 22.3 శాతంగా ఉంది. బ్యాంకింగ్ రంగం వాటా 15.88 శాతం. బ్యాంకింగ్ రంగంలో 48 కంపెనీ లున్నాయి. 500 కంపెనీల లాభాల్లో ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల వాటా 23.44 శాతంగా ఉంది.*

# వచ్చే ఏడాది 'ట్రూస్టార్' సేవలు

- యూకే బిజినెస్ గ్రూప్‌తో టర్బో ఏవియేషన్ ఒప్పందం
- ఐదేళ్లలో రూ.945 కోట్ల పెట్టుబడులు
- కమ్యూటర్ సేవలపై దృష్టి




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ నుంచి మరో విమానయాన కంపెనీ సేవలు ప్రారంభించనుంది. విమానాల నిర్వహణ, గ్రౌండ్ హ్యాండ్లింగ్, చార్టర్ సేవలు అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన టర్బో ఏవియేషన్ కంపెనీ 'ట్రూస్టార్' పేరుతో విమానయాన సేవలను ప్రారంభించనుంది. ఉడాన్ పథకం కింద లోకాస్ట్ కమ్యూటర్ విమానయాన సేవలను 'ట్రూస్టార్' పేరుతో ప్రారంభించనున్నట్లు టర్బో ఏవియేషన్ వ్యవస్థాపకుడు వి.ఉమేశ్ తెలిపారు. 2015లో 'ట్రూజెట్'ను ప్రారంభించడంలో ఉమేశ్ కీలక వ్యక్తి. 2020 మధ్య నాటికి 'ట్రూస్టార్' కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది. ట్రూస్టార్ విమానయాన సేవలను ప్రారంభించేందుకు యూకేకు చెందిన బిజినెస్ గ్రూప్ 10 కోట్ల పౌండ్ల (దాదాపు రూ.945 కోట్లు) నిధులను టర్బో ఏవియేషన్‌కు అందించనుంది. ఐదేళ్లలో ఈ పెట్టుబడులు పెట్టనుంది. టర్బో ఏవియేషన్‌లో వాటా తీసుకుంటుంది. ట్రూస్టార్ కార్యక్రమాలను ప్రారంభించే ప్రక్రియను వేగిరం చేస్తున్నామని, ఇప్పటికే యూకే గ్రూప్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు.

10 ఏటీఆర్‌లు, 10 ఎయిర్ బస్ 320, 4 డోర్నియర్ విమానాలను ట్రూస్టార్ ప్రవేశపెట్టే వీలుంది. ముందుగా 5 విమానాలతో సేవలను ప్రారంభించనున్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ అభివృద్ధి చేసిన లైట్ కమ్యూటర్ కమర్షియల్ విమానం- డోర్నియర్‌ను వాణిజ్యపరంగా ప్రవేశపెట్టిన ఘనత ట్రూస్టార్‌కు దక్కుతుంది. ఇప్పటికే ఉడాన్ పథకం కిందకు వచ్చిన మార్గాల్లో ట్రూస్టార్ సేవలందిస్తుంది. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ సేవలను ప్రారంభించాలని భావిస్తున్నట్లు ఉమేశ్ వివరించారు. ముందుగా లఖ్‌నవ్ నుంచి సేవలను ప్రారంభిస్తారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు, గోవా, నాగార్జునసాగర్, విజయవాడ, చెన్నై తదితర నగరాల మధ్య విమానాలు నడపనున్నారు. ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఏపీ, ఒడిశాల్లో ఉడాన్ పథకం కింద కమ్యూటింగ్ విమానయాన సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఉమేశ్ చెప్పారు ప్రారంభంలో 50 మంది వరకూ పైలెట్లు, కోపైలెట్లు అవసరమవుతారని.. మొత్తం 300 మంది వరకూ ఉద్యోగులను నియమించుకునే వీలుందన్నారు.

## మద్దతు 12000

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై 12100 వరకు వెళ్లినా నిలదొక్కుకోలేకపోయింది. రియాక్షన్‌తో చివరికి డే కనిష్ఠ స్థాయిలో 26 పాయింట్ల నష్టంతో క్లోజయింది. గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకోలేకపోవడం ద్వారా మరోసారి కన్సాలిడేషన్ ధోరణిని ప్రదర్శించింది. గత కొద్ది రోజుల్లో సైడ్‌వేస్ ధోరణిలో అనిశ్చితంగా కదలాడుతోంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. మరోసారి మైనర్ మద్దతు స్థాయి 12000 వద్ద పరీక్షకు గురి కానుంది. ఈ పరీక్షలో తప్పనిసరిగా బలాన్ని ప్రదర్శించి రికవరీ సాధించాలి. 20 డీఎంఏ వద్ద కూడా పరీక్ష ఎదుర్కొనబోతోంది.

**మంగళవారం స్థాయిలివే...**

**నిరోధం : 12150 మద్దతు : 12000**

- తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు సజీవంగా ఉండాలంటే 12000 కన్నా పైన కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అంతకన్నా దిగువన క్లోజయితే మైనర్ కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది.
- రికవరీ బాట పడితే ప్రధాన నిరోధం 12150 కన్నా పైన బలంగా క్లోజయినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించగలుగుతుంది.

■ వి.సుందర్ రాజా

## సాధారణ నిలకడ/నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

**తిథి :** మార్గశిర బహుళ షష్ఠి; నక్షత్రం : మఖ

**అప్రమత్తం :** రోహిణి, హస్త, శ్రవణ నక్షత్ర జాతకులు, కన్య, మకర రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 2.05**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 11 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.40 వరకు మెరుగ్గాను, తదుపరి 2.10 వరకు నిలకడగాను ట్రేడవుతూ తిరిగి చివరిలో నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ఎటిపి కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.15 తర్వాత తిరిగి ఎటిపి కన్నా దిగువకు వస్తే మరిన్ని షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపులో క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 12095, 12130**

**మద్దతు స్థాయిలు : 12010, 11975**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

# ఎంఎన్‌పీ కొత్త నిబంధనలు షురూ

## రెండు రోజుల్లో నెట్‌వర్క్ మార్చుకునే చాన్స్

*మొబైల్ నంబర్ పోర్టబులిటీ (ఎంఎన్‌పీ)పై ట్రాయ్ కొత్త నిబంధనలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఇక నుంచి మొబైల్ వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌కు మారాలంటే వారం రోజుల పాటు వేచి ఉండాల్సిన అవసరం లేదు, కేవలం రెండు రోజుల్లో మారవచ్చు. కొత్త నిబంధనలు ఇలా ఉన్నాయి...*



- ఎంఎన్‌పీకి ఏ వినియోగదారుడైనా 90 రోజుల పాటు ప్రస్తుత నెట్‌వర్క్ ఉపయోగించుకుంటూ ఉండాలి
- పోస్ట్ పెయిడ్ వినియోగదారులందరూ పాత ఆపరేటర్‌కి బిల్లు బకాయిలు ఉండకూడదు
- అదే నంబర్‌తో ఒక ఆపరేటర్ నుంచి మరో ఆపరేటర్‌కు మారవచ్చు కాని పేరు మార్చుకునే అవకాశం ఉండదు
- ఎంఎన్‌పీ అభ్యర్థించిన నంబర్‌ను ఏ చట్టం కింద నిషేధించి ఉండకూడదు, ఎలాంటి న్యాయపరమైన వివాదాలు పెండింగులో ఉండకూడదు
- ఈ నిబంధనలన్నీ సంతృప్తికరంగా ఉన్నట్టయితే పోర్ట్ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి మీరు పోర్టింగ్ కోరుతున్న నంబర్‌లోని 10 అంకెలు టైప్ చేసి 1900కి ఎస్ఎంఎస్ పంపాలి
- వినియోగదారునికి అర్హత ఉందని ధ్రువీకరించుకుంటే ఎస్ఎంఎస్ ద్వారా ట్రాయ్ యునిక్ పోర్టింగ్ కోడ్ (యూపీసీ) జారీ చేస్తుంది.
- ఇప్పటివరకు ఈ యూపీసీ 15 రోజులుండేది. ఇప్పుడు దీన్ని నాలుగు రోజులకు కుదించారు
- ఎంఎన్‌పీ ప్రక్రియ ప్రారంభించేందుకు ట్రాయ్‌కి సంబంధిత వినియోగదారులు అడ్రస్, ఐడీ ప్రూఫ్‌లు సమర్పించాలి
- అదే సర్కిల్‌లో అయితే మూడు రోజుల్లోను, ఇతర సర్కిల్‌కైతే ఐదు రోజుల్లోనూ ఎంఎన్‌పీని అమలు పరుస్తారు
- ఎంఎన్‌పీకి ట్రాయ్ రూ.6.46 ట్రాన్సాక్షన్ ఫీజుగా వసూలు చేస్తుంది
- ఎంఎన్‌పీ అభ్యర్థన ఉపసంహరించుకోవాలన్నా అందుకు 24 గంటల గడువు ఇచ్చారు.

## టీ-హబ్‌లో 'నెక్సస్' ప్రోగ్రామ్!



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన స్టార్టప్ ఇంక్యుబేటర్ నెక్సస్ తన కార్యకలాపాలను హైదరాబాద్, భారత్‌లోని ఇతర నగరాలకు కూడా విస్తరించాలని భావిస్తోంది. టీ-హబ్‌తో కలిసి ఇక్కడ తన ప్రోగ్రామ్‌ను అమలు చేయాలని యోచిస్తోంది. ఢిల్లీలో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న నెక్సస్ కార్యకలాపాలను విస్తరించే కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో రక్షణ రంగంలోని స్టార్టప్ కంపెనీల కోసం టీ-హబ్‌లో వర్క్‌షాప్‌ను నిర్వహించింది. రక్షణ రంగంలో వినూత్న ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి, రక్షణ ఉత్పత్తుల తయారీలో అమెరికా, భారత్ మధ్య సహకారాన్ని మరింత పెంపొందించడానికి స్టార్టప్‌లు దోహదం చేయగలవని నెక్సస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎరిక్ అజ్లు తెలిపారు. గత రెండున్నరేళ్లలో భారత్‌లో వివిధ రంగాల్లోని 90 స్టార్టప్ కంపెనీలకు నెక్సస్ శిక్షణ ఇచ్చింది. ఈ స్టార్టప్ కంపెనీలు ఏంజెల్ ఇన్వెస్టర్ల నుంచి 56 లక్షల డాలర్ల నిధులను సమీకరించాయి. మొదటి సారిగా హైదరాబాద్‌లో రక్షణ రంగంలోని స్టార్టప్‌ల కోసం వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని ఎరిక్ చెప్పారు. 20 స్టార్టప్‌లను ఎంపిక చేశామని, రక్షణ రంగంలో భారత్, అమెరికా కలిసి ఏర్పాటు చేయబోతున్న సదస్సులో పాల్గొనేందుకు వీటికి అవకాశం ఇవ్వనున్నామని ఎరిక్ తెలిపారు. హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్‌తో కలిసి ఈ వర్క్‌షాప్‌ను నెక్సస్ ఏర్పాటు చేసింది.

## 8 గంటలు.. 11 లక్షల లావాదేవీలు

- ఇక 24 గంటలూ నెఫ్ట్ సౌకర్యం

ముంబై : దేశంలో నిరంతరాయంగా నెఫ్ట్ సదుపాయం ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి అందుబాటులోకి వచ్చింది. బ్యాంకు ఖాతాదారులు ఇక పండగలు, పబ్బాలు, బ్యాంకు సెలవులతో పని లేకుండా అన్ని రోజులూ 24 గంటలూ నెఫ్ట్ ద్వారా నిధులు బదిలీ చేసుకోవచ్చు. అయితే రోజువారీ నెఫ్ట్ చెల్లింపుల బ్యాచ్ అర్ధరాత్రితో ముగుస్తుంది గనుక 11.30 నుంచి ఒక గంట సమయం మాత్రం లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం ఉండదు. తిరిగి 12.30కి కొత్త బ్యాచ్ ప్రారంభం కాగానే లావాదేవీలు చేసుకోవచ్చును. తెల్లవారితే సోమవారం అనగా అర్ధరాత్రి 12 గంటల నుంచి నిరంతరాయ నెఫ్ట్ సదుపాయం ప్రారంభమైన 8 గంటల వ్యవధిలోనే 11.40 లక్షల లావాదేవీలు సెటిల్ చేసినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. దీంతో భారత దేశ పౌరులకు నిరంతరాయంగా నెఫ్ట్ సదుపాయం అందుబాటులోకి ఉంచిన దేశాల జాబితాలో స్థానం సంపాదించింది. ఇప్పటివరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు మాత్రమే నెఫ్ట్ అందుబాటులో ఉండేది. అలాగే బ్యాంకు సెలవులున్నప్పుడల్లా నెఫ్ట్ లావాదేవీల నిర్వహణకు వీలుండేది కాదు.




### జనవరి 1 నుంచి ఫీజులుండవ్

దేశంలో ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా ప్రోత్సహించే లక్ష్యంతో జనవరి ఒకటో తేదీ నుంచి సేవింగ్స్ బ్యాంక్ ఖాతాదారులు నెఫ్ట్‌పై చేసే నిధుల బదిలీపై ఎలాంటి లావాదేవీల ఫీజు వసూలు చేయవద్దని ఆర్‌బీఐ బ్యాంకులను కోరింది. బ్యాంకులపై ఆర్‌బీఐ ఈ చార్జీలను జూలై నుంచే ఎత్తివేసింది. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి కస్టమర్లకు కూడా ఈ ప్రయోజనం వర్తింపచేయాలని బ్యాంకులను కోరింది.

# జియో టవర్లు బ్రూక్‌ఫీల్డ్ చేతికి

## డీల్ విలువ రూ.25,215 కోట్లు

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్)కు చెందిన రిలయన్స్ జియో టెలికాం టవర్ ఆస్తులు కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్ట్‌నర్స్ ఎల్‌పీ చేతికి వెళ్లనున్నాయి. ఈ మేరకు బ్రూక్‌ఫీల్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్ట్‌నర్స్, దాని భాగస్వాములతో రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ హోల్డింగ్స్ (ఆర్‌ఐఐహెచ్‌ఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ.25,215 కోట్లు. ఒప్పందం మేరకు బ్రూక్‌ఫీల్డ్ టవర్ కంపెనీలో 100 శాతం ఈక్విటీని కొనుగోలు చేస్తుంది. ఆర్‌ఐఐహెచ్‌ఎల్.. టవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ స్పాన్సర్‌గా ఉంది. ఇది బ్రూక్‌ఫీల్డ్‌కు అనుబంధంగా ఉన్న బీఐఏ జార్విస్ ఇండియాతో పాటు కొంతమంది సహా ఇన్వెస్టర్లకు యూనిట్లను జారీ చేస్తుంది. కాగా భారత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలో బ్రూక్‌ఫీల్డ్ పెట్టుబడి అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా చెబుతున్నారు. బ్రూక్‌ఫీల్డ్ పెట్టే పెట్టుబడులను రిలయన్స్ జియో ఇన్‌ఫ్రాటెల్ దీర్ఘకాలిక రుణాలతో పాటు ఆర్‌ఐఎల్ ఇచ్చిన రుణాలను తీర్చడానికి ఉపయోగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రిలయన్స్ జియో ఇన్‌ఫ్రాటెల్‌కు 1.30 లక్షల టవర్లున్నాయి. కాగా ఒప్పందం మేరకు 30 ఏళ్లపాటు ఈ టవర్లను జియో అద్దెకు తీసుకోనుంది.




### జియో-బీపీ పెట్రోల్ పంపులు

దేశీయంగా పెట్రోల్ పంపుల నెట్‌వర్క్‌ను భారీ స్థాయిలో విస్తరించే నిమిత్తం రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్‌కు చెందిన బీపీ పీఎల్‌సీలు భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు కొత్త జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తారు. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఇది ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఆర్‌ఐఎల్ 1,400 పెట్రోల్ పంపులను నిర్వహిస్తుండగా ఐదేళ్లలో వీటిని 5,500కు పెంచనున్నారు. జియో-బీపీ బ్రాండ్ కింద వీటిని నిర్వహించనున్నారు.

## విపణిలోకి డీఏఓ ఈవీటెక్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు

- మార్చి నాటికి తొలి వాహనం
- ఏపీలో రూ.700 కోట్లతో యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చైనాకు చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కంపెనీ డీఏఓ ఈవీటెక్ ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ముందుగా తెలంగాణలో అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి మొదటి వాహనాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు డీఏఓ ఈవీటెక్ చైర్మన్, సీఈఓ మైఖేల్ లూ తెలిపారు. ముందుగా తక్కువ వేగం ద్విచక్ర వాహనాన్ని ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల డాలర్ల (దాదాపు రూ.700 కోట్లు) వరకూ పెట్టుబడులు పెట్టి తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మొదటి దశలో 3 కోట్ల డాలర్లు ఖర్చు చేయనున్నట్లు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ), డైరెక్టర్ అచ్యుతుని బాలాజీ తెలిపారు. విద్యుత్ వాహనాలకు భారత్ పెద్ద మార్కెట్ కాగలదని భావిస్తున్నామని, మొదటి సారిగా భారత్‌లోనే ఇంటర్నెట్ కలిగిన వాహనాలను కంపెనీ ప్రవేశ పెడుతోందని డీఏఓ ఈవీటెక్ సీఓఓ లానా జు చెప్పారు. డీలర్ నెట్‌వర్క్ కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో చర్చలు జరుపుతున్నట్లు వివరించారు.



## హైదరాబాద్‌లో జేడీఏ ఎక్స్‌లెన్స్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ సేవలందిస్తున్న జేడీఏ సాఫ్ట్‌వేర్ హైదరాబాద్‌లో కొత్త కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) కేంద్రంలో 1,300 నిపుణులు పని చేయవచ్చని వెల్లడించింది. కంపెనీకి బెంగళూరులో కూడా ఎక్స్‌లెన్స్ కేంద్రం ఉంది. 2005లో 200 మంది నిపుణులతో హైదరాబాద్‌లో జేడీఏ సాఫ్ట్‌వేర్ కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరుల్లో కలిపి 2,500 మంది పనిచేస్తున్నారని జేడీఏ సాఫ్ట్‌వేర్ (సీఓఈ భారత్) మేనేజింగ్ డైరెక్టర్ ఉమేశ్ కౌర్ తెలిపారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 16వ తేదీకి.. | | విజయవాడ | 452 |
| హైదరాబాద్ | 433 | విశాఖపట్నం | 470 |
| 17వ తేదీకి.. | | వరంగల్ | 436 |
| చిత్తూరు | 458 | డజను గుడ్లు రూ. 66 | |
| గోదావరి | 452 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 87 | విజయవాడ | 94 |
| వరంగల్ | 89 | గుంటూరు | 94 |
| మహబూబ్‌నగర్ | 87 | ఒంగోలు | 96 |
| కరీంనగర్ | 87 | చిత్తూరు | 83 |
| కర్నూలు | 87 | నెల్లూరు | 83 |
| విశాఖపట్నం | 97 | అనంతపురం | 82 |
| గోదావరి | 92 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,060 | 38,800 | --- | 38,800 | 38,030 |
| క్రితం ముగింపు | 37,740 | 38,850 | 38,900 | 38,800 | 38,030 |
| 22 క్యారెట్లు | 36,250 | 35,900 | --- | 35,960 | 36,220 |
| క్రితం ముగింపు | 35,920 | 36,000 | 35,700 | 36,070 | 36,220 |
| వెండి (కిలో) | 44,300 | 45,400 | --- | 45,400 | 47,500 |
| క్రితం ముగింపు | 44,100 | 45,200 | 45,000 | 45,100 | 47,300 |

# నమ్మకం కాపాడటమే మా లక్ష్యం

- మార్కెట్‌పై సెబీ చైర్మన్ అజయ్ త్యాగి



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ మార్కెట్‌పై మదుపరుల నమ్మకం కాపాడటమే తమ లక్ష్యమని సెబీ ప్రకటించింది. ఇందుకోసం ఎప్పటికపుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సెబీ చైర్మన్ అజయ్ త్యాగి తెలిపారు. 'మా పరిధిలో ఉన్నంత వరకు, మార్కెట్ మెరుగుదల కోసం ఏ చర్యలు అవసరమైతే ఆ చర్యలు వెంటనే తీసుకుంటున్నాం' అన్నారు. ఇటీవలి కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ కంపెనీ ఉదంతాన్ని త్యాగి గుర్తు చేశారు. 'మాకు కార్వీపై చర్యలు తీసుకునే అధికారం ఉంది. దాంతో వెంటనే చర్య తీసుకున్నాం' అన్నారు. దేశంలో బాండ్ మార్కెట్ అభివృద్ధి కోసం రేటింగ్ ఏజెన్సీల పనితీరు మెరుగుపరిచేందుకూ సెబీ కృషి చేస్తున్నట్టు తెలిపారు.

### మదుపరుల నమ్మకానికి దెబ్బే

డీహెచ్‌ఎఫ్‌ఎల్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్, కార్వీ స్టాక్ బ్రోకింగ్ ఉదంతాలు తప్పకుండా మార్కెట్‌పై మదుపరుల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని త్యాగి చెప్పారు. అలా అని మార్కెట్లో ఉన్న అన్ని కంపెనీలు చెడ్డవి కావన్నారు. 'ఈ సంఘటనలు తప్పకుండా మదుపరుల నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. అలా అని ప్రతి కంపెనీ చెడ్డది కాదు' అన్నారు. తప్పు చేసిన కంపెనీలపై సెబీ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. కాగా, షేర్ల తనఖా విషయంలో ప్రమోటర్లు ఇటీవల చాలా జాగ్రత్త పడుతున్నట్టు చెప్పారు. ఈ తనఖా వల్ల కంపెనీలపై ఎక్కడ తమ పట్టు పోతుందోననే భయం ప్రస్తుతం ప్రమోటర్లను వేధిస్తోందన్నారు. ప్రమోటర్ల షేర్ల తనఖాపై ఆంక్షలు లేదా నిషేధం విధించడం సరికాదని కూడా త్యాగి చెప్పారు.

# ఫిబ్రవరిలోనే మందగమన సంకేతాలు

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబై : ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని ఆర్‌బీఐ ముందే గమనించింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నాటికే తాము ఈ సంకేతాలు గమనించినట్టు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. ఈ విషయాన్ని గ్రహించి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదు సార్లు కీలకమైన రెపో వడ్డీ రేట్లు తగ్గించినట్టు, ప్రకటించారు. ఈ నెల 5న జరిగిన ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటు మరింత తగ్గించక పోవడాన్ని మార్కెట్ వర్గాలు ఎందుకు ఆశ్చర్యంగా తీసుకున్నాయో తనకు అర్థం కావడం లేదన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం తమ లక్ష్యానికి అనుగుణంగా అదుపులో ఉన్నంత వరకు మాత్రమే, రెపో రేటు తగ్గిస్తామని ఆరు నెలల క్రితమే ఆర్‌బీఐ ప్రకటించిన విషయాన్ని దాస్ గుర్తు చేశారు.

### అవసరమైనదంతా చేస్తాం

వృద్ధి రేటును మళ్లీ గాడిలో పెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు ఆర్‌బీఐ తీసుకుంటుందని గవర్నర్ చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంతో పాటు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం తమ కర్తవ్యమన్నారు. ఆర్‌బీఐ తీసుకున్న చర్యలతో ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో నిధుల సరఫరా (లిక్విడిటీ) గణనీయంగా పెరిగిన విషయాన్ని దాస్ గుర్తు చేశారు. ప్రస్తుతం రివర్స్ రెపో ద్వారా రోజూ రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల నిధులు ఆర్‌బీఐకి చేరుతున్నట్టు తెలిపారు. వృద్ధి రేటును పెంచేందుకు మౌలిక రంగంలో కేంద్ర-రాష్ట్ర పెట్టుబడులు కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులు బాగానే ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అభివృద్ధి కోసం పెద్దగా ఖర్చు చేయడం లేదన్నారు.

**వెరిడాక్ గ్లోబల్:** ఆస్తి పన్నును అంచనా వేసి ధ్రువీకరణ జారీ చేసే సొల్యూషన్‌ను అభివృద్ధి చేసింది. థాణే మున్సిపల్ కార్పొరేషన్ (టీఎంసీ) ప్రయోగాత్మకంగా ఈ సొల్యూషన్‌ను వినియోగించి ఆస్తి పన్ను ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది. దేశంలో తొలిసారిగా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఆధారంగా ఆస్తి పన్ను ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు వెరిడాక్ సీటీఓ వెంకట్ రెడ్డి తెలిపారు.

**ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీ:** బ్యాంక్ ఆఫ్ అమెరికా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.356.5 కోట్లు) రుణం ఇవ్వడానికి అంగీకరించింది. డిస్ట్రిబ్యూటెడ్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్న కంపెనీ అవసరమైనప్పుడు ఈ రుణాన్ని వాడుకోవచ్చు. ఇప్పటి వరకూ 150 కంపెనీలు, ప్రభుత్వాలకు 23 రాష్ట్రాల్లో 200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డిస్ట్రిబ్యూటెడ్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఫోర్త్ పార్ట్‌నర్ ఏర్పాటు చేసింది.

**ఆర్వీ హెల్త్‌కేర్ సొల్యూషన్స్:** వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రారంభించింది. కంపెనీ అందించే స్మార్ట్ మెడికల్ అలర్ట్ సిస్టమ్ ద్వారా అత్యవసర, నాన్ ఎమర్జెన్సీ ఆరోగ్య సంరక్షణ సేవలను ఇంటి వద్దే అందించనున్నట్లు ఆర్వీ సహ వ్యవస్థాపకుడు సుశాంత్ రెడ్డి తెలిపారు. ఇంట్లో కీలకమైన ప్రదేశాల్లో 'పుష్ బటన్లు' ఉంచుతారు. అవసరమైనప్పుడు ఆ బటన్ నొక్కితే వైద్య సాయం అందుతుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో 10 పట్టణాల్లో ఈ సేవలను కంపెనీ ప్రారంభించింది. 2020, డిసెంబరు చివరి నాటికి దక్షిణాదిలోని ప్రధాన పట్టణాలన్నింటికీ సేవలను విస్తరించాలని భావిస్తోంది.

**ఐఈఈఈ సదస్సు:** అధిక సామర్థ్యం కలిగిన కంప్యూటింగ్, డేటా, అనలిటిక్స్ (హెచ్ఐపీసీ)పై హైదరాబాద్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ) సదస్సు నిర్వహించనుంది. మంగళవారం నుంచి 20వ తేదీ వరకూ హెచ్ఐసీసీలో ఈ సదస్సు జరగనుంది. ఈ-కామర్స్, రిటైల్, హెల్త్ కేర్, ఇంజనీరింగ్, వ్యవసాయం తదితర రంగాల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగంపై ఇందులో సమావేశాలు నిర్వహించనున్నారు.

- హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)







1 పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా అలీగఢ్ ముస్లిం వర్సిటీ విద్యార్థుల ఆందోళన

2 లాఠీచార్జికి వ్యతిరేకంగా ఢిల్లీ పోలీసు కమిషనరేట్ ఎదుట జేఎంఐ విద్యార్థుల అర్ధనగ్న ప్రదర్శన

3 ఇంటిబాట పడుతున్న జేఎంఐ విద్యార్థినులు..

4 పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీలో విద్యార్థుల ధర్నా




# విద్యార్థి పిడికిలి

## దేశవ్యాప్తంగా యూనివర్సిటీల్లో నిరసనల హోరు.. ఢిల్లీ పోలీసుల ఉక్కుపాదంపై ఆగ్రహావేశాలు

▸▸ **ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌ల సంఘీభావం**

న్యూఢిల్లీ, డిసెంబరు 16: ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకూ.. ఉత్తరప్రదేశ్ నుంచి కేరళ వరకూ దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ఆందోళనలతో హోరెత్తాయి! పౌరసత్వ సవరణ చట్టం, ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు ఉక్కుపాదం మోపడంపై వేలాదిమంది విద్యార్థులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. వర్సిటీ ప్రాంగణాల్లో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినదించారు. జామియా లైబ్రరీలో బాష్పవాయు గోళాలు ప్రయోగించడం; అనుమతి లేకుండా పోలీసులు క్యాంపస్‌లోకి రావడంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మద్దతుగా రాజకీయ నాయకులూ ఆందోళనల్లో పాల్గొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ ఆందోళనకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ నేతృత్వం వహించారు. ఇండియా గేట్ ఎదురుగా ధర్నా చేపట్టారు. వందలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ, గులాం నబీ ఆజాద్ తదితర పార్టీ అగ్రనేతలు పాల్గొన్నారు. జామియా విద్యార్థులకు సంఘీభావంగా కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందుకు ప్రతిగా.. పౌరసత్వ చట్టాన్ని సమర్థిస్తూ బీజేపీ నేతలు కూడా ర్యాలీ నిర్వహించారు. ఇక, కేరళలో ఆగర్భ శత్రువులు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ చేతులు కలిపాయి. కలిసికట్టుగా ఆందోళన చేపట్టాయి. రైల్వే ట్రాకులను దిగ్బంధించి రైళ్లను నిలిపివేశాయి. దాంతో, హింసకు పాల్పడవద్దని ఆందోళనకారులకు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. అలాగే, మణిపూర్‌లో గవర్నర్ నజ్మా హెప్తుల్లా ఎదుట యువజన కాంగ్రెస్ నేతలు నల్ల జెండాలు ప్రదర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో ఆందోళనల నేపథ్యంలో ఒడిసా మీదుగా ప్రయాణించే 17 రైళ్లను సోమవారం రద్దు చేశారు. వాటిలో ఫలక్‌నుమా, కోరమాండల్, యశ్వంత్‌పూర్ తదితరాలు ఉన్నాయి. బీజేపీ పాలిత కర్ణాటకలో అన్ని నగరాల్లోనూ పెద్దఎత్తున ఆందోళనలు, ధర్నాలు జరిగాయి.

### ఐఐటీల్లోనూ ఆందోళనలు

సాధారణంగా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లోని విద్యార్థులు ఆందోళనలకు దూరంగా ఉంటారు. కానీ, జామియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు ఉక్కుపాదం మోపడంపై ఐఐటీ మద్రాస్, ఐఐటీ బోంబే, ఐఐటీ కాన్పూర్ విద్యార్థులు కూడా సోమవారం నిరసన వ్యక్తం చేశారు. "జాదవ్‌పూర్ వర్సిటీలో విద్యార్థుల ఆందోళనను అణచి వేశారు. మేం స్పందించలేదు. ఎంటెక్ ఫీజులు పెంచారు. మేం స్పందించలేదు. జేఎన్‌యూలో విద్యార్థులను కొట్టారు. మేం స్పందించలేదు. ఇప్పుడు జామియా, అలీగఢ్ వర్సిటీ వంతు. ఇప్పుడు కూడా మేం స్పందించకపోతే విద్యార్థుల ఐక్యతే ప్రమాదంలో పడుతుంది. అందుకే, జామియా, అలీగఢ్ విద్యార్థులకు సంఘీభావం ప్రకటిద్దాం" అంటూ కాన్పూర్ ఐఐటీ వద్ద పోస్టర్ ఏర్పాటు చేశారు. అంతేనా, బెంగళూరులోని ఐఐఎం; ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్; ఐఐఎం అహ్మదాబాద్; వారాణసీలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ వర్సిటీ, ముంబైలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొన్నారు. పోలీసుల 'గూండాయిజం'పై దేశవ్యాప్తంగా వర్సిటీల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ సోమవారం కూడా రణరంగాన్ని తలపించింది. వందలాదిమంది విద్యార్థులు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో 21 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. కాగా, యూపీలోని మావ్‌లో ఆందోళనకారులు 15 వాహనాలకు నిప్పు పెట్టారు.

### అన్ని అర్హతలుంటేనే..: కేంద్రం

అన్నీ పరిశీలించిన తరువాత అర్హతలున్న వారికే పౌరసత్వం ఇస్తామని, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చే ప్రతి ఒక్క శరణార్థికి పౌరసత్వం లభించదని కేంద్ర హోం శాఖ వర్గాలు స్పష్టం చేశాయి. సీఏఏ నిరసనల నేపథ్యంలో ఈ మేరకు వివరణ ఇచ్చింది. 'శరణార్థులు తొలుత సంబంధిత అధికారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అర్హతల పరిశీలన తర్వాత పౌరసత్వం ఇవ్వాలా, వద్దా అనే నిర్ణయం తీసుకుంటారు' అని ఓ అధికారి వివరించారు.

### హింస ఆగితేనే విచారణ

**సుప్రీం సీజే స్పష్టీకరణ**

**జామియా విధ్వంసంపై నేడు విచారణ**

**రేపు పౌరసత్వ సవరణ చట్టంపై..!**

న్యూఢిల్లీ, డిసెంబరు 16: సీఏఏ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ, త్రిపుర రాజకుటుంబం దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు బుధవారం పరిశీలించనుంది. ఈ రెండు, కొద్ది రోజులుగా దాఖలైన అనేక పిటిషన్లను బుధవారం బెంచ్ మీదకు రానున్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే తెలిపారు. అలీగఢ్, జామియా యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసు హింసను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. హింస, విధ్వంసం తక్షణమే ఆగిపోవాలని, అప్పుడే విద్యార్థుల అభ్యర్థనను పరిశీలిస్తామని సీజే జస్టిస్ బాబ్డే స్పష్టం చేశారు. ఢిల్లీ హైకోర్టులోనూ ఇదే అంశంపై పిటిషన్ దాఖలైంది.

### ఈశాన్య రాష్ట్రాలకు రైళ్లు బంద్

▸▸ **తేరుకుంటున్న అసోం, మేఘాలయ**

కోల్‌కతా/గువాహటి, డిసెంబరు 6: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనల కారణంగా పశ్చిమబెంగాల్ నుంచి ఈశాన్య రాష్ట్రాలకు రైళ్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. గువాహటిలో ర్యాలీ తీస్తున్న ఆసు నేతలు సహా వందమందిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా మేఘాలయ, అసోంలలో పరిస్థితి క్రమేపీ కుదుటపడుతోంది. షిల్లాంగ్‌లో కొన్ని ప్రాంతాల్లో 13 గంటల పాటు కర్ఫ్యూను సడలించారు. గువాహటిలో మంగళవారం కర్ఫ్యూను ఎత్తివేస్తామని అసోం ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు సోమవారం గువాహటి నుంచి ఏడు విమానాల సర్వీసులను రద్దు చేశారు.

### ఆజ్యం పోసే వారిని అరికట్టండి

▸▸ **రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచన**

న్యూఢిల్లీ, డిసెంబరు 16: పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అప్రమత్తం చేసింది. హింస తలెత్తకుండా చూడాలని.. ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించింది. అల్లర్లకు కారణమయ్యేలా సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, తప్పుడు వార్తల వ్యాప్తిని నిరోధించడంపై దృష్టి పెట్టాలని కోరింది. మరోవైపు విశ్వవిద్యాలయ విద్యార్థులు సోదర భావంతో మెలుగుతూ హింసకు దూరంగా ఉండాలని, క్యాంపస్‌లలో ప్రశాంత వాతావరణానికి కృషి చేయాలని కేంద్ర మానవ వనరుల మంత్రి రమేశ్ పోఖ్రియాల్ అభ్యర్థించారు.

## హింసపై కలతచెందా!

▸▸ **ఇది శాంతిని పాటించాల్సిన సమయం: మోదీ**



న్యూఢిల్లీ, డిసెంబరు 16: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న హింసాత్మక నిరసన ప్రదర్శనలు దురదృష్టకరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వాటితో తీవ్రంగా కలత చెందానని చెప్పారు. "ఇది శాంతి పాటించాల్సిన సమయం. వదంతుల ప్రచారానికి దూరంగా ఉండండి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వార్థపర శక్తులకు సమాజాన్ని ముక్కలు చేసే అవకాశాన్ని ఇవ్వరాదన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వరుస ట్వీట్లు చేశారు. తాజా పౌరసత్వ సవరణ చట్టం దేశంలోని ఏ మతానికి వ్యతిరేకం కాదని.. దానివల్ల ఏ పౌరుడికీ ప్రస్తుత హోదాలో ఎలాంటి మార్పూ ఉండదని చెప్పారు. సంవాదం, చర్చ, అభ్యంతరం చెప్పడమన్నది ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని చెప్పారు. ప్రజల ఆస్తులను విధ్వంసం చేయడం, సాధారణ ప్రజా జీవనానికి ఆటంకం కలిగించడం మన సంస్కృతిలో లేవన్నారు. తల దాచుకోవడానికి భారతదేశం తప్ప వేరే మార్గం లేని విదేశీయుల కోసం ఈ చట్టం తెచ్చామని చెప్పారు. పార్లమెంటు ఉభయ సభల్లో భారీ మెజారిటీతో బిల్లు నెగ్గిందని గుర్తు చేశారు. కాగా, ఈ చట్టం వల్ల ఏ భారతీయుడి పౌరసత్వమూ రద్దు కాదని హోంమంత్రి అమిత్‌షా అన్నారు. దీన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని, వదంతులు వ్యాపింపజేసే రాజకీయ పార్టీల ఉచ్చులో పడరాదని విద్యార్థులను కోరారు. అక్రమంగా భారత్‌కు వలస వచ్చిన ముస్లిమేతరులకు ఆటోమేటిక్‌గా భారతీయ పౌరసత్వం వస్తుందనుకోవడం అపోహేనని, వారు కూడా నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జిహాదీలు, మావోయిస్టులు, వేర్పాటువాదులు విద్యార్థి సంఘాల కార్యకలాపాల్లో చొరబడుతున్నారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిపట్ల దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విశ్వవిద్యాలయాల్లోకి చొరబడ్డ సంఘ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ కొమ్ము కాయడం దారితప్పిన వ్యవహారమేనన్నారు. విద్యార్థుల హింసను రాజకీయ పార్టీలే రెచ్చగొడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. పోలీసులే హింసను రెచ్చగొట్టినట్లు తనకు ఆధారాలేమీ లభించలేదన్నారు. విదేశీ శక్తులు విద్యార్థులను ప్రభావితం చేస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

## సామాన్యులకు మెరుగైన న్యాయసేవలు

▸▸ **వచ్చే ఏడాది 5 జాతీయ లోక్ అదాలత్‌లు: జస్టిస్ రమణ**



న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు న్యాయసహాయం అందించడంపై సుప్రీం కోర్టు సీనియర్ జడ్జి, జాతీయ న్యాయసేవల అథారిటీ(నల్సా) కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం సమీక్షించారు. అన్ని రాష్ట్రాల్లోని న్యాయసేవల అథారిటీల కార్యనిర్వాహక చైర్మన్లు, సభ్య కార్యదర్శులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. సమర్థవంతమైన న్యాయసేవలందించడంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిన జస్టిస్ రమణ 2020లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అభియోగాలు ఎదుర్కొంటున్న ముద్దాయిలకు డిఫెన్సు న్యాయ సేవలందించేందుకు పైలట్ పథకంలో భాగంగా 17 జిల్లాలను ఎంపిక చేశారు. అవసరమైనవారికి కోర్టుల్లో సమర్థవంతమైన న్యాయసహాయం అందించాలని, ప్యానల్ న్యాయవాదులకు సరైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వచ్చే ఏడాదిలో ఐదు జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## భయ భారతమే!

▸▸ **'నిర్భయ'కు జరగని న్యాయం.. ఆ ఘటనకు ఏడేళ్లు**

న్యూఢిల్లీ, డిసెంబరు 16: నిర్భయ! భారతదేశంలో మనసున్న ప్రతి మనిషినీ కదిలించిన ఘటన! ఇప్పటికి ఏడేళ్లయింది! ఆ ఘోరాన్ని ఇంకా ఎవరూ మరిచిపోలేదు! ఆ దోషులకు ఇంకా శిక్షలు అమలు కాలేదు! ఆ తల్లిదండ్రులకు న్యాయం జరగలేదు. ఆమె పేరిట ఒక చట్టం రూపుదిద్దుకుంది. కానీ, దేశంలో హత్యాచారాలు ఆగలేదు! ఘోరాలకు అడ్డుకట్ట పడలేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే... పరిస్థితులు ఏవీ మారలేదు! ఇది... మహిళలకు ఇంకా భయ భారతమే! నిర్భయను బలితీసుకున్న ఆరుగురు దోషుల్లో ఒకడు మైనర్! మూడేళ్లు బాలల పరిశీలన గృహంలో గడిపిన అతడిని స్వేచ్ఛగా వదిలేశారు. ఒక నిందితుడు జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. మిగిలిన నలుగురు ఇంకా జైలులో ఉన్నారు. 2012 డిసెంబరు 16వతేదీ రాత్రి పొద్దుపోయాక... నిర్భయ, ఆమె స్నేహితుడు ప్రైవేటు బస్సు ఎక్కారు. బస్సును ఢిల్లీ నగర వీధుల్లో తిప్పుతూనే ఆమెపై ఆరుగురు అత్యాచారం చేశారు. ఆమె స్నేహితుడిని తీవ్రంగా కొట్టారు. అర్ధరాత్రి తర్వాత... వణికించే చలిలో నడిరోడ్డుపైకి వారిని విసిరేశారు. దుండగులు వారిద్దరినీ బస్సు ఎక్కించుకుంది ఢిల్లీలోని మునిర్కా బస్‌స్టాప్‌లో! ఘోరమేమిటంటే... ఈ ప్రాంతం ఇప్పటికీ మహిళలను భయపెడుతూనే ఉంది. రాత్రి పొద్దుపోయిందంటే చాలు... ఇక్కడికి పోకిరీలు చేరతారు. వెకిలి వ్యాఖ్యలు, చేష్టలతో ఆ దారిన వెళ్లే మహిళలను వేధిస్తుంటారు. అక్కడ సీసీ కెమెరాలు పెట్టలేదు. పోలీసు భద్రతా లేదు. ఏడేళ్ల తర్వాత కూడా అదే 'చీకటి' కోణం కనిపిస్తోంది. నిర్భయ ఘటన జరిగిన ఏడేళ్లయిన సందర్భంగా ఢిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు స్వాతి మలీవాల్ దేశ ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. దేశంలో పరిస్థితులు ఏమాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచార దోషులకు ఉరిశిక్ష విధించాలనే డిమాండ్‌తో ఆమె 13 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు.



ఇండియా గేటు వద్ద ప్రియాంక గాంధీ నిరసన

## ప్రజలపై సర్కారు యుద్ధం

▸▸ **సర్కారే హింసను సృష్టిస్తోంది: సోనియా**

న్యూఢిల్లీ, డిసెంబరు 16: పౌరసత్వ సవరణ చట్టంపై విపక్షాలు మరోమారు భగ్గుమన్నాయి. మోదీ ప్రభుత్వం సొంత ప్రజలపైనే యుద్ధం ప్రకటించిందని, హింసను, విభజనవాదాన్ని సృష్టిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆరోపించారు. ఫాసిస్టు శక్తులు సీఏఏ, ఎన్‌ఆర్‌సీలను ఓట్లు రాబట్టుకునే అస్త్రాలుగా దేశంపై ప్రయోగిస్తున్నాయని ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ అన్నారు. కాగా దేశంలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని, మోదీ సర్కారుపై కాంగ్రెస్ కార్యకర్తలంతా పోరాడాలని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా పిలుపునిచ్చారు. సీఏఏను బెంగాల్‌లో అమలు చేయబోమని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. కాగా జామియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీల్లో హింస చోటుచేసుకోవడం దురదృష్టకరమని బీఎస్పీ అధినేత్రి మాయావతి అన్నారు. దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జేఎంయూ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజీనామా చేయాలని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

## నిరసన గళాలను అణిచేస్తున్నారు: తాప్సీ



ముంబై, డిసెంబరు 16: ఢిల్లీ జామియా మిలియా యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడడాన్ని నటి తాప్సీ, నటి, దర్శకురాలు కొంకణాసేన్ ఖండించారు. పౌరసత్వ సవరణ చట్టంపై నిరసన గళాలను ప్రభుత్వం అణచివేస్తోందని వారిద్దరితో పాటు దర్శకులు అనురాగ్ కాశ్యప్, సుధీర్ మిశ్రా కూడా విమర్శించారు. దేశంలో కొత్త నిబంధనలు రాస్తున్నారని, వాటిలో ఇమడలేని వారికి పరిణామాలు బాగా తెలుస్తాయని తాప్సీ వ్యాఖ్యానించారు. తాము విద్యార్థులకు అండగా ఉన్నామని కొంకణాసేన్ ప్రకటించారు. పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళనల్లో హింసకు తావు ఇవ్వవద్దని ప్రజలకు బెంగాల్ దిగ్గజ నటుడు సౌమిత్ర ఛటర్జీ విజ్ఞప్తి చేశారు.

## గవర్నర్ వర్సెస్ మమత

కోల్‌కతా, డిసెంబరు 16: పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగ్దీప్ ధన్‌ఖడ్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య జగడం పౌరసత్వ సవరణ చట్టంతో మరో మలుపు తిరిగింది. సీఎస్, డీజీపీలు పిలిచినా రాకపోవడంతో రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల గురించి స్వయంగా కలిసి వివరించాలని మమతను గవర్నర్ కోరారు. మంగళవారం సీఎంకు వీలైన సమయంలో రాజ్‌భవన్‌కు రావాలని కోరినట్లు ఆయనే ట్విటర్‌లో తెలిపారు. అంతేకాదు, ఆమె సోమవారం కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని ఆక్షేపించారు. అసలే పౌరసత్వ సవరణ చట్టంపై ఆగ్రహంతో ఉన్న మమత... గవర్నర్ 'సందేశం'తో మండిపడ్డారు. శాంతిభద్రతలను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించడం గవర్నర్ బాధ్యత అని చురకంటిస్తూ లేఖ రాశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో అగ్నికి ఆజ్యం పోయడం గవర్నరుకు తగదని హితవు పలికారు. చీటికి మాటికి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ గవర్నరు ట్విటర్‌కెక్కడం, ప్రెస్ మీట్‌లు ఏర్పాటు చేయడాన్నీ ఆమె తప్పుపట్టారు.



## అట్టుడికిన జామియా

న్యూఢిల్లీ, డిసెంబరు 16: దేశ రాజధాని ఢిల్లీ.. సోమవారం ఉదయం.. ఓవైపు గడ్డకట్టే చలి.. మరోవైపు, రివ్వున వీస్తున్న చలిగాలి! చలిని ఏమాత్రం లెక్క చేయకుండా కొంతమంది విద్యార్థులు జామియా వర్సిటీకి వచ్చారు. చొక్కాల్లేకుండా గేటు బయట నిరసన తెలిపారు. ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల వరకూ వివిధ వయసులకు చెందిన జామియా విద్యార్థినులు, పూర్వ విద్యార్థులు, వారి అక్కలు, చెల్లెళ్లు, తల్లులు తరలి వచ్చారు. మహిళల నేతృత్వంలో జరిగిన ఆందోళనలో పెద్దఎత్తున పాల్గొన్నారు. దేశ రాజధానిలోని పలు విద్యా సంస్థల నుంచి వందలాదిమంది విద్యార్థులు ఢిల్లీలో రోడ్లపైకి వచ్చారు. వారికి మద్దతుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్థానికులు, తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. వెరసి, జామియా ముస్లిం యూనివర్సిటీ సోమవారం అట్టుడికింది. పోలీసుల అకృత్యాలపై సీబీఐ విచారణ జరపాలంటూ ఆందోళనకారులు ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకం చేబూని, చప్పట్లు కొడుతూ కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాంతో, వర్సిటీ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. "వర్సిటీ ప్రాంగణంలోని రెండు మసీదులను పోలీసులు ధ్వంసం చేశారు. ఇమామ్‌ను కొట్టారు. లైబ్రరీలో కూర్చున్న అంధ విద్యార్థి ఆర్సలన్‌పై దాడి చేశారు. మమ్మల్ని ఉగ్రవాదులుగా అభివర్ణించారు. దమ్ముంటే వర్సిటీ బయటకు రావాలని సవాల్ చేశారు. లైబ్రరీల్లోకి, బాత్ రూముల్లోకి కూడా దూసుకెళ్లి విద్యార్థినులపై దాడి చేశారు" అని విద్యార్థులు వివరించారు. దాంతో, చాలామంది హాస్టళ్లను ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లిపోయారు. పరీక్షలను వాయిదా వేసిన వర్సిటీ.. జనవరి 5వ తేదీ వరకూ సెలవులు ప్రకటించింది. ఢిల్లీ యూనివర్సిటీలోనూ పలువురు విద్యార్థులు పరీక్షలను బాయ్‌కాట్ చేసి ఆందోళనల్లో పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఆందోళన, పోలీసు చర్య కారణంగా ఇద్దరు వ్యక్తులకు బుల్లెట్ గాయాలయ్యాయి. ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించగా.. .. బుల్లెట్ గాయాలైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ వెల్లడించారు.



### ఉన్నావ్ రేప్ కేసులో..

## కుల్‌దీప్ నేరస్థుడే

▸▸ **దోషిగా నిర్ధారణ.. జీవిత ఖైదుకు చాన్స్**

న్యూఢిల్లీ, డిసెంబరు 16: ఉన్నావ్ రేప్ కేసులో ఢిల్లీ కోర్టు సోమవారం సంచలన తీర్పునిచ్చింది. 2017లో బాధిత బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో.. బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగార్‌ను దోషిగా నిర్ధారించింది. శిక్షల ఖరారుపై కోర్టు బుధవారం ఇరువర్గాల వాదోపవాదాలు విననుంది. కుల్‌దీప్‌పై సీబీఐ నమోదు చేసిన అభియోగాల మేరకు.. ఐపీసీ ప్రకారం అతడికి యావజ్జీవ కారాగార శిక్ష.. పోక్సో చట్టంలో పేర్కొన్న గరిష్ఠ శిక్షలు ఖరారయ్యే అవకాశాలున్నాయి. ఈ కేసులో ఇరువర్గాల వాదనలను విన్న తీస్ హజారీ జిల్లా కోర్టు న్యాయమూర్తి ధర్మేశ్ శర్మ.. బాధితురాలి వాంగ్మూలంతో ఏకీభవించారు. "ఒక బలమైన వ్యక్తికి వ్యతిరేకంగా బలహీన బాధితురాలు న్యాయపోరాటం చేశారు. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం సత్యమైనదిగా.. నిందారోపణలులేనిదిగా ఉన్నట్లు గుర్తించాను" అని ఆయన సోమవారం నాటి తీర్పును వెలువరించే సమయంలో వ్యాఖ్యానించారు. సీబీఐ సమర్పించిన ఆధారాల మేరకు కుల్‌దీప్‌సింగ్ దోషేనని తేల్చారు. సహ-నిందితురాలు శశిసింగ్ నిర్దోషి అని ప్రకటించారు. న్యాయమూర్తి తీర్పును చదవడం ప్రారంభించగానే.. శశిసింగ్ మూర్ఛపోయారు. తీర్పు పూర్తవ్వగానే కుల్‌దీప్ సింగ్ కుప్పకూలిపోయాడు. 2017 జూలై 4న బాధితురాలిపై సామూహిక అత్యాచారం జరగ్గా.. 925 రోజులకు ఈ కేసులో తీర్పు రావడం.. నిర్భయ ఘటన జరిగిన ఏడేళ్లకు అదే రోజున నిందితుడిని దోషిగా తేల్చడం గమనార్హం. కాగా.. ఈ కేసులో ఇతర నిందితులకు శిక్షలపై.. బాధితురాలి తండ్రి అరెస్టు, పోలీసు కస్టడీలో అతడి మృతి, బాధితురాలి కారు ప్రమాదం కేసుల్లో విచారణ ఢిల్లీ కోర్టులో ఇంకా కొనసాగుతోంది. అటు బాధితురాలి కారు ప్రమాదం కేసులోనూ ఎమ్మెల్యే కుల్‌దీప్ ప్రధాన నిందితుడు. ఆ కేసుల్లోనూ ఆయనకు శిక్షలు పడే అవకాశాలున్నాయి. కాగా, ఈ కేసులో సీబీఐ దర్యాప్తు తీరుపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "దర్యాప్తు, ప్రాసిక్యూషన్ మాన్యువల్స్‌ను సీబీఐ సరిగా అనుసరించలేదు. ఈ కేసులో చార్జిషీటు దాఖలులో చాలా ఆలస్యమైంది" అని వ్యాఖ్యానించారు. దేశాన్ని మహిళలకు సురక్షితమైన ప్రదేశంగా చేయడానికి అందరూ కృషి చేయాలని, స్త్రీలపై హింసను అడ్డుకోవాలని బెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు. దేశంలో మహిళలపై అఘాయిత్యాలకు కారణమవుతున్న అశ్లీల వెబ్‌సైట్‌లను నిషేధించాలని బిహార్ సీఎం నితీశ్‌కుమార్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సోమవారం లేఖ రాశారు. ఇలాంటి సైట్లు ప్రజల మనసులను చెడగొడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



## 4 నెలల్లోనే రామాలయం

▸▸ **ఆకాశాన్నంటేలా నిర్మిస్తాం: అమిత్ షా**

పాకుడ్, డిసెంబరు 16: అయోధ్యలో ఆకాశాన్నంటేలా భవ్యమైన రామమందిర నిర్మాణాన్ని నాలుగు నెలల్లోనే పూర్తిచేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. అయోధ్యలో రామమందిరం కట్టాలన్నది 100ఏళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయుల డిమాండ్ అని.. సుప్రీం తీర్పు రావడంతో అది త్వరలోనే సాకారం అవుతుందన్నారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాకుడ్‌లో జరిగిన సభలో ప్రసంగించారు. మీర్ జాఫర్ వంటి తీవ్రవాదులకు వ్యతిరేకంగా పనిచేయాలన్నారు. దేశాన్ని కాంగ్రెస్ అభివృద్ధి చేయలేకపోయిందన్నారు.



## మా అత్త రబ్రీ ఏ మాత్రం మంచిది కాదు

▸▸ **జుట్టుపట్టి ఈడ్చి.. ఇంటి బయటికి గెంటేసింది: ఐశ్వర్య**

పట్నా, డిసెంబరు 16 : ఆర్జేడీ చీఫ్ లాలూ ఇంట అత్తాకోడళ్ల తగాదా కొనసాగుతోంది. 'అత్త రబ్రీదేవి నన్ను జుట్టుపట్టి ఈడ్చుతూ.. ఇంటి బయటికి గెంటేసింది' అంటూ కోడలు ఐశ్వర్యారాయ్ తాజాగా మరో సంచలన ఆరోపణ చేశారు. పట్నా వర్సిటీ క్యాంపస్‌లో తన తల్లిదండ్రులకు వ్యతిరేకంగా ఆర్జేడీ కార్యకర్తలు పోస్టర్లు ఎందుకు అతికించారు ? అని ప్రశ్నించినందుకు మహిళా అంగరక్షకులతో కలిసి తనపై రబ్రీదేవి దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. 'రబ్రీదేవి నన్ను నానా తిట్లు తిట్టారు. జుట్టు పట్టుకొని ఈడ్చుతూ తల, మోకాళ్లు, కాళ్లపై దారుణంగా కొట్టారు. మొబైల్ ఫోన్‌ను కూడా లాక్కున్నారు. కనీసం చెప్పులు కూడా తొడుక్కోనివ్వకుండా ఇంటి నుంచి బయటికి గెంటేశారు' అని ఐశ్వర్యారాయ్ పట్నాలోని మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. కాగా, రబ్రీదేవి కూడా పట్నాలోని సచివాలయ పోలీసు స్టేషన్‌లో ఐశ్వర్యపై ఫిర్యాదు చేశారు. తనను ఐశ్వర్య మానసికంగా వేధిస్తోందని పేర్కొన్నారు.

## 'స్థానిక' రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం!

» సుప్రీం తీర్పును ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణే : హైకోర్టు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో రిజర్వేషన్ల వ్యవహారంపై జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఎన్నికల్లో బీసీలకు 34%, ఎస్సీలకు 16%, ఎస్టీలకు 5% రిజర్వేషన్ కల్పించడంతో అవి 50 శాతానికి మించిపోయాయని, సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధమని, దీనిని అడ్డుకోవాలని కోరుతూ గుంటూరు జిల్లా లింగాపురానికి చెందిన చిరుమామిళ్ల అశోక్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. రిజర్వేషన్లపై అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాల ఉల్లంఘన జరిగిందని పిస్తే కోర్టు ధిక్కరణ కింద కేసు నమోదు చేసుకోవాలని సూచిస్తూ పిటిషన్ కొట్టివేసింది. ముందస్తు ప్రణాళిక మేరకు స్థానిక ఎన్నికలు జరిగి తీరాల్సిందేనని, జాప్యం జరగడానికి వీల్లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## 'టీడీపీ భూమి'పై వివరణ ఇవ్వండి : హైకోర్టు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యాలయం నిర్మాణం కోసం గుంటూరు జిల్లా ఆత్మకూరు పరిధిలోని వాగుపోరంబోకులో ఉన్న భూమిని లీజుకు ఇవ్వడంపై వివరణ ఇవ్వాలని ఆ పార్టీ అధ్యక్షుడితో పాటు రెవెన్యూ, నీటి పారుదలశాఖల ముఖ్యకార్యదర్శులు, కలెక్టర్‌లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ కార్యాలయం కోసం 3.65 ఎకరాల పోరంబోకు భూమిని ప్రభుత్వం 2016లో కేటాయించింది. అయితే, ఈ కేటాయింపులో ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయని, దీనిని రద్దు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పిల్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం జరిగిన విచారణలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ధర్మాసనం వచ్చే ఫిబ్రవరికి వాయిదా వేసింది.

## వివేకా కేసు వాదనకు సల్మాన్ ఖుర్షీద్

» నేడు హైకోర్టులో వాదనలు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం వాదనలు జరగనున్నాయి. పిటిషనర్ తరపున కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి, సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ వాదించనున్నారు.

## 'జల్లికట్టు'పై సుప్రీం తీర్పే ఫైనల్ : హైకోర్టు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జల్లికట్టు నిషేధంపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు నిషేధం విధించినప్పటికీ చిత్తూరు జిల్లాలో జల్లికట్టు నిర్వహిస్తున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ 'యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్' కార్యదర్శి గోపాల్ రావ్ సూరాబత్తుల దాఖలు చేసిన పిల్‌పై సోమవారం విచారణ జరిగింది.

## కార్యాలయాల అద్దెలపై ప్రభుత్వం సమీక్ష

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల అద్దె ఒప్పందాలను సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్ ధరలతో పోల్చి ప్రస్తుతం చెల్లిస్తున్న అద్దెలపై సమీక్ష చేయాలని సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 మార్చి 1 నుంచి అద్దె ప్రాతిపదికన తీసుకున్న ప్రైవేటు భవనాల వివరాలను సాధారణ పరిపాలన శాఖ సేకరిస్తోంది.

## 23న ముసాయిదా ఓటరు జాబితా

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కె.విజయానంద్ సోమవారం విడుదల చేశారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2020 జనవరి 1వ తేదీ నాటికి ఓటరుగా అర్హత కలిగిన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 23న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

## మహిళా కమిషన్ లోగో ఆవిష్కరణ



ఏపీ మహిళా కమిషన్ లోగోను సోమవారం సీఎం జగన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. దిశ చట్టంపై జాతీయ స్థాయిలో చర్చించేందుకు జనవరిలో మహిళా సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

## గ్రామ సచివాలయాల్లో ఎలక్ట్రానిక్ సర్వీసులు

ఈ-గవర్నెన్స్ ద్వారా ఎలక్ట్రానిక్ సంతకాలు, ఎలక్ట్రానిక్ డెలివరీ సర్వీసులలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రకు సంబంధించి ఐటీ శాఖ 2011లో ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. గ్రామాల్లో, పట్టణాల్లో ఎలక్ట్రానిక్ సర్వీసులు, సర్టిఫికెట్లు ఇచ్చే విషయమై రాష్ట్రంలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాలను ఆథరైజెడ్ ఏజంట్లుగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీచేశారు.

## రూ.925 కోట్ల జీఎస్టీ నిధులు విడుదల

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆగస్టు-సెప్టెంబరు నెలల జీఎస్టీ పరిహారం రూ.925 కోట్లను కేంద్ర ఆర్థికశాఖ సోమవారం విడుదల చేసింది. ఈ నెల 18వ తేదీన ఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం విడుదల చేసింది. ఇంకా అక్టోబరు-నవంబరు నెలల పరిహారం రూ.750 కోట్లు రావాల్సి ఉంది.

## ఈహెచ్ఎస్‌కు రూ.100 కోట్లు విడుదల

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం సోమవారం రూ.100 కోట్లు విడుదల చేసింది. ఈహెచ్ఎస్ పథకం కింద ప్రభుత్వం గతేడాది నుంచి రూ.150 కోట్లు బకాయి ఉంది. ఈహెచ్ఎస్ అమలు కావడం లేదని, తమ దగ్గర నుంచి నెలవారీ చందాలను మాత్రం తీసుకుంటున్నారని ఉద్యోగులు ఇటీవల ప్రభుత్వానికి ఆవేదన వ్యక్తం చేశారు.

## కృష్ణా జలాల కేసు ఫిబ్రవరి 20కి వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపకంపై ఏపీ, తెలంగాణ, కర్ణాటక దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వచ్చే ఏడాది ఫిబ్రవరి 20కి వాయిదా వేసింది. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హృషికేశ్ రాయ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

## ఏపీ, తెలంగాణ బార్ కౌన్సిళ్లకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిళ్ల ఎన్నికలకు సంబంధించి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కౌన్సిళ్లకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నిరుడు జరిగిన ఈ ఎన్నికలు చట్టవిరుద్ధమంటూ తెలంగాణకు చెందిన నర్సింహులు అనే న్యాయవాది ఒక వ్యాజ్యం దాఖలు చేశారు. అడ్వొకేట్స్ చట్టంలోని సెక్షన్-3ను సవరించకుండానే తెలంగాణ బార్ కౌన్సిల్‌కు ఎన్నికలు జరిపారని తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

## మూడేళ్లలో 20 వేల ఉద్యోగాలు

» మంత్రి మేకపాటిని కలిసిన బ్రాండిక్స్ సీఈవో అశ్రోఫ్

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్‌లో 95శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పిస్తున్నామని బ్రాండిక్స్ కంపెనీ సీఈవో అశ్రోఫ్ ఒమర్ చెప్పారు. బ్రాండిక్స్ ప్రతినిధుల బృందం సోమవారం సచివాలయంలో మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని కలిసింది. మూడు దశల్లో మూడేళ్లలో 20వేలకుపైగా ఉద్యోగాలు అందించనున్నట్లు బృందం తెలిపింది. ఏడాది కాలంలో ఐదు నుంచి ఏడువేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. బ్రాండిక్స్ విస్తరణ, కంపెనీలో ఉన్న సమస్యలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లగా... వీటిపై సమీక్షించి సత్వరమే పరిష్కరిస్తామని మేకపాటి చెప్పారు.



అమరావతి పోలీసు స్టేషన్ నుంచి బయటికొచ్చిన కర్నూలు వాసులు

## వైసీపీ వచ్చాక జీవితం దుర్భరం

» ఇసుక కష్టాలు సీఎంకు చెప్పుకొందామని వస్తే స్టేషన్‌కు తరలించారు

» కర్నూలు వైసీపీ ట్రాక్టర్ యజమానుల ఆవేదన

అమరావతి, డిసెంబరు 16 : వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక సరఫరా లేక దుర్భరజీవితం అనుభవిస్తున్నామని కర్నూలు రూరల్ మండలంలోని వైసీపీకి చెందిన ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విన్నవించుకునేందుకు రాజధానికి వస్తే పోలీసు స్టేషనుకు తరలించారన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల, నిడ్జూరు, జి.సింగవరానికి చెందిన 40 మంది ట్రాక్టర్ యజమానులు సోమవారం ముఖ్యమంత్రిని కలవాలని వెళ్తుండగా, రాజధాని గ్రామమైన బోరుపాలెం వద్ద పోలీసులు అడ్డుకుని, అమరావతి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మీడియా వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో నిడ్జూరు, జి.సింగవరం, మునగాల పాడు, ఆర్.కొంతలపాడు, పంచలింగాల ఇసుక రీచ్‌లపై ఆధారపడి ఉపాధి పొందినట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వం ఆ రీచ్‌లను మూసి వేసిందన్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్‌ను 120 కిలోమీటర్ల దూరంలోని పెద్దపాడు వద్ద ఏర్పాటు చేశారని, అక్కడి నుంచి ట్రాక్టర్ ఇసుకకు రూ.3175 చెల్లించి తీసుకెళితే ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదన్నారు. ట్రాక్టర్లకు నెలవారీ కిస్తీలు కూడా కట్టలేకపోవడంతో ఫైనాన్సియర్లు తీసుకుతీసుకుపోతున్నారని తెలిపారు. జగనన్న వస్తే తమ జీవితాలు మరింత బాగుపడతాయని నమ్మి ఓటు వేసినందుకు నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు.

# 'దిశ' న్యాయమెక్కడ జగన్!

» ఆ చట్టం తర్వాతా అత్యాచారాలు

» ఒక్క కేసులోనైనా అమలు చేశారా?

» ఐదేళ్ల బాలికపై అంత ఘోరం జరిగితే కనీసం పరామర్శించారా?

» మాటలకు,చేతలకు పొంతన లేని స్ప్లిట్ పర్సనాలిటీ ముఖ్యమంత్రిది

» ఇల్లు, 3 ఎకరాలు, రూ.25 లక్షలు బాధిత కుటుంబానికి అందించాలి

» మాజీ సీఎం చంద్రబాబు డిమాండ్



గుంటూరు జీజీహెచ్‌లో బాలికను పరామర్శించి వస్తున్న చంద్రబాబు తదితరులు

గుంటూరు మెడికల్, డిసెంబరు 16: "ముఖ్యమంత్రిది స్ప్లిట్ పర్సనాలిటీ. (ద్వంద్వ వ్యక్తిత్వం) మాట మీద నిలబడే స్వభావం ఆయనకు లేదు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి...చేతలు మాత్రం గడప దాటడం లేదు. ఆడ పిల్లల రక్షణకు 'దిశ చట్టం' తెచ్చిన రోజే గుంటూరులో ఐదేళ్ల పసిపాపపై అత్యాచారం జరిగింది. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ పాపను పరామర్శించే తీరిక సీఎంకు, మంత్రులకు లేదు. ఇదా ముఖ్యమంత్రి వ్యవహరించే తీరు?" అని మాజీ సీఎం చంద్రబాబు మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్యేలు గానీ, కనీసం జిల్లా కలెక్టర్, ఎస్పీ సైతం బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం స్వయంగా ఆస్పత్రికి వచ్చి కుటుంబాన్ని ఓదార్చితే, యంత్రాంగం కూడా అప్రమత్తమయ్యేదన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను సోమవారం చంద్రబాబు పరామర్శించారు. ఆమెకు అందిస్తున్న చికిత్సలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "హైదరాబాద్‌లో దిశ సంఘటనలో అత్యాచారం చేసిన నలుగురిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేస్తే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెగ పొగిడిన జగన్ మోహన్‌రెడ్డి, గుంటూరు ఘటనపై ఎందుకు స్పందించడం లేదు? బాధితురాలు దళిత కుటుంబానికి చెందిందనా? లేక అత్యాచారానికి పాల్పడిన వాడు రెడ్డి వర్గానికి చెందిన వాడనా?" అంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దళిత బాలికపై జరిగిన అత్యాచారాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నారని, ఆమెపై అత్యాచారానికి పాల్పడిన లక్ష్మారెడ్డిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. "వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగాయి. దిశ చట్టం వచ్చిన తర్వాత కూడా రాష్ట్రంలో పలుచోట్ల అత్యాచారాలుజరిగాయి. వీటిలో ఏ ఒక్క కేసులోనైనా దిశ చట్టం అమలు చేశారా? ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో కరుణాకరరెడ్డి అనే యువకుడు బీసీ కుటుంబానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గుంటూరులో లక్ష్మారెడ్డి, దళిత బాలికపై అత్యాచారానికి ఒడి గట్టాడు. అఘాయిత్యాలు చేసేందుకు దళిత, బలహీన వర్గాలే దొరికాయా?' అని చంద్రబాబు ఆగ్రహించారు. చికిత్స పొందుతున్న బాలిక పేరిట రూ.25 లక్షలు డిపాజిట్ చేయాలని, ఇల్లు ఇవ్వడంతోపాటు మూడెకరాల పొలం ఇవ్వాలని, తల్లికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, బాలికను ప్రభుత్వమే చదివించాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ తరఫున బాధిత కుటుంబానికి 50వేలు సాయం ప్రకటించారు.

### బాధితులకు బెదిరింపులా?

బాలికకు చికిత్స జరుగుతుండగానే, ఆస్పత్రి నుంచి వెళ్లిపోవాలంటూ తమను కొందరు బెదిరిస్తున్నారని కుటుంబ సభ్యులు చెప్పి బాధపడ్డారని చంద్రబాబు అన్నారు. "లక్ష్మారెడ్డి తండ్రి స్థానికంగా వైసీపీ నాయకులతో తిరుగుతున్నారు. 'మాకు ప్రభుత్వం అండ ఉంది. మీరేమి చేయలేరు. వెంటనే ప్రభుత్వాస్పత్రి నుంచి వెళ్లిపోవాలని బాధిత కుటుంబంపై బెదిరింపులకు దిగుతున్నారు' అని వారు నాతో చెప్పారు. ఈ చర్య సరైనది కాదు" ఆయన ఆక్షేపించారు. అక్కడే ఉన్న బాలిక అమ్మమ్మ రోదిస్తూ..తమకు న్యాయం చేయాలని చంద్రబాబును కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, జవహర్, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పాల్గొన్నారు.

### పేరుకే దళితులకు పదవులు

» పెత్తనమంతా ఆ సామాజిక వర్గానిదే: వర్ల

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్‌నంటూ సీఎం జగన్ దళితులను మోసం చేశారని.. ఆయన నిజమైన క్రైస్తవుడు కాదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. పేరుకే దళితులకు పదవులు ఇస్తున్నారని.. పెత్తనమంతా జగన్ సామాజిక వర్గానిదేనని ఆరోపించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికైన ఆయన్ను సోమవారం గుంటూరులో టీడీపీ ఎస్సీ సెల్ నేతృత్వంలో సత్కరించారు. ఈ సందర్భంగా వర్ల మాట్లాడారు. 'మాలలు నాకు బంధువులంటూ మాదిగలకు సీఎం జగన్ అన్యాయం చేస్తున్నారు. మంద కృష్ణమాదిగకు కనీసం అపాయింట్‌మెంట్ ఇచ్చారా? ఓట్ల కోసం క్రిస్టియన్‌నంటూ, గెలిచాక చిన్నజీయర్‌స్వామి తదితరులకు పాదాభివందనాలు చేస్తూ హృషీకేశ్ వెళ్లి యాగాలు చేస్తున్నారు. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వడం ఆనవాయితీ. దానికి విరుద్ధంగా జగన్ వ్యవహరిస్తున్నారు. టీడీపీ దళిత పార్టీ' అని కొనియాడారు. దేవినేని ఉమ, డొక్కా మాణిక్యవరప్రసాద్, ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'రివర్స్' నడక

» వినూత్న నిరసన

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రివర్స్ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ధ్వజమెత్తారు. రివర్స్ టెండరింగ్ పేరుతో టెండర్లు రిజర్వ్ చేసుకుని రివర్స్ అభివృద్ధి చేస్తున్నారని, ఇది చాలా దుర్మార్గమని తప్పుబట్టారు. రివర్స్ పాలన, తిరోగమన అభివృద్ధిని వ్యతిరేకిస్తూ చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం సచివాలయం ఫైర్‌స్టేషన్ నుంచి అసెంబ్లీ గేటు వరకూ వెనక్కు నడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మన కళ్ల ముందు కనపడే అమరావతి ప్రభుత్వానికి రూ.2 లక్షల కోట్ల సంపద వచ్చే ఆస్తి అని, అలాంటి బంగారు బాతును ఇస్తే పెంచుకుంటూ పోవాల్సిందిపోయి, చంపేసే పరిస్థితికి వచ్చారని మండిపడ్డారు. ఇది ఉన్మాద, తుగ్లక్ పాలన అని మండిపడ్డారు. విదేశీ పెట్టుబడులు కూడా రాని పరిస్థితి కల్పించారని, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలు రాష్ట్రం నుంచి పారిపోయే పరిస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రానికి విదేశాల నుంచి ఎవరూ రావడంలేదన్నారు. కౌన్సిల్‌లో అడిగితే రాజధాని అమరావతే అన్నారని? తరువాత కాదంటున్నారని, ఇలా రోజుకో మాట చెబుతూ అమరావతిని భ్రష్టు పట్టించారని చంద్రబాబు మండిపడ్డారు.



రాష్ట్రంలో రివర్స్ పాలన సాగుతోందంటూ వెనక్కు నడుస్తూ నిరసన తెలుపుతున్న చంద్రబాబు తదితరులు

# కీచక టీచర్!

## విద్యార్థినిపై ఉపాధ్యాయుడు అత్యాచారం

» అనుకూల, వ్యతిరేక వర్గాల ఘర్షణ

» టీచర్‌పై డీఈవో సస్పెన్షన్ వేటు



గ్రామస్థులు దాడి చేయడంతో రోదిస్తున్న లక్ష్మయ్య, అతని భార్య

నిడదవోలు, కావలి (క్రైం), కుప్పం, డిసెంబరు 16: పాఠాలు చెప్పాల్సిన టీచర్.. కీచకుడిగా మారాడు. విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిడదవోలు మండలం తాడిమళ్లలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొయ్యే లక్ష్మయ్య తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. 4 నెలల క్రితం అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై లక్ష్మయ్య అత్యాచారం చేశాడు. బాలిక ఇటీవల బాగా నీరసంగా కనిపించడంతో ఇంట్లో తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో ఆమె విషయం చెప్పింది. బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భారీగా పాఠశాలకు చేరుకుని లక్ష్మయ్యకు దేహశుద్ధి చేశారు. అయితే.. గ్రామంలోని మరో వర్గం లక్ష్మయ్యకు మద్దతుగా నిలవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకుని బాలిక ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం లక్ష్మయ్యను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు బి.రామసుబ్బారావు తెలిపారు. మరో విద్యార్థిని కూడా లక్ష్మయ్య తనను లైంగికంగా వేధించాడని ఫిర్యాదు చేసింది.

### గర్భస్రావంతో వెలుగులోకి..

మైనర్ బాలికపై కన్నేసిన వివాహితుడు మాయమాటలతో ఆమెను లొంగదీసుకుని ఆరు నెలలుగా అత్యాచారం చేస్తున్నాడు. నెల్లూరు జిల్లాలో జరిగిన ఈ దారుణం గురించి కావలి డీఎస్పీ డి ప్రసాద్ సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఒంగోలుకు చెందిన మైనర్ బాలిక బోగోలు మండలంలోని అక్కాబావల వద్ద ఉంటోంది. అల్లూరు పంచాయతీ ఆర్‌డీఆర్ కాలనీకి చెందిన ఏకుల అజయ్ (20) ప్రేమపేరుతో ఆమెను లొంగదీసుకుని పలుమార్లు అత్యాచారం చేశాడు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చింది. ఈనెల 11న ఆమెకు గర్భస్రావమైంది. ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాలిక ఫిర్యాదు మేరకు ఒంగోలు పోలీసులు అజయ్‌ని అరెస్టు చేశారు.

### బాలికపై బాలుడి అత్యాచారయత్నం

పదేళ్ల బాలికపై మైనర్ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన కుప్పం పట్టణంలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం బాలిక (10) తన అమ్మమ్మ టిఫిన్ షాపుకు వచ్చి వెళ్తున్న సమయంలో వేరే ప్రాంతానికి చెందిన బాలుడు (14) ఆమె వెంట పడ్డాడు. చిన్నారిని సమీప పొదల్లోకి లాక్కెళ్లడానికి యత్నించాడు. అప్పుడే టిఫిన్ షాపు మూసేసి ఇంటికి బయల్దేరిన చిన్నారి అమ్మమ్మ దీన్ని గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గుమికూడి బాలుడికి దేహశుద్ధి చేసి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

### బాలికపై వృద్ధుడి అత్యాచారం

హోసూరు క్రైం, డిసెంబరు 16: బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న బాలిక (16)పై 65 ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా పోంచంపల్లి తాలూకాలో ఈ దారుణం చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రులు ఆదివారం ఆమెను ఇంట్లో వదిలి బయటకు వెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన సుందరం అనే వృద్ధుడు ఇంట్లో ఎవరూ లేని విషయం గ్రహించి బాలికపై అత్యాచారం చేసి పరారయ్యాడు. పోలీసులు అతడిని గాలించి పట్టుకున్నారు.

### లైంగిక వేధింపుల నేరగాళ్లకు ప్రత్యేక రిజిస్టర్: డీజీపీ

అమరావతి, డిసెంబరు 16: రాష్ట్రంలో మహిళలు, అమ్మాయిలపై లైంగిక వేధింపులకు దిగే నేరగాళ్లకు వివరాల కోసం ప్రత్యేకంగా ఒక రిజిస్టర్‌ను నిర్వహిస్తామని డీజీపీ గౌతంసవాంగ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో దిశ చట్టం అమలుపై మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి దమయంతి తదితరులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయి వరకు సమానత్వంపై అవగాహన కల్పిస్తామని డీజీపీ చెప్పారు.

## బాలిక కుటుంబానికి 10 లక్షలు

» సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 5 లక్షలు, చిన్నారి చదువుకు మరో 2 లక్షలు

» అట్రాసిటీ యాక్టు కింద 2.50 లక్షలు... పరామర్శించిన హోం మంత్రి

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడిన నిందితులపై కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి మేకతోటి సుచరిత స్పష్టం చేశారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అత్యాచార బాధిత చిన్నారిని హోంమంత్రి సుచరిత, జిల్లా కలెక్టర్ ఐ శామ్యూల్ ఆనంద్‌కుమార్, అర్బన్ ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ సోమవారం రాత్రి పరామర్శించారు. సుమారు రూ. 10 లక్షల సాయం ప్రకటించారు. వైద్యులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొన్నారు. చిన్నారి తల్లిని ఓదార్చి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకొంటామని హోంమంత్రి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5లక్షలు, చిన్నారి చదువు కోసం మరో రూ.2 లక్షలు, పోక్సో చట్టం కింద రూ.25 వేల చెక్కుని అందించారు. వీటితో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద రూ.2.50 లక్షలు వెంటనే అకౌంట్‌కు జమ చేస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి సొంత ఇల్లు లేనందున ఉగాది రోజున అందరికీ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రుణం మంజూరు చేయిస్తామని వెల్లడించారు. బాధితురాలి తల్లి ఏఎన్ఎంగా ఉద్యోగం చేస్తున్నందున ఆమెకు డీఎంహెచ్‌వో కార్యాలయం ద్వారా ఉద్యోగం కల్పిస్తామన్నారు.

## మాన ప్రాణాలు రెడ్లవేనా?

» రెడ్డి బాధితురాలైతే ఊగిపోయారు.. దళితులైతే స్పందించరే: కృష్ణ మాదిగ



గుంటూరు, ఒంగోలు (కార్పొరేషన్), డిసెంబరు 16: మాన ప్రాణాలు రెడ్డి కులస్తులకేనా..? దళిత, గిరిజన మహిళలవి కావా? హైదరాబాద్‌లో రెడ్డి కులస్థురాలి హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్‌ను సమర్థించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో అణగారిన వర్గాల మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై ఏం తీర్పునిస్తారో సూటిగా చెప్పాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదేళ్ల చిన్నారిని మంద కృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రెడ్డి యువతి బాధితురాలుగా మారితే.. ఒక ముస్లిం, ముగ్గురు బీసీ యువకుల్ని ఎన్‌కౌంటర్ చేయడాన్ని ఏపీ సీఎం జగన్ స్వాగతించారు. మరి వారం రోజుల వ్యవధిలో ఏపీలో మూడు చోట్ల రెడ్ల చేతిలో దళిత మహిళలు బాధితులుగా మారితే ఆ ఆవేశం, ఆ హ్యాట్సాఫ్‌లు ఏమయ్యాయని ప్రశ్నించారు. గుంటూరులో ఐదేళ్ల బాలికై అత్యాచారం కేసులో నిందితుడు లక్ష్మణ్‌రెడ్డి అని, దిశ చట్టం తీసుకొచ్చిన రోజే ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో మానసిక వికలాంగురాలిపై అత్యాచారం కేసులో కరుణాకర్‌రెడ్డి నిందితుడుగా ఉన్నారని చెప్పారు. కర్నూలులో గిరిజన యువతిని అత్యాచారం చేసి, హత్యచేసిన నిందితుల్లో రెడ్డి కులానికి చెందిన కే.జనార్దన్‌రెడ్డి, దీపక్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డిలను ఇంతవరకు అరెస్టు చేయలేదని అన్నారు. తల్లీకూతుళ్లను దారుణంగా హతమార్చి ఆపై కాల్చివేసిన నిందితుడిది ఏ కులమైనా సరే కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. గుంటూరు బాధిత బాలికకు, ఆమె కుటుంబానికి 48 గంటల్లో న్యాయం చేయకపోతే ధరా చేస్తామని హెచ్చరించారు.

## నమ్మి ఓటేసి మోసపోయారు

» 3 వేల వృద్ధాప్య పింఛను ఏదీ?..కొత్త పెన్షన్ ఒక్కటీ మంజూరవలేదు

» మాట తప్పుతోందా.. మోసం చేస్తోందా..?.. వైసీపీపై పవన్ ఫైర్



అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీని నమ్మి ఓటు వేసినందుకు పింఛన్ కోసం ఎదురుచూసే వృద్ధులు భారీగా నష్టపోయారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ ఎన్నికల హామీలో వృద్ధాప్య పెన్షన్ 2 వేల నుంచి 3 వేలకు పెంచుతామని చెప్పిందని గుర్తుచేశారు. 'పెన్షన్ అమలులో వైసీపీ ప్రభుత్వం అంచెంచెలుగా మాట తప్పుతోందనాలా.. లేక మోసం చేస్తోందనుకోవాలా..' అని సోమవారం ట్విటర్‌లో అనుమానం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పెన్షన్‌ను రూ.2,250 మాత్రమే చేసిందని.. దీనివల్ల ప్రతి లబ్ధిదారూ నెలకు రూ.750 నష్టపోతున్నారని తెలిపారు. అలాగే వృద్ధాప్య పెన్షన్ పొందే అర్హతను 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తామని ప్రభుత్వం మే 30న జీవో 103 జారీచేసిందని.. కానీ ఈరోజు వరకూ రాష్ట్రంలో ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయలేదని ఆక్షేపించారు. పెన్షన్ వయస్సు తగ్గిస్తే కొత్తగా 10 లక్షల మందికి పింఛను ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం నెలకు ఇస్తున్న రూ.2,250 లెక్కన చూసుకుంటే, ఒక్కో కొత్త పింఛన్ లబ్ధిదారు ఏడు నెలల వ్యవధిలో 15,750 వరకూ నష్టపోయినట్లు పేర్కొన్నారు.

## 16 బిల్లులకు శాసనసభ ఆమోదం

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనసభలో సోమవారం 16 బిల్లులను ప్రవేశపెట్టింది. సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. వీటిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ప్రభుత్వ సర్వీసులో ఉద్యోగుల విలీనం) బిల్లు, ఏపీ మిలెట్స్ బోర్డు బిల్లు, ఏపీ పప్పు ధాన్యాల బిల్లు, ఏపీ సహకార సంఘాల (రెండో సవరణ)బిల్లు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ లా(సవరణ) బిల్లు, ఏపీ విశ్వ విద్యాలయాల చట్టాల (సవరణ) బిల్లు, ఏపీ విశ్వ విద్యాలయాల చట్టం (రెండో సవరణ)బిల్లు, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, లలిత కళల విశ్వ విద్యాలయం (సవరణ) బిల్లు, ఏపీ విద్యాచట్టం (సవరణ) -1982 బిల్లు, క్లస్టర్ యానివర్సిటీ కర్నూలు బిల్లు-2019 ఉన్నాయి. వీటితో పాటు ఏపీ ఎస్సీ కమిషన్ బిల్లు, ఏపీ ఎస్టీ కమిషన్ బిల్లు, ఏపీ వృత్తులు, వర్తకులు, ఉద్యోగులపై పన్ను సవరణ బిల్లు, ఏపీ ఎక్సైజ్(రెండో సవరణ) బిల్లు, ఏపీ ప్రొహిబిషన్ (సవరణ) బిల్లు, ఏపీ సరుకులు, సేవలపై పన్ను (సవరణ) బిల్లు-2019 సభ ఆమోదం పొందాయి.

### పెట్టుబడులు వచ్చేలా చూడండి: సీఎస్

ఏపీలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని, కొరియా నుంచి పెట్టుబడులు వచ్చేలా సహకరించాలని భారత్ తరపున కొరియాతో రాయబారిగా ఉన్న శ్రీప్రియ రంగనాథన్‌కి ఏపీ సీఎస్ నీలం సాహ్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం సచివాలయంలో శ్రీప్రియ రంగనాథన్ నీలం సాహ్నితో భేటీ అయ్యారు.

## 8.69 శాతం తక్కువకు 'సోమశిల' పనులు

నెల్లూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సోమశిల హైలెవల్ కెనాల్ రెండో దశ పనులను 8.69 శాతం తక్కువకు బీవీఎస్ఆర్ కంపెనీ కైవసం చేసుకుంది. రూ. 503.37 కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా.. సోమవారం రివర్స్ టెండరింగ్ విధానం చేపట్టారు. బీవీఎస్.ఆర్, రాఘవ, ఏపీఆర్ కంపెనీలు ఈ బిడ్లలో పాల్గొన్నాయి. గడువు ముగిసే సమయానికి 8.69 శాతం లెస్‌తో బీవీఎస్ఆర్ కంపెనీ టెండరు కైవసం చేసుకుందని సోమశిల ప్రాజెక్ట్ సర్కిల్ ఎస్ఈ రవీంద్రరెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.43.74 కోట్లు ఆదా అయినట్లు చెప్పారు. గతంలో జరిగిన టెండర్లతో పోల్చితే రూ.67.9 కోట్లు ఆదా అయినట్లు వివరించారు.

## గుడ్డు కొనుగోళ్లకూ రివర్స్ టెండరింగ్

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ బడులు, అంగన్‌వాడి కేంద్రాలకు అందించే కోడిగుడ్ల కొనుగోళ్లలో రివర్స్ టెండరింగ్ అమలు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు (జీఈ.వో.నెం.334) జారీ చేశారు. ఆయా విద్యా డివిజన్ల పరిధిలో పౌల్ట్రీ రైతు అయి ఉంటే చాలు టెండర్లలో పాల్గొనవచ్చు. కోడిగుడ్ల బరువు 50 గ్రాములకు పైన ఉండాలి. జిల్లా స్థాయిలో ఏర్పాటైన కమిటీ టెండర్ల నిర్వహణను పర్యవేక్షిస్తుంది.






## ఆరున్నర నెలల్లో 67 మంది రైతుల ఆత్మహత్యలు: ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరున్నర నెలల కాలంలో 67 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం శాసనసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి కన్నబాబు ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరగ లేదంటూనే ఈ గణాంకాలను వెల్లడించడం విశేషం. రైతు భరోసా పథకం కింద 45,82,505 మందికి సహాయం అందించామని కన్నబాబు అన్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం 2016-2018 కాలంలో మూడు భాగస్వామ్య సదస్సులు నిర్వహించి 1182 బారీ, మెగా ప్రాజెక్టులపై ఒప్పందాలు చేసుకుందని మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. ఇందులో 309 ప్రాజెక్టులు రూ.1.30 లక్షల కోట్ల నిబద్ధ పెట్టుబడితో ఉత్పత్తిని ప్రారంభించాయని, వాటి ద్వారా 1.54 లక్షల మందికి నిబద్ధ ఉపాధి కల్పన జరుగుతోందని వివరించారు.

ప్రతిభా భారతిని స్పీకర్‌ను చేశాం.. మాధవరావును సీఎస్‌గా నియమించాం

ఎస్సీ వర్గీకరణ చేపట్టాం!.. గురుకుల పాఠశాలలు పెట్టాం

ఎస్సీలకు 15 వేల కోట్లు కేటాయించి 6011 కోట్లయినా ఖర్చుచేయలేదు

జగన్ కావాలనే రెచ్చగొడుతున్నారు.. హక్కుల నోటీసుపై చర్చించకుండా పరార్

టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజం



# మాతోనే మేలు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లు టీడీపీ పాలనను విమర్శిస్తున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ విభజనపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీఎంకు ముందు ఆయన మాట్లాడారు. 'జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను టీడీపీ ప్రభుత్వమే నియమించింది. ఆ కమిషన్ సిఫారసులతోనే ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటైంది. తెలుగుదేశం హయాంలోనే ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగింది. దళిత మహిళ ప్రతిభాభారతిని అసెంబ్లీ స్పీకర్‌గా నియమించాం. సీఎస్‌గా మాధవరావును నియమించాం. ఇళ్ల కేటాయింపుల్లో ఎస్సీలకు 50 శాతం ఇచ్చాం. కేఆర్ నారాయణన్‌ను రాష్ట్రపతిగా సిఫారసు చేశాం' అని గుర్తుచేశారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు తెచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమేనని చెప్పారు. మాదిగలకు న్యాయం చేయాలని ఏబీసీడీ వర్గీకరణ చేపట్టామని.. దాని వల్ల మాదిగలకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. ఈ సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు లేచి నిరసనలు తెలిపారు. అంతకుముందు కూడా చంద్రబాబు దళితుల గురించి మాట్లాడేందుకు వీల్లేదంటూ అడ్డుపడ్డారు. స్పీకర్ వారికి నచ్చజెప్పి చంద్రబాబును మాట్లాడనివ్వాలని సూచించారు. ఎస్సీలకు న్యాయం చేసే ప్రభుత్వమైతే ఈ బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయిస్తే.. రూ.6011 కోట్లు కూడా ఖర్చు చేయలేదేమిటని నిలదీశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద 2015-16లో రూ.5 వేల కోట్లు, 2016-17లో రూ.7 వేల కోట్లు, 2017-18లో రూ.9 వేల కోట్లు, 2018-19లో రూ.10 వేల కోట్ల పైబడి ఖర్చు చేశామన్నారు. దిశ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రోజునే గుంటూరు ఓ అమ్మాయిని లక్ష్మణ్‌రెడ్డి రేప్ చేస్తే ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని ధ్వజమెత్తారు. జగన్ సభ్యులను రెచ్చగొడుతున్నారన్నారు. సభాహక్కుల నోటీసుకు బదులివ్వకుండా పారిపోయారని విమర్శించారు. ఈ సందర్భంలో వైసీపీ సభ్యులు లేచి చంద్రబాబు ప్రసంగాన్ని అడ్డుకోగా.. టీడీపీ సభ్యులు కూడా లేచి నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కాగా.. చర్చ ప్రారంభించిన సమయంలో టీడీపీ సభ్యుడు వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. ఎస్సీ సబ్‌ప్లాన్‌ను అమలు చేసింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించింది తెలుగుదేశం ప్రభుత్వమేనని చెప్పారు. వైఎస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను హుస్సేన్‌సాగర్‌కు, ఇడుపులపాయ అభివృద్ధికి, ఔటర్‌రింగ్ రోడ్డు అభివృద్ధికి కేటాయించారని అనడంతో వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ హయాంలో సబ్‌ప్లాన్ లేదని.. 2012-13లో సబ్‌ప్లాన్ చట్టం చేసినట్లు తెలిపారు. ఇంతలో స్పీకర్ జోక్యం చేసుకుని వివాదాస్పద వ్యాఖ్యలతో బిల్లుపై చర్చకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు.

### కార్పొరేషన్ విభజనపై రాపాక..

చర్చ సందర్భంగా జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై కాకుండా ఎస్సీ కార్పొరేషన్ విభజనపై మాట్లాడారు. మంత్రి పినిపె విశ్వరూప్ చర్చ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై జరుగుతోందని సరిచేశారు. అనంతరం రాపాక వైసీపీ ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ను ప్రశంసించారు. గతంలో మాల, మాదిగ వర్గాలు కాంగ్రెస్‌లో ఉండేవని, ఇప్పుడు జగన్ వెంట ఉన్నాయన్నారు. అనంతరం బిల్లులను విశ్వరూప్, ఎస్టీ కమిషన్ బిల్లును ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి ప్రవేశపెట్టగా, వాటిని సభ ఆమోదించింది.

## సభలో 'మెడాల్' దుమారం!

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు నిర్వహించే కాంట్రాక్టు దక్కించుకున్న మెడాల్ సంస్థపై వస్తున్న ఆరోపణలపై విజిలెన్స్ కమిటీతో విచారణ చేయిస్తామని ప్రభుత్వం శాసనసభలో ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని తెలుగుదేశం పార్టీ కూడా స్వాగతించింది. సోమవారం ఉదయం శాసనసభలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరికరాలను సక్రమంగా నిర్వహించడం లేదని, వైద్య పరీక్షల కోసం రోగులను ప్రైవేటు కేంద్రాలకు పంపిస్తున్నారంటూ టీడీపీ సభ్యులు మద్దాళి గిరిధర్‌రావు, అనగాని సత్యప్రసాద్ ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై చర్చ కాస్తా మెడాల్‌కు ఇచ్చిన కాంట్రాక్టు మీదకు మళ్లింది. వైద్య పరీక్షల్లో భారీ గోల్‌మాల్ జరుగుతోందని, బయటికంటే ఎక్కువ ఫీజు వసూలు చేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. బయటి టెస్టులకు, మెడాల్‌కు చెల్లించే ఫీజులకు చాలా తేడా ఉందని ఆరోపించారు. మరో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మెడాల్‌కు టెండర్ ఇచ్చిన తర్వాత వైద్య పరీక్షల్లో రూ.600 కోట్ల దోపిడీ జరిగిందన్నారు. మెడాల్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో లోకేశ్ పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. దీనిపై టీడీపీ సభ్యుడు సత్యప్రసాద్ మాట్లాడుతూ.. సకల వైద్య పరీక్షలు ప్రభుత్వాస్పత్రిలోనే అందించాలన్న సంకల్పంతో ఈ కాంట్రాక్టును ప్రైవేటు సంస్థకు ఇచ్చారని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల కాళి కృష్ణ శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ.. బాబు హయాంలోనే వైద్య, ఆరోగ్యశాఖ దిగజారిపోయిందన్నారు. ముఖ్యమంత్రి ఆమోదంతో మెడాల్ వ్యవహారంపై విజిలెన్స్ కమిటీతో విచారణ చేయిస్తామని మంత్రి ప్రకటించారు. ఫైళ్లు ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని, తప్పులుంటే తేల్చాలని టీడీపీ స్పష్టం చేసింది.

# బఫూన్లలా తీరు!

▸▸ సస్పెండ్ చేసినా తప్పులేదు

▸▸ టీడీపీ ఎమ్మెల్యేలపై జగన్ ఆగ్రహం

▸▸ ఎస్సీ, ఎస్టీ కమిషన్ల బిల్లులకు సభ ఆమోదం



అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. దీనిపై సోమవారం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టింది. దీనిపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్, విపక్ష నేత చంద్రబాబు మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. 'ఎస్సీ, ఎస్టీలకు మేలు చేసింది మేమంటే మేమే' అంటూ పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. చరిత్రాత్మక బిల్లు తెస్తుంటే బఫూన్లలా వ్యవహరిస్తున్నారని జగన్ మండిపడ్డారు. రాజకీయాల్లో అనుకూలత కోసం చంద్రబాబు అన్నదమ్ముల మధ్య కూడా చిచ్చు పెడతారని విమర్శించారు. విపక్ష సభ్యులు ఎస్సీ, ఎస్టీ అంశాలు ప్రజల్లోకి వెళ్లకుండా చేయాలని చూస్తున్నారని, వారిని సస్పెండ్ చేసినా తప్పు లేదని స్పీకర్ తమ్మినేని సీతారాంకు సూచించారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు దళితుల గురించి చులకనగా మాట్లాడారని, దళితులుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని అన్నారని.. సీఎం స్థాయి వ్యక్తులే ఈ రకంగా మాట్లాడితే ఇక కిందిస్థాయి వ్యక్తులు దళితులను ఎలా గౌరవిస్తారని ప్రశ్నించారు. బాబు కేబినెట్‌లోని ఓ మంత్రి.. దళితులు స్నానం చేయరు, వారి వద్ద వాసన వస్తుందని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అంతకు ముందు చంద్రబాబుకు మాట్లాడేందుకు అవకాశమిచ్చిన స్పీకర్ తమ్మినేని సీతారాం.. బిల్లుపై మాత్రమే మాట్లాడాలంటూ అర్ధాంతరంగా మైక్ కట్ చేశారు. సీఎంను మాట్లాడాలని కోరారు. దీంతో టీడీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. ఒక్కసారిగా పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. తన మాటలు ప్రజల వద్దకు వెళ్ల కూడదనే దురుద్దేశంతో టీడీపీ సభ్యులు అరుస్తున్నారని సీఎం అన్నారు. ఇటువంటి దారుణమైన పనులు చేయించే వ్యక్తి చంద్రబాబు తప్ప ప్రపంచంలో ఎవరూ ఉండబోరని వ్యాఖ్యానించారు. ఆయన నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప వేరే మాటలు రావన్నారు.

### గొప్పలు చెబుతున్నారు..

2003లోనే తాము ఎస్సీ, ఎస్టీ కమిషన్ తెచ్చామని చంద్రబాబు గొప్పలు చెప్పుకొంటున్నారని సీఎం ఎద్దేవా చేశారు. నిజానికి జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ 1992లోనే వచ్చిందని, 1995లో ముఖ్యమంత్రి అయిన ఆయన 2004 ఎన్నికలకు ముందు రాజకీయ ఆలోచనలతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ తీసుకొచ్చారని తెలిపారు. అప్పటిదాకా కమిషన్ తీసుకురావాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పాలించారని మండిపడ్డారు. 'ఎంచి చూడగా మనుషులందున మంచి చెడులు రెండే కులములు... మంచి అన్నది మాల అయితే నేను మాలనవుతాను' అని వంద సంవత్సరాల కింద గురజాడ అప్పారావు అంటే.. దళితులుగా పుట్టాలని ఎవరనుకుంటారంటూ చంద్రబాబు సీఎంగా ఉండి అన్నారని దుయ్యబట్టారు. 'రాజధాని కోసం సీఆర్‌డీఏ సేకరించిన భూముల విషయంలోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు చంద్రబాబు దారుణమైన అన్యాయం చేశారు. ఓసీలకు సంబంధించిన పట్టా భూములకు రివర్సబుల్ ప్లాట్లు ఎక్కువగా కేటాయించి.. దళిత, బీసీ, మైనారిటీలకు చెందిన అసైన్డ్ భూములకు మాత్రం తక్కువ స్థలం కేటాయించారు. దళిత, బీసీ, మైనారిటీలపై ఇంత దారుణమైన వివక్ష చూపించడం వల్లే రాష్ట్రంలో 36 ఎస్సీ, ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కటి మాత్రమే టీడీపీ గెలుచుకుంది' అని ఎద్దేవా చేశారు. సీఎం మాట్లాడుతున్నంతసేపు టీడీపీ సభ్యులు పోడియం వద్ద నినాదాలిస్తూనే ఉన్నారు. అంతకుముందు ఎక్సైజ్ మంత్రి నారాయణస్వామి చంద్రబాబుకు మూడు ప్రశ్నలు సంధించారు. 'నారావారిపల్లిలో గుడిలో ఇప్పటికీ దళితులకు ప్రవేశం లేదు. మేం తెలుగుదేశంలో ఉండి ఓట్లు వేసినందుకు కాంగ్రెస్‌లో ఉన్న చంద్రబాబు దళితుల ఇళ్లను తగులబెట్టించలేదా? కారంచేడు ఘటనలో కక్షలు పెంచిందెవరు? వీటికి సమాధానాలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. వైసీపీ సభ్యులు సుధాకర్‌బాబు, జోగు రమేశ్, మేరుగ నాగార్జున, తిప్పేస్వామి, విష్ణు, గొల్ల బాబూరావు, కంభాల జోగులు, కె.శ్రీనివాసులు, బాలరాజు తీవ్ర పదజాలంతో చంద్రబాబుపై విరుచుకుపడ్డారు.

## జగన్.. మరో అల్లూరి

ఎస్టీల హక్కుల రక్షణకే కమిషన్: పుష్పశ్రీ వాణి



అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కులు కాపాడేందుకే ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి చెప్పారు. సోమవారం అసెంబ్లీలో ఎస్టీ కమిషన్ బిల్లుపై ఆమె మాట్లాడారు. చరిత్రలో గిరిజనుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజైతే, ఎస్టీ కమిషన్ ద్వారా గిరిజనుల గుండెల్లో మరో అల్లూరిగా నిలిచిన వ్యక్తి సీఎం జగన్ అని ఆమె వ్యాఖ్యానించారు. మరో వందేళ్లలో కూడా చూస్తామో లేదో అనే పథకాలను గిరిజనులకు కేవలం వంద రోజుల్లోనే అమలు చేసి చూపించిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. గిరిజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి అవసరమైన సలహాలు ఎస్టీ కమిషన్ ఇస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం గిరిజనులకు కనీసం మంత్రి పదవి కూడా ఇవ్వలేదని, కానీ తమ సీఎం ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని ఆమె అన్నారు. ఈ చర్చలో వైసీపీ ఎమ్మెల్యేలు రాజన్నదొర, టి.బాలరాజు, కళావతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. కాగా, బడ్జెట్‌లో ఎస్టీలకు రూ.4వేల కోట్లు కేటాయించి ఇప్పటి వరకూ రూ.2 వేల కోట్లే ఖర్చు పెట్టారని టీడీపీ సభ్యులు నిమ్మల రామానాయుడు విమర్శించారు. బాక్సైజ్ గనులకు సంబంధించి తొలుత ఎంవోయూ చేసుకుంది వైఎస్ఆర్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. గిరిజనులకు 55 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. పలువురు సభ్యులు మాట్లాడిన తర్వాత ఎస్టీ కమిషన్ ఏర్పాటు బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపింది.



## సభలో 'ఇంటి' గొడవ

▸▸ ఫర్నీచర్ ఇస్తే రాజీనామా చేస్తా: బొత్స

▸▸ గుంటూరులో చూపిస్తాం రండి: టీడీపీ

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'ఇంటి' గొడవకు అసెంబ్లీ వేదికగా మారింది. పేదల ఇళ్ల నిర్మాణం అంశంపై జరిగిన చర్చలో బుధవారం అధికార, ప్రతిపక్షాలు ఒకదానిపై ఒకటి దుమ్మెత్తి పోసుకొన్నాయి. సభ ప్రారంభంకాగానే టీడీపీ ఎమ్మెల్యే రామానాయుడు పాలకొల్లులో గృహనిర్మాణం నిలిచిపోయిందంటూ ఇంటి చర్చను ప్రారంభించారు. "పాలకొల్లులోని పెనుకుల పాడు వద్ద 6,144 యూనిట్లకుగాను 3720 ఇళ్లు తుది దశకు చేరుకున్నాయి. 2,424 పురోగతిలో ఉన్నాయి" అంటూ ఆయనకు పురపాలక శాఖమంత్రి బొత్స సత్యనారాయణ సమాధానమిచ్చారు. 85 శాతంపైనే పూర్తయిన ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరిట నిలిపివేసిందని, దానికిగాను ప్రతి పేదవాడికి నెలకు రూ.మూడు వేల అద్దె చెల్లించాలని రామానాయుడు డిమాండ్ చేశారు. "రివర్స్ టెండర్ పేరిట హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్‌లు కట్టే కంపెనీలను తీసుకొచ్చి పనులు అప్పగించారు. అప్పట్లో మేం ఇచ్చిన అనేక స్పెసిఫికేషన్స్ మార్చి నాసిరకం వాటిని జత చేసి నిధులు ఆదా అయ్యాయంటూ ప్రచారం చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. ఈ చర్చలో అచ్చెన్నాయుడు పాల్గొంటూ.. రంగులు వేసి పేదలకు అప్పగించే ఇళ్లను కూడా ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. "ఒక్కసారి రాజీవ్ స్వగృహ ఇళ్లు చూడండి. ఆ తర్వాత చంద్రబాబు గుంటూరు జిల్లాలో నిర్మించిన ఇళ్లెలా ఉన్నాయో చూసొద్దాం రండి" అని అచ్చెన్న కోరారు. మంత్రి బొత్స జోక్యంచేసుకొంటూ.. "పేదలకు ఒక్కటంటే ఒక్క ఇల్లూ పూర్తిగా నిర్మించి ఇవ్వలేదు. ఫర్నీచర్ ఇస్తున్నారా? ఎక్కడ ఇచ్చారో నిరూపిస్తారా? అలాగని నిరూపిస్తే తెల్లకాగితంపై రాజీనామా ఇచ్చి వెళ్లిపోతాను" అని ఆగ్రహించారు.

## 'ఇంగ్లిష్' బిల్లుకు ఓకే

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మక ఘట్టం అని సీఎం జగన్ అన్నారు. ఇక నుంచి 'రైట్ టు ఎడ్యుకేషన్' కాదని, 'రైట్ టు ఇంగ్లిష్ ఎడ్యుకేషన్' అని పేర్కొన్నారు. 'ఏపీ ఎడ్యుకేషన్ అమెండ్‌మెంట్ బిల్లు-2019'పై సోమవారం అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. ఈ బిల్లుతో రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ పాఠశాల ఇక మీదట ఇంగ్లిష్ మీడియం స్కూల్‌గా మారబోతుందన్నారు. ఇకపై ప్రతి పేదవాడికీ ఇంగ్లిష్ మీడియం చదువులు పూర్తిగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఇదొక చరిత్రాత్మక నిర్ణయమన్నారు. అనంతరం ఈ బిల్లును సభ ఆమోదించింది. కాగా, శాసనసభలో సోమవారం 16 బిల్లులను ప్రవేశపెట్టింది. సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

## బూట్లతో కొట్టుకొంటూ..వైసీపీ వీరాభిమాని ఆగ్రహం



చిత్తూరు, డిసెంబరు 16: మెడలో బూట్లు, నడుముకు గోనెసంచితో కనిపిస్తున్న ఈయన పేరు రాజమాణిక్యం. ఒకింత నిరాశ, మరింత నిప్పులు కక్కుతున్న ఈ దివ్యాంగుడు.. వైఎస్ కుటుంబానికి విధేయుడు. జగన్ సీఎం అయ్యేదాకా జుట్టు తీయనని, గడ్డం చేయనని భీష్మించిన వీరాభిమాని! అలాంటి అభిమానే సర్కారుపై ఆగ్రహించాడు. మెడలోని బూట్లతో తనను తాను కొట్టుకొంటూ సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో జరిగిన 'స్పందన'లో పాల్గొని, హల్‌చల్ సృష్టించాడు. వికలాంగుల పింఛను, తెల్ల రేషన్‌కార్డుకు అర్హుడినైనా.. మండల వైసీపీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి చెబితేనే ఇస్తామని తహసీల్దార్ చెబుతున్నారని వాపోయాడు. దళితుడినైన తనను అధికారులు పట్టించుకోవడం లేదన్నాడు. పార్టీ అభిమానమూ ఈ విషయంలో కొరగానిదైపోయిందన్నారు. పార్టీ గెలుపుకోసం పనిచేశానని, ఒకసారి అధికారంలోకి రాగానే కొత్త కొత్త నాయకులు వైసీపీలోకి రావడం మొదలుపెట్టారని రాజమాణిక్యం వాపోయాడు. అనంతరం జేసీ-2 చంద్రమౌళిని కలిసి వినతిపత్రం అందించాడు. రాజమాణిక్యంది చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం కె. పట్నం. పుట్టుకతోనే దివ్యాంగుడు కావడంతో, తన పనులు తాను చేసుకోలేని పరిస్థితి! తొలినుంచీ వైఎస్ అంటే అభిమానం. అ అభిమానంతోనే ఆయన చనిపోయినప్పుడు ఇల్లు అమ్మి గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటుచేశాడు. వైఎస్ కుటుంబంపై అభిమానంతో జగన్ సీఎం అయ్యేంత వరకు జుట్టు, గడ్డం తీయకుండా ఆరు సంవత్సరాలపాటు అలాగే ఉన్నాడు.

# తప్పుడు సమాచారమిస్తారా?

▸▸ అచ్చెన్నాయుడిపై హక్కుల నోటీసిస్తాం

▸▸ జూలై 1కి 4,380 మద్యం షాపులున్నాయి

▸▸ ఇది తప్పని తేలితే రాజీనామా చేస్తారా?

▸▸ మద్యంపై చర్చలో సీఎం జగన్ సవాల్

▸▸ సంపూర్ణ మద్య నిషేధమని మాట తప్పారు

▸▸ నాటు సారా అమ్మకాలు పెరిగాయి: అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం పాలసీపై చర్చ సందర్భంగా సోమవారం శాసనసభలో టీడీఎల్పీ ఉపనేత కె.అచ్చెన్నాయుడు, సీఎం వైఎస్ జగన్ మధ్య సుదీర్ఘ వాదోపవాదాలు జరిగాయి. పాదయాత్ర సందర్భంగా ఊరూరా తిరిగిన జగన్ అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్య నిషేధం విధిస్తామని చెప్పి మాట తప్పారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కొత్త పాలసీ వచ్చేటప్పటికి 3,603 మద్యం షాపులు ఉండగా.. ఇప్పుడు 2,883 షాపులు ఉన్నాయని చెప్పారు. 'మద్యం షాపులను తగ్గిస్తామని చెప్పి.. ప్రభుత్వం మాట తప్పింది. ఎక్కువ అమ్మకం ఉన్న షాపులను తక్కువ తగ్గించి, తక్కువ అమ్మకం ఉన్న షాపులను ఎక్కువగా తగ్గించారు. నాటు సారా అమ్మకాలు ఎక్కువయ్యాయి. ప్రభుత్వం చెబుతున్నదానికి విరుద్ధంగా మద్యం షాపుల సంఖ్య పెరిగింది' అని విమర్శించారు. ఈ ఆరోపణలపై జగన్ తీవ్రంగా స్పందించారు. అచ్చెన్నాయుడు నోరు విప్పితే అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన చెబుతున్న లెక్కలన్నీ తప్పన్నారు. 2019 జూలై 1 నాటికి రాష్ట్రంలో 4,380 మద్యం షాపులు ఉన్నాయని, అది తప్పని తేలితే అచ్చెన్నాయుడు రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు అచ్చెన్నాయుడిపై ప్రివిలేజ్ మోషన్(సభాహక్కుల ఉల్లంఘన) ఇస్తామని హెచ్చరించారు. 'అప్పుడు 4,380 మద్యం షాపులు ఉంటే.. మేం వాటిని 3,456కి తగ్గించాం. 25% షాపులు తగ్గాయి. బాబు హయాంలో 43 వేల బెల్టు షాపులు ఉండగా, మేం రాగానే వాటన్నిటినీ ఎత్తేశాం. మేనిఫెస్టోలో ఏం చెప్పామో అదే అమలు చేస్తున్నాం. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నవంబరు నాటికి రాష్ట్రంలో మద్యం వినియోగం 23.63 శాతానికి, బీరు వినియోగం 54.22 శాతానికి తగ్గింది. లాభాపేక్ష లేకుండా మద్య నిషేదాన్ని దశల వారీగా అమలు చేస్తున్నాం. మద్యం అమ్మకాలు తగ్గించే ఉద్దేశంతోనే ఉదయం 11 నుంచి రాత్రి 8 వరకే షాపులు తెరుస్తున్నాం. డీఎడిక్షన్ సెంటర్లు పెంచాలని వైద్యారోగ్య శాఖకు ఆదేశాలిచ్చాం. ఈ అంశాన్ని ఒక సబ్జెక్టుగా పెట్టాలని పాఠశాల విద్యా శాఖను ఆదేశించాం. గ్రామ సచివాలయాల్లో 14 వేల మంది మహిళా పోలీసులను నియమించి బెల్టు షాపులు, అక్రమ మద్యం ఉంటే రిపోర్టు చేసేలా చర్యలు తీసుకున్నాం. మద్య విమోచన ప్రచార కమిటీని ఏర్పాటు చేశాం. ఎక్సైజ్ చట్టానికి తీసుకొచ్చే సవరణతో.. అక్రమ మద్యం అమ్మితే క్రిమినల్ కేసులు పెడతాం. నాన్ బెయిలబుల్ చర్యలు తీసుకుంటాం. మొదటి సారి నేరం చేస్తే రూ.2 లక్షల ఫైన్, నేరాన్ని కొనసాగిస్తే రూ.5 లక్షలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష విధిస్తారు. బార్ లైసెన్సు ఫీజుకు రెట్టింపు జరిమానా, రెండోసారి కూడా తప్పు చేస్తే లైసెన్సు రద్దు చేస్తాం' అని సీఎం స్పష్టం చేశారు.

### జనావాసాల మధ్యే మందు: భవాని

'అధికారంలోకి రాగానే మద్య నిషేధం అమలు చేస్తామని జగన్ చెప్పారు. ఇప్పడేమో దశలవారీ అంటూ మాట తప్పారు. మద్యం షాపుల అద్దెలు ఎక్కువగా వైసీపీ నేతలకే దక్కాయి. అత్యధికంగా వాటికి రూ.40 వేలు అద్దె చెల్లిస్తున్నారు' అని టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఆరోపించారు. ప్రశ్నోత్తరాల సమయంలో మద్యం దుకాణాల అద్దెలపై ఆమె ప్రశ్న లేవనెత్తారు. జనావాసాలు, ఇళ్లు, గుడి, పాఠశాల తేడా లేకుండా షాపులు ఏర్పాటు చేశారని ఆరోపించారు. కొత్త మద్యం పాలసీ వైసీపీ నేతలకు కాసులు కురిపిస్తోందని మరో టీడీపీ ఎమ్మెల్యే రామానాయుడు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను ఎక్సైజ్ మంత్రి నారాయణస్వామి ఖండించారు. నివాస ప్రాంతాల్లోని మద్యం షాపులను ఇతర ప్రాంతాలకు మార్చామన్నారు. మద్యం టెండర్లలో 80% టీడీపీ నేతలే ఉన్నారని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతంలో డీకే కిశోర్, వెలగపూడి రామకృష్ణ, కాంతారావు తదితరులకు వారి అనుచరుల పేరిట షాపులున్నాయని చెప్పారు.

## రాజధానిని రాక్షసులు నాశనం చేస్తున్నారు

▸▸ మండలిలో వైవీబీ ఫైర్

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): "రాజధాని ఎంపికని 2014లో ప్రతిపక్ష నేతగా సమర్థించిన జగన్ మళ్లీ కమిటీ ఎందుకేశారు? అమరావతిపై జగన్ మీడియా, సీఎం, మంత్రులు.. ఒక్కోరకంగా ప్రచారం చేస్తున్నారు. నదుల పక్కన ఉండే నగరాలే అభివృద్ధి చెందిన విషయాన్ని ప్రభుత్వం గమనించాలి. దేవతల అమరావతిని రాక్షసులు నాశనం చేస్తున్నారు" అని వైవీబీ రాజేంద్రప్రసాద్ విమర్శించారు. రాజధాని అమరావతిపై శాసనమండలిలో సోమవారం చర్చ జరిగింది. వైవీబీ మాట్లాడారు. అసెంబ్లీ, మండలి, సచివాలయం, హైకోర్టు గ్రాఫిక్సా? అని నిలదీశారు. అమరావతిలో ఒకే సామాజిక వర్గానికి టీడీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందనే దుష్ప్రచారం సరికాదన్నారు. "టీడీపీ హయాంలో రాజధానిలో కేవలం రూ.177 కోట్ల పనులే జరిగాయని ఆర్థిక మంత్రి చెప్తున్నారు. రూ.2 లక్షల కోట్ల అవినీతి జరిగిందని వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ఇది విడ్డూరంగా ఉంది" అంటూ మండిపడ్డారు. రాజధానిలో అసైన్డ్ భూములిచ్చిన దళితులకు అన్యాయం జరిగిందంటున్న వైసీపీ నేతలు.. గతంలో వైఎస్సార్ పాలనలో వాన్‌పిక్ భూములు, ఇడుపులపాయంలో దళితుల భూములను లాక్కున్న విషయాన్ని మర్చిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాజధాని తరలింపు యోచన లేదని మండలిలో ప్రకటించిన మంత్రి, ఆ మరుసటి రోజే మాటమార్చారని మండిపడ్డారు. దీనిపై మంత్రి బొత్సా సత్యనారాయణ స్పందించారు. శివరామకృష్ణ కమిటీ రాజధానికి ఈ ప్రాంతం తగదని చెప్పిందన్నారు. అందుకే అమరావతిపై జీఎన్ రావు సమన్వయ కర్తగా నిపుణులతో కమిటీ వేశామని చెప్పారు.

## రైతు ఆత్మహత్యలను నమోదు చేయడం లేదు

▸▸ రాజప్ప, రామానాయుడు విమర్శ

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): "రైతు ఆత్మహత్యలను ఈ ప్రభుత్వం రికార్డుల్లో కూడా నమోదు చేయడం లేదు. రాష్ట్రంలో 275 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. కేవలం 39 మందిని మాత్రమే రికార్డుల్లో చూపిస్తున్నారు" అని టీడీపీ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీ గేటు బయట విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తుందన్నారు. రైతు భరోసా కింద రూ.50 వేలు ఇస్తామని చెప్పి... ఇప్పుడు కేంద్ర నిధులతో విడతల వారిగా రూ.37 వేలే ఇస్తోందన్నారు. పేదల ఇళ్ల నిర్మాణంలో నాణ్యతను పాటిస్తే మంత్రి బొత్స సత్యనారాయణ ఖర్చు ఎక్కువ పెట్టారని విమర్శిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. మంత్రి బొత్స లైనిన్ కాటన్ షర్టు ధర రూ.2 వేలు ఉంటుందని, తాను వేసుకున్న చొక్కా ధర రూ.1000 అని అన్నారు. ధర ఎక్కువగా ఉన్నంత మాత్రాన బొత్స అవినీతికి పాల్పడినట్లా? అని ఆయన ప్రశ్నించారు. తాము ఇచ్చిన ప్రశ్నలు చాలా వరకు సభ ముందుకే రావడంలేదన్నారు. సీఎం జగన్ సైగ చేస్తున్నారని, స్పీకర్ పోస్ట్‌పోన్ చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కాగా, "గత ప్రభుత్వ హయాంలో 2700 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వారికి పరిహారం ఇవ్వాల్సి వస్తుందని వారి పేర్లను రికార్డుల్లో కూడా నమోదు చేయలేదు" అని వైసీపీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు ధ్వజమెత్తారు.

## వేల కోట్లకు చేరిన జే ట్యాక్స్: బుచ్చయ్య

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జే ట్యాక్స్ వసూళ్ళు వేల కోట్ల రూపాయలకు చేరాయని తెలుగుదేశం శాసనసభాపక్ష ఉప నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి అసెంబ్లీ లాబీలో ఆరోపించారు. మద్యంలో రూ.6000 వేల కోట్లు జే ట్యాక్స్‌గా వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారని, సిమెంట్‌లో బస్తాకు ఇంతని చొప్పున మొత్తం రూ.4500 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని మొదలు పెట్టారని వింటున్నామన్నారు.

## రూలు అందరికీ ఒకటి కాదా!: స్వామి

ప్రశ్నోత్తరాల ప్రారంభానికి ముందు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలన్న టీడీపీ విన్నపాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం తిరస్కరించారు. సోమవారం ఉదయం శాసనసభ మొదలవ్వగానే మాట్లాడే అవకాశం ఇవ్వాలని టీడీపీ ఎమ్మెల్యే స్వామి స్పీకర్‌ను కోరారు. రూల్ 169 ప్రకారం ఇప్పటికే నోటీసు ఇచ్చామని వివరించారు. ఇప్పుడు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, నోటీసు గురించి తర్వాత పరిశీలన చేస్తానని స్పీకర్ స్పష్టం చేశారు. గతంలో వంశీకి వర్తింప చేసిన రూల్‌ను తమకు ఎందుకు వర్తింప చేయరని, రూల్ అందరికీ ఒకటి కాదా అని స్వామి ప్రశ్నించారు.

## అసెంబ్లీ ముట్టడికి విద్యార్థుల యత్నం

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి విద్యార్థులు ప్రయత్నించారు. శ్రీభాగ్ ఒడంబడికను అమలు చేయాలని, రాయలసీమలో రెండో రాజధాని ఏర్పాటు చేయాలని, కృష్ణా రివర్ బోర్డును రాయలసీమలో ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తూ 30 మంది విద్యార్థులు సోమవారం అమరావతికి చేరుకున్నారు. సచివాలయం బస్టాప్ వద్ద నుంచి వారు ముందుకు సాగారు. వారంతా అసెంబ్లీ గేటు వద్దకు వచ్చే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని అడ్డగించి అరెస్ట్ చేశారు.



అసెంబ్లీ వద్ద విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# 'ట్రయల్'లో కొత్త ట్విస్ట్




**పరిగణనలోకి ఐబీఎల్ ప్రతిభ**

**కీలకంగా మారిన మేరీ X జరీన్ నేటి బౌట్**

**న్యూఢిల్లీ:** టోక్యో ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను నేరుగా పంపించాలన్న బాక్సింగ్ సమాఖ్య నిర్ణయంపై తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ తీవ్ర నిరసన వ్యక్తంజేసింది. కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజుజుకు సైతం ఫిర్యాదు చేయడంతో దిగొచ్చిన భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) సెలెక్షన్ ట్రయల్ నిర్వహించాలని నిర్ణయించింది. దాంతో 51 కిలోల విభాగం సెలెక్షన్ ట్రయల్‌లో మేరీకోమ్-నిఖత్ జరీన్ తలపడనున్న తరుణంలో బీఎఫ్ఐ కొత్త ట్విస్ట్‌ను తెరపైకి తెచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ బాక్సింగ్ లీగ్ (ఐబీఎల్)లో చూపే ప్రతిభను కూడా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ సెలెక్షన్ ట్రయల్‌కు ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటామని సోమవారం ప్రకటించింది. దాంతో నిఖత్‌తోపాటు పింకీ రాణి కూడా రేసులో కొచ్చింది. ఐబీఎల్‌లో మేరీకోమ్-నిఖత్ బౌట్ మంగళవారం (17న) జరగనుంది. ఇక ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ సెలెక్షన్ ట్రయల్స్ ఈనెల 27, 28 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్నారు.

### నిఖత్ ఫైట్‌పై ఉత్కంఠ..

ఒలింపిక్ సెలెక్షన్ ట్రయల్స్‌లో ఒక్కో విభాగంలో నలుగురు బాక్సర్లు తలపడతారు. టాప్ ఇద్దరు బాక్సర్లుగా జ్యోతి గులియా, రితూ గ్రేవల్ 51 కిలోలలో ట్రయల్స్‌కు తమ స్థానాలు ఖరారు చేసుకున్నారు. కన్నూరులో జరిగిన జాతీయ మహిళా చాంపియన్‌షిప్‌లో జ్యోతి, రితు స్వర్ణ, రజత పతకాలు గెలిచారు. అయితే వారిద్దరికంటే మెరుగైన బాక్సర్లయిన మేరీకోమ్, పింకి, నిఖత్ ఐబీఎల్‌లో పోటీపడాల్సి ఉండడంతో కన్నూరు టోర్నీలో వీరు పాల్గొనలేదు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించడంతో.. సెలెక్షన్ ట్రయల్స్‌లో మూడో బాక్సర్‌గా మేరీ స్థానం కూడా ఖాయమైంది. ఇక నాలుగో స్థానం జరీన్‌దా? పింకీదా?? బీఎఫ్ఐ వర్గాల సమాచారం ప్రకారం ఐబీఎల్‌లో రాణింపు, మేరీపై గతంలో వీరిద్దరి ప్రదర్శనతోపాటు ఇతర లెక్కలు నాలుగో స్థానం ఖరారులో పరిగణనలోకి తీసుకుంటారు. 'ఐబీఎల్‌లో మంగళవారం జరిగే పోరులో మేరీపై గెలిచినా.. హోరాహోరీగా పోరాడి ఓడినా నాలుగో స్థానానికి తన పేరు జరీన్ పటిష్టం చేసుకుంటుంది. ఒకవేళ పోటాపోటీగా సాగిన బౌట్‌లో నిఖత్‌ను మేరీ ఓడిస్తే..ట్రయల్స్‌లో నాలుగో స్థానం కోసం విలువైన పాయింట్లను తెలంగాణ బాక్సర్ సాధిస్తుంది. ఒకవేళ మేరీకోమ్ సునాయాసంగా గెలిస్తే..ట్రయల్స్ పాయింట్లను జరీన్ గణనీయంగా కోల్పోతుంది' అని ఆ అధికారి వివరించారు. 'మేరీ కనుక నిఖత్‌ను ఓడిస్తే ఐబీఎల్‌లో ఇతర బాక్సర్ల ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. అలాంటి పరిస్థితిలో పింకీ రేసులోకి వస్తుంది. ఈ నేపథ్యంలో.. ట్రయల్స్‌లో మేరీకి పింకీ సూటబుల్ అని భావిస్తే ఆమెనే ఎంపిక చేస్తాం' అని ఆయన ముక్తాయించారు.


విరాట్ కోహ్లీ

## కోహ్లీ.. క్రికెట్ రొనాల్డో!

### లారా కితాబు



**విశాఖపట్నం:** విరాట్ కోహ్లీ... క్రికెట్‌లో సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోతో పోల్చదగిన ఆటగాడని విండీస్ బ్యాటింగ్ దిగ్గజం బ్రియాన్ లారా అన్నాడు. ఆటపై అంకితభావం, కఠోరసాధనే అతణ్ణి అత్యున్నత శిఖరాలకు చేర్చాయని కొనియాడాడు. 'నిజానికి రాహుల్, రోహిత్‌లకన్నా కోహ్లీ ప్రతిభావంతుడేమీ కాదు. కానీ అంకితభావం, మ్యాచ్‌కు సన్నద్ధమయ్యే తీరు అతడిని ఉన్నతస్థానంలో నిలిపాయి. అతడి శారీరక దారుఢ్యం, మానసిక స్థయిర్యం నమ్మశక్యంకాని రీతిలో ఉంటాయి. అందుకే నా దృష్టిలో కోహ్లీ క్రికెట్ రొనాల్డో. అలాగే బ్రాడ్‌మన్ నుంచి గ్యారీ సోబర్స్ వరకు ఏ తరానికి చెందిన జట్టులోనైనా అతడికి చోటుంటుంది. అన్ని ఫార్మాట్లలోనూ కోహ్లీ సగటు 50కి పైగా ఉండడం అసామాన్యం' అని లారా తెలిపాడు.

## విశాఖ చేరుకున్న జట్లు

### నేడు నెట్ ప్రాక్టీస్



**విశాఖపట్నం (స్పోర్ట్స్) :** ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరగనున్న రెండో వన్డేలో తలపడేందుకు భారత్, వెస్టిండీస్ క్రికెటర్లు సోమవారం నగరానికి చేరుకున్నారు. చెన్నై నుంచి మధ్యాహ్నం 12.15కు విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు ప్రత్యేక బస్సుల్లో నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. ఇరుజట్ల ఆటగాళ్లు మంగళవారం నెట్ ప్రాక్టీస్ చేస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వెస్టిండీస్.. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు భారత ఆటగాళ్లు సాధన చేస్తారు.

## విండీస్‌కు భారీ జరిమానా

**చెన్నై:** భారత్‌తో జరిగిన తొలి వన్డేలో స్లో ఓవర్‌రేట్‌కు కారణమైన వెస్టిండీస్ జట్టుకు 80 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించారు. నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు ఆలస్యం కావడంతో మ్యాచ్ రెఫరీ డేవిడ్ బూన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. విండీస్ బౌలర్ల సాగదీతతో భారత ఇన్నింగ్స్ నాలుగు గంటలకు పైగా సాగింది. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.22 ప్రకారం ప్రతీ ఓవర్ ఆలస్యానికి ఆటగాళ్లు 20శాతం చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. కెప్టెన్ పొలార్డ్ తమ తప్పును అంగీకరించడంతో ఎలాంటి విచారణా అవసరం లేదని ఐసీసీ పేర్కొంది.

## ఆసియా బీచ్ వాలీబాల్ ప్రారంభం

**విశాఖపట్నం (స్పోర్ట్స్):** జిల్లా, రాష్ట్ర వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో ఆసియా కాంటినెంటల్ బీచ్ వాలీబాల్ చాంపియన్‌షిప్ సోమవారం ప్రారంభమైంది. ఆర్కే బీచ్‌రోడ్డులో జరుగుతున్న ఈ టోర్నీలో ఆతిథ్య భారత్‌తోపాటు కజకిస్థాన్, ఇరాన్, శ్రీలంక జట్లు పాల్గొంటున్నాయి. ప్రతి దేశం నుంచి పురుషులు, మహిళల విభాగాలలో రెండేసి జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. తొలిరోజు జరిగిన పురుషుల విభాగంలో భారత్ ఆటగాళ్లు నిరాశపరచగా ఇరాన్, కజకిస్థాన్ ఆటగాళ్లు విజయాలు నమోదు చేశారు.

**తొలిరోజు ఫలితాలు:** బొగతు-యకోలెవ్ (కజకిస్థాన్-1) 21-16, 21-18 (2-0) స్కోరుతో ప్రహ్లాద్-అరోన్ (భారత్-1)పై, ధ్యాన్‌చెంకో-సిడోరెండో (కజకిస్థాన్-2) 24-22, 21-15 (2-0) స్కోరు తేడాతో ఎంఆర్‌కే రాజు-నరేష్ (భారత్-2)పై విజయం సాధించారు.



# అధునాతనం.. అత్యద్భుతం

**ఒలింపిక్స్ ప్రధాన స్టేడియం రెడీ**

| | | |
|---|---|---|
| స్టేడియం పేరు | : | న్యూనేషనల్ |
| ఎక్కడ | : | టోక్యోలోని షింజుకు |
| సామర్థ్యం | : | 68,089 (అథ్లెటిక్స్ పోటీలకు). ఇతర క్రీడలకు అదనపు సీట్ల ఏర్పాటుతో 80,016. పారా ఒలింపిక్స్‌కు 57,750కి తగ్గిస్తారు. |

### స్టేడియంలో జరిగే ఈవెంట్స్

| | |
|---|---|
| జూలై 24న | ప్రారంభోత్సవం |
| ఆగస్టు 9న | ముగింపు వేడుకలు |
| జూలై 31-ఆగస్టు 9 | అథ్లెటిక్స్ |
| జూలై 22-ఆగస్టు 8 | ఫుట్‌బాల్ మ్యాచ్‌లు |
| డిసెంబరు 21, 2019 | స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ ఎగ్జిబిషన్ పరుగు |
| జనవరి 1, 2020న | ఎంపరర్స్ కప్ ఫుట్‌బాల్ మ్యాచ్. |

**టోక్యో:** మరో ఏడు నెలల్లో జరిగే ఒలింపిక్స్‌కు టోక్యో నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన స్టేడియాన్ని ఆదివారం లాంఛనంగా ఆవిష్కరించారు. వచ్చే ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు జరిగే విశ్వ క్రీడలకు టోక్యో ఆతిథ్యమవ్వనుంది. ప్రారంభ, ముగింపు ఉత్సవాలు ఈ కొత్త నేషనల్ స్టేడియంలోనే జరగనున్నాయి. 1964 ఒలింపిక్స్‌కు ఉపయోగించిన నేషనల్ స్టేడియాన్ని కూల్చివేసి ఆ ప్రాంతంలో అత్యంత అధునాతన హంగులతో అత్యద్భుతంగా నూతన స్టేడియాన్ని నిర్మించారు. భూమినుంచి ఎగువన ఐదు అంతస్థుల్లో..దిగువన రెండు అంతస్థుల్లో ఎన్నో ప్రత్యేకతలతో దీన్ని నిర్మించారు.

### అదిరే వేడిని తట్టుకొనేలా..

ఒలింపిక్స్ జరిగే సమయంలో జపాన్‌లో అదిరిపోయే ఎండలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఆ ఎండలను తట్టుకొనేలా స్టేడియాన్ని తీర్చిదిద్దారు. ప్రతి అంతస్థు కప్పు మీద మొక్కలు నాటారు. అలాగే సూర్యకాంతి, వర్షం గ్యాలరీల్లో పడకుండా ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో చల్లని గాలులు ప్రవేశించేలా ఏర్పాట్లు చేశారు. ఇంకా..పొగమంచును నివారించే స్ప్రేయర్లను అందుబాటులో ఉంచారు. 185 ఫ్యాన్, 16 ఏసీ లాంజ్‌లు నిర్మించారు. ఔట్‌డోర్ పోటీలకు ఉపయోగపడేందుకు గాను..రూఫ్‌ను తెరుచుకొనేలా నిర్మించారు.

### స్టేడియం విశేషాలు ఇవీ..




- 2020 ఒలింపిక్స్‌కు జపాన్ మూడో బిడ్ వేయగానే కొత్త నేషనల్ స్టేడియం నిర్మాణానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.
- కొత్త స్టేడియానికి సంబంధించిన ప్లాన్‌ను 2012లో ఇరాక్-బ్రిటిష్ ఆర్కిటెక్ట్ జాహా హదిద్ విడుదలజేశారు. 72 మీటర్ల ఎత్తుండే స్టేడియం నిర్మాణానికి దాదాపు రూ. 13వేల కోట్లు అవుతుందని ఆమె అంచనా వేశారు.
- తైసీ, టకేనకా కార్పొరేషన్‌తో స్టేడియం నిర్మాణానికి 2015లో ఒప్పందం కుదుర్చుకున్నారు. కెంగో కుమాను ప్రాజెక్టు ఇన్‌చార్జ్‌గా నియమించారు.
- 2015 మేలో పాత స్టేడియం కూల్చివేత పనులు పూర్తికాగా..2016, డిసెంబరులో కొత్త స్టేడియం నిర్మాణం ప్రారంభమైంది. గతనెల 30న స్టేడియం సిద్ధమైంది.



## ఒంగోలులో నేటినుంచి ఆంధ్ర-ఢిల్లీ రంజీ

**ఒంగోలు (కార్పొరేషన్):** ఆంధ్ర-ఢిల్లీ జట్ల మధ్య రంజీ మ్యాచ్ మంగళవారం నుంచి ఒంగోలు శర్మ కళాశాల మైదానంలో జరగనుంది. నాలుగు రోజుల పాటు సాగే ఈ మ్యాచ్ నిర్వహణకు క్రికెట్ ప్రకాశం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేయగా, ఇరు జట్లు మూడు రోజుల ముందుగానే ఒంగోలు చేరుకున్నాయి. కాగా మ్యాచ్ నిర్వహణకు అవసరమైన సైట్ స్క్రీన్స్, డిజిటల్ స్కోర్ బోర్డ్‌లు విశాఖ స్టేడియానికి తీసిపోని విధంగా ఏర్పాటుచేశారు.

## నెం. 1గానే కోహ్లీ

**టెస్టు ర్యాంకింగ్స్**

**దుబాయ్:** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో బ్యాట్స్‌మెన్ జాబితాలో విరాట్ కోహ్లీ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. కోహ్లీ ఖాతాలో 928 పాయింట్లున్నాయి. అతడికి పోటీగా ఉన్న ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (911).. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో పెద్దగా రాణించకపోవడంతో రెండో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. భారత్ నుంచి పుజారా (4), రహానె (6) తమ ర్యాంకులను కాపాడుకున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న ఆసీస్ బ్యాట్స్‌మన్ లబుషేన్ మూడు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంకుకు చేరాడు. పాకిస్థాన్ స్టార్ బాబర్ ఆజమ్ (9) తొలిసారి టాప్-10లోకి ప్రవేశించాడు. బౌలింగ్‌లో కమిన్స్ (ఆస్ట్రేలియా) టాప్‌లోనే ఉండగా, బుమ్రా 6వ ర్యాంక్‌కు పడిపోయాడు. ఆల్‌రౌండర్లలో హోల్డర్, జడేజా టాప్-2లో కొనసాగుతున్నారు.

## స్టోక్స్‌కు 'బీబీసీ' అవార్డు



**అబర్డీన్ (స్కాట్లాండ్):** ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అరుదైన ఘనతను అందుకొన్నాడు. 2019కిగాను 'బీబీసీ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది వన్డే వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌ను విశ్వ విజేతగా నిలపడంలో స్టోక్స్ ప్రధాన పాత్ర పోషించాడు. అలాగే యాషెస్ సిరీస్ మూడో టెస్ట్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.







Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.